ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

11-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 131 పేజీలు: 10+4 వెల: 6.50

కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం?
కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్: 21 మంది మృతి
5లో

CBC 01101/13/0006/2627
అన్నదాతకు సాధికారం బంగారం, మన వ్యవసాయం

ఈ 12 ఏళ్లలో అయిదు రెట్లు పెరిగి, వ్యవసాయ బడ్జెట్టు 1.40 లక్షల కోట్లకు చేరింది.
ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా-హరిత వ్యవసాయం, పరంపరాగత క్రిషి వికాస్ యోజన కింద నేడు 28 లక్షల హెక్టార్లకు పంటల విస్తరణ
12 ఏళ్లు ప్రభుత్వం-విశ్వాసం, వికాసం, ప్రజా సంక్షేమం
Government of Bharat



# ప్రజలే నా దేవుళ్లు

● పన్నెండేళ్లుగా అవినీతిరహితంగా సాగుతున్న పాలన ● కాంగ్రెస్ కుంభకోణాల పీడనుంచి దేశానికి విముక్తి ● ప్రధానిగా సుదీర్ఘకాలం నాకు దక్కిన అదృష్టం ● ఎన్డీయే పార్టీల సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశంలో గడచిన పన్నెండేళ్లనుంచి దేశానికి పట్టిన కాంగ్రెస్ పీడ విరగడయిందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పాలనలో వైఫల్యాలను ఎన్డీఎ సరిదిద్దుతోందన్నారు. కాంగ్రెస్ తన వైఫల్యాలను హిందువులపైనెట్టిందని ధ్వజమెత్తారు. రూ.వేలకోట్ల కుంభకోణాలకు కాంగ్రెస్ పాల్పడిందని ఆగ్రహించారు. కాంగ్రెస్ పాలనలో వృద్ధిరేటు దారుణంగా ఉందని చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వ్యవస్థలు కుప్పకూలాయని మండిపడ్డారు. దేశ ప్రజలకు ఎన్డీయే పాలనపై విశ్వాసం రెట్టింపు అయిందని అన్నారు. బుధవారం ఢిల్లీలో జరిగిన ఎన్డీఎ భాగస్వామ్య పక్షాల సదస్సుకు ప్రధాని మోదీ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ఇనుప సంకెళ్ల నుంచి దేశాన్ని రక్షించామని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. అవినీతి రహితంగా ఎన్డీఎ పాలన సాగుతోందని స్పష్టం చేశారు. ప్రధానిగా సుదీర్ఘకాలం పనిచేసే అవకాశం దక్కడం తన అదృష్టమని తెలిపారు. ఇది తనకు అద్భుతమైన క్షణమని వ్యాఖ్యానించారు. తన జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశానని ప్రస్తావించారు. దేశ ప్రజలే తనకు దేవుళ్లు అని ఉద్ఘాటించారు. ఎన్డీఎలో ప్రతి పార్టీకి సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని వివరించారు. తనను అభినందిస్తూ ఎన్డీఎనేతలు తీర్మానం చేశారని పేర్కొన్నారు. ఈసందర్భంగా ఎన్డీఎ నేతలకు ధన్యవాదాలు తెలిపారు. అధికారాన్ని సేవగానే భావించానని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. >>2



## చరిత్రలో మోడీది కొత్త అధ్యాయం

### నెహ్రూను దాటిన ఘనత ఆయనకే దక్కింది: రాష్ట్రపతి ముర్ము ప్రశంస

**న్యూఢిల్లీ,జూన్ 10:** ప్రధానిగా మోడీ 12 ఏళ్లు పూర్తి చేసుకున్న ఈ చారిత్రాత్మక మైలురాయి సందర్భంగా రాష్ట్రపతి ముర్ము ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. మోడీ నాయకత్వంపై దేశప్రజలకుఉన్న అచం >>2



## శక్తిమంతుడైన గొప్ప నాయకుడు మోడీ

### గత పన్నెండేళ్లలో మరింత మెరుగుపడిన ఇండో-యుఎస్ సంబంధాలు: ట్రంప్

**న్యూఢిల్లీ,జూన్ 10:** ఎన్డీయే పాలన 12 యేళ్లు పూర్తిచేసుకోవడంతో పాటు ప్రధానిగా నరేంద్ర మోడీ జవహర్‌లాల్ నెహ్రూను అధిగమించిన రికార్డుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ స్పందిం చారు. ఏకకాలంగా 12 >>2

## దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఇకలేరు

### దీర్ఘ అస్వస్థతతో చెన్నైలో కన్నుమూత

### పద్మశ్రీసహా ఆరు జాతీయ పురస్కారాలు పొందిన బహుభాషా దర్శకుడు



తమిళంలో కిళక్కు పోగురైల్, ముదల్ మరియాదై, తెలుగులో సీతాకోకచిలుక వంటి హిట్ చిత్రాలతో ఖ్యాతి

ఘనంగా నివాళులర్పించిన తమిళ సిఎం విజయ్, తెలుగు సిఎంలు, పలువురు ప్రముఖులు

**చెన్నై,జూన్ 10:** దక్షిణాది చలనచిత్ర రంగంలో దిగ్గజ దర్శకునిగా వెలుగొందిన భారతీరాజా (85) కన్నుమూశారు. కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ భారతీ రాజా మృతి చెందారు. 1941 జులై 17న జన్మించిన భారతీ రాజా పదహారేళ్ల వయసు, సీతాకోక చిలుక, ఆరాధన సినిమాలకు జాతీయ అవార్డులు అందుకున్నారు. భారతీరాజా 1974లో చంద్రలీలను వివాహం చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కొడుకు మనోజ్ తాజ్ మహల్ చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. 2025 మార్చి 25న గుండెపోటుతో మనోజ్ మరణించారు. భారతీరాజా అసలు పేరు చిన్నస్వామి. ఆయన 1941 జూలై 17న తమిళనాడులోని తేని అల్లినగరంలో జన్మించారు. బాల్యం నుంచీ భారతీరాజా కళల పట్ల ఆకర్షితుడై >>2

# 'ఫ్యూచర్'ను రద్దుచేస్తే బాదుడే

### ప్రజలు బండకేసి కొడతారని హెచ్చరించిన సిఎం రేవంత్

### బిఆర్ఎస్‌కు ఇక ప్రతిపక్ష హోదా కూడా రాదు..

### కబ్జాకోరులపై ఉక్కుపాదం.. తోకలు కత్తిరిస్తాం

### గంట వానొస్తే హైదరాబాద్ వరదమయం

### ఫ్యూచర్‌సిటీ అభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి



బుధవారం ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో స్పీకర్ గడ్డెం ప్రసాద్ కుమార్, డిప్యూటీ సిఎం భట్టి, మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు తదితరులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్10:** ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని కొందరు మాట్లాడుతున్నారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. భవిష్యత్తు నగరాన్ని రద్దు చేస్తామంటే ఈ ప్రాంత ప్రజలు బండకేసి కొడతారని హెచ్చరించారు. అలాంటి వారికి రాజకీయంగా భవిష్యత్తు ఉండదని, ఆ పార్టీ నేతలు ప్రవర్తన ఇలాగే కొనసాగితే, వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని విమర్శించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పాలనను సమర్థవంతంగా, సాంకేతికంగా అందించేందుకు రెండెకరాల్లో నిర్మించిన భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ ఎఫ్‌సిడిఎ కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం సిఎం రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ లోగో, పోర్టల్, వెబ్‌సైట్‌ను సిఎం ఆవిష్కరించారు.

ఫ్యూచర్ సీటీ డెవలప్‌మెంట్ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మంత్రులు శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో కలిసి సిఎం పరిశీలించారు. ఫ్యూచర్‌సిటీలో పాలన దిశగా సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ ముందడుగు వేయనుంది. అనంతరం ఆయన మాట్లాడారు. రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు వేశామన్న సిఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్‌కు గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఆదాయం హైదరాబాద్‌నుంచే వస్తోందని పేర్కొన్నారు. బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములు విలువ ఎక్కువన్న సిఎం, కుతుబ్‌షాహీలు, నిజాంలు కృషివల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందిందని తెలిపారు. హైటెక్‌సిటీ అంటే నవ్విన వాళ్లు ఉన్నారని, విమానాశ్రయం, జీనోమ్ >>2

నీతి ఆయోగ్ సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన సిఎం 2లో

# వేగంగా నీటి ప్రాజెక్టులు



బుధవారం నిజామాబాద్ జిల్లాలో జకోరా-చందూర్ ఎత్తిపోతలు ప్రారంభించి ప్రసంగిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

### రూ. 5వేల కోట్లతో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజి

### సిద్దాపూర్ రిజర్వాయర్ అంచనాలకు త్వరలో ఆమోదం

### ఇప్పటికే 147 లక్షల మె.ట ధాన్యం కొనుగోలు

### జకోరా-చందూర్ ఎత్తిపోతలు ప్రారంభించిన మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, జూన్ 10 ప్రభాతవార్త :** రాష్ట్రంలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం పునరుద్ధరణ, అటవీ అనుమతులు, ప్రత్యామ్నాయ అటవీకరణ వంటి సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రి రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి బుధవారం నిజామాబాద్ జిల్లాలో జకోరా-చందూర్ ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి, సిద్ధాపూర్ రిజర్వాయర్ పనుల పురోగతిని సమీక్షించారు.అనంతరం నిర్వహించిన ప్రజాసభలో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సిద్ధాపూర్ రిజర్వాయర్ సవరించిన అంచనాలకు త్వరలో ఆమోదం లభిస్తుందని, ప్రాజెక్టును వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా వర్ని, చందూర్, కుస్లా మండలాల్లోని సుమారు 7,975 ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందని తెలిపారు. సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ >>2



## రక్షణమంత్రి రాజ్‌నాథ్ రేపు హైదరాబాద్ రాక

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్10:** పశ్చిమ బెంగాల్‌లో ఘన విజయం సాధించడంతో ఉత్సాహంగా ఉన్న బిజెపి జాతీయ నాయకత్వం ఇక తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాలపై దృష్టి సారించేందుకు సమాయత్తమైంది. ఇందులో భాగంగానే ఈ నెల 12న కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హైదరాబాద్‌కు రానున్నారు. కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాక సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. కేంద్ర మంత్రులు జి. కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఇంకా ఎంపీలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఇతర >>2

### మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై

# భగ్గుమన్న కాంగ్రెస్

### జిల్లాల్లో తీవ్ర నిరసనలు, బిజెపి దిష్టిబొమ్మలు దగ్ధం

### ప్రతిపక్షాల గొంతు నొక్కే కుట్ర: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్

### ఇది చీకటి రోజు: వి. హనుమంతరావు



బుధవారం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన ప్రదర్శన జరుపుతున్న విహెచ్, కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్,జూన్10,ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ఎఐసిసి ఇంచార్జీ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సభ్యత్వం కోసం దాఖలు చేసిన నామిషన్ తిరస్కరించడంపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమైనాయి. ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేసిందంటూ జిల్లా కేంద్రాల్లో బిజెపి పార్టీ దిష్టిబొమ్మలను కాంగ్రెస్ శ్రేణులను దగ్ధం చేశారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష కుమార్ గౌడ్‌నుంచి మొదలు కొని మంత్రులు,అనేక జిల్లా కార్యవర్గసభ్యుల వరకు గాయపడ్డ హృదయంతో దురన్యాయం ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి తీవ్ర దెబ్బ అని టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. బిజెపి రాజకీయ కుట్రల పరాకాష్టే ఈ ఘటన అని, ప్రతిపక్షాల గొంతునొక్కే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఆరోపిం >>2



## భారత్ నౌకపై అమెరికా వైమానిక దాడి

### తీవ్ర నిరసన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ,జూన్ 10:** గల్ఫ్ఆఫ్ ఓమన్ తీరంలో భారత్‌కు వస్తున్న ఆయిల్ ట్యాంకర్‌పై అమెరికా దళాలు దాడులుచేయడంపై భారత్ తీవ్ర నిరసన వ్యక్తంచేసింది. భారతీయ క్రూసిబ్బందికూడా ఈ ఆయిల్ ట్యాంకర్‌లోఉన్నారు. ఇప్పటికీ ముగ్గురు భారతీయ సిబ్బంది ఆచూకీ తెలియడంలేదని భారత విదేశాంగశాఖ వెల్లడించింది. అంతేకాకుండా పలావు జాతీయ జెండా ఉన్న సెట్టెబెల్లో ఆయిల్‌ట్యాంకర్‌ను అమెరికా దళాలు ఓమన్ తీరంలో దాడిచేసాయి. ఇంజిన్‌లోకి క్షిపణి దూసుకువచ్చింది. దీనివల్ల ఆయిల్ ట్యాంకర్‌కు మంటలు అలుముకున్నాయి. మొత్తం 24 మందిలో 21 మందిని రక్షించినా మరోముగ్గురు ఇప్పటికీ ఆచూకీ తెలియ >>2



బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీకి జ్ఞాపికను అందజేస్తున్న ఎపి సిఎం చంద్రబాబు నాయుడు

# నేడు కాంగ్రెస్ అత్యవసర సమావేశం

## పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులు, పిసిసి అధ్యక్షులకు ఆహ్వానం

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశంలో తాజా రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు వీలుగా గురువారం కాంగ్రెస్ పార్టీ అత్యవసరం సమావేశం ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రటరీ కె.సి. వేణుగోపాల్ 'ఎక్స్' వేదికగా తెలిపారు. "ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించేందుకు రేపు, జూన్ 11, 2026న న్యూఢిల్లీలోని ఇందిరా భవన్‌లో ఎఐసిసి జనరల్ సెక్రటరీలు, ఇన్‌చార్జ్‌లు, పిసిసి అధ్యక్షుల అత్యవసర సమావేశం జరగనుంది. ఈ కీలక సమావేశానికి ఐఎన్‌సి అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షత వహిస్తారు" అని తెలిపారు. జూన్ 8న జరిగిన ఇండియా బ్లాక్ సమావేశం జరిగిన కొద్ది రోజులకే కాంగ్రెస్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించాలనే నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాజ్‌నాథ్ రేపు హైదరాబాద్ రాక

>> ముఖ్య నేతలతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. 12న సికింద్రాబాద్‌లోని రాజరాజేశ్వరి గార్డెన్స్‌లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల, మేధావుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రాజ్‌నాథ్ సింగ్ పన్నెండేళ్ల ప్రధాని నరేంద్ర మోడీ పాలనపై ప్రసంగిస్తారు. ఇంకా విడిగా పార్టీ రాష్ట్ర నాయకులతోనూ ఆయన సమావేశమవుతారు. పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ నేతల మధ్య సమన్వయం, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలకు శిక్షణా తరగతుల నిర్వహణ, మహిళా మోర్చా, ఇతర మోర్చాల బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపైనా వారు చర్చిస్తారు. ఆ మర్నాడు (13న) దుండిగల్ ఏయిర్ ఫోర్స్ అకాడమీలో, హకీంపేటలోని అధికారిక కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొంటారు.

# నీతి ఆయోగ్ సమావేశం కోసం ఢిల్లీ వెళ్లిన సిఎం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్10:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఢిల్లీకి వెళ్లారు. గురువారం ప్రధాని మోడీ అధ్యక్షతన జరిగే నీతి ఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారు. ఈ ఉన్నత స్థాయి భేటీలో దేశంలోని వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు కేంద్రమంత్రులతో దేశాభివృద్ధిపై చర్చించనున్నారు. దీంతోపాటు పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధం దానివల్ల జరుగుతున్న నష్టాలతో పాటు దేశ ఆర్థిక పరిస్థితి గురించి కూడా ప్రధాని చర్చించనున్నట్టుగా సమాచారం. ఈపర్యటనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలు, పెండింగ్ నిధులు, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కీలక అంశాలపై సిఎం రేవంత్ తన అభిప్రాయాలను, సూచనలను నీతిఆయోగ్ సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి కేంద్రం ముందు ఉంచనున్నట్టుగా సమాచారం. ఈ సమావేశం అనంతరం కాంగ్రెస్ అగ్రనేతలను సిఎం రేవంత్‌రెడ్డి కలిసి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణతో పాటు పలు అంశాలపై అగ్రనేతలతో మాట్లాడనున్నట్టుగా తెలిసింది.

# ప్రజలే నా దేవుళ్లు

>> తమ హయాంలో స్థిరమైన పాలనతో అభివృద్ధి వేగవంతం అయిందని వెల్లడించారు. 2014కి ముందు దేశంలో ఎంతో అస్థిరత ఉందని తెలిపారు. 2014 తర్వాత దేశ రూపురేఖల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని ప్రస్తావించారు. ఎన్డీఎపై దేశ ప్రజల్లో నమ్మకం పెరిగిందని అన్నారు. 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తున్నామని ఉద్ఘాటించారు. అన్నివర్గాల ప్రజల ఆశలకు అనుగుణంగా నడుస్తున్నామని పేర్కొన్నారు. గతంలో దశాబ్దాలపాటు జరిగే అభివృద్ధి ఇప్పుడు కేవలం నెలల వ్యవధిలోనే జరుగుతోందని వివరించారు. తమ పథకాలు, కార్యక్రమాలను ప్రజలు ఆదరించారని ప్రధాని మోడీ తెలిపారు. వికసిత్ భారత్‌లో అందరూ భాగస్వాములయ్యారని వెల్లడించారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశామని చెప్పారు. ఇంటర్నెట్ యూజర్ల సంఖ్యను 25 కోట్ల నుంచి 100 కోట్లకు పెంచామని అన్నారు. కరోనా లాంటి సంక్షోభాన్ని అధిగమించామని ఉద్ఘాటించారు. స్థిరమైన ప్రభుత్వం ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. తాము లెక్కలు మాత్రమే చెప్పడం లేదని ఆచరణలో చేసి చూపించామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తమ పాలసీలు ఉంటాయని వివరించారు. ప్రపంచ దేశాలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నా భారత్‌లో 7.7శాతం వృద్ధి రేటు ఉందని పేర్కొన్నారు.

సామాన్యులపై భారం తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ప్రధాని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వృద్ధిరేటు కంటే ఎన్డీఎ హయాంలోని 12 ఏళ్లలో వృద్ధిరేటు తేలిపోయిందని అన్నారు. దేశంలో మావోయిస్టులను అంతం చేశామని తెలిపారు. నేషన్ ఫస్ట్ నినాదంతో పనిచేస్తున్నామని వివరించారు. దేశ భవిష్యత్తు కోసం కఠిన నిర్ణయాలకూ కూడా వెనుకాడమని చెప్పారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించామని తెలిపారు. ట్రిపుల్ తలాక్ చట్టం తీసుకువచ్చామని, ఆర్టికల్ నంబర్ 370ని రద్దు చేశామని అన్నారు. కశ్మీర్‌లో ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపామని చెప్పుకొచ్చారు. తనకు పార్టీ కంటే దేశ ప్రజలే ముఖ్యమని స్పష్టం చేశారు. తమది లెక్కల ప్రభుత్వం కాదని ఆచరణాత్మక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. దేశంలో డిజిటల్ పేమెంట్లను ప్రోత్సహించామని ప్రధాని మోడీ వ్యాఖ్యానించారు. ప్రపంచమంతా ఇప్పుడు భారత్‌వైపు చూస్తోందని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారడానికి మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందని వివరించారు. విదేశాలపై ఆధారపడటం తగ్గించుకోవాలని సూచించారు. మేడ్ ఇన్ ఇండియా నినాదం సాకారమవుతోందని అన్నారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నౌకలు తయారు చేస్తున్నామని తెలిపారు. అణుఇంధన ఉత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. డేటా సెంటర్ల హబ్‌గా భారత్ మారుతోందని వ్యాఖ్యానించారు. 500 గిగావాట్ల ఇంధన లక్ష్యాన్ని సాధించాలని చెప్పుకొచ్చారు. సెమీకండక్టర్లు, క్రిటికల్ మినరల్స్‌పై దృష్టిపెట్టామని తెలిపారు. ప్రపంచం కంటే ఒకడుగు మనమే ముందుండాలని ప్రధాని మోడీ పేర్కొన్నారు.



బుధవారం న్యూఢిల్లీలో ఎన్డీయే సమావేశం సందర్భంగా అల్పాహార విందు స్వీకరిస్తున్న ప్రధాని మోడీ తదితరులు

# 'ఫ్యూచర్'ను రద్దుచేస్తే బాదుడే

>> వ్యాలీ, ఐటీ సంస్థలను ఆనాడు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఐటీ పరిశ్రమలు రాకుంటే ఈనాడు యువతకు ఉద్యోగాలు వచ్చేవా? అని ప్రశ్నించారు. 10 లక్షల మందికి ఉపాధి లభించేదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బిఆర్ఎస్ చెబుతోందని సిఎం అన్నారు. బిఆర్ఎస్ పార్టీ రద్దయిన వెయ్యి నోటు అని ఎద్దేవా చేశారు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. ఔటర్ రింగ్ రోడ్‌ను బిజెపి, బిఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారని ఆగ్రహించారు. అభివృద్ధి జరగొద్దని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. శుక్రాచార్యుడు ఫామ్‌హౌస్‌లో ఉన్నారని, మారీచుడు, సుభాహు జనంలోకి వచ్చారని సెటైర్లు గుప్పించారు. వీళ్లంతా కలిసి తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. కళ్లలో నిప్పులు పోసుకుని కడుపులో విషం నింపుకొని అమెరికాలో మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని, మూసీలో మురికి కంటే ఎక్కువ విషాన్ని చిమ్ముతూ కుట్రలు చేస్తున్నారని ఆగ్రహించారు. ఏడ్చేవాళ్లు ఏడవండి.. తాము అభివృద్ధి చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నిన్న కురిసిన రెండు గంటల వర్షానికే హైదరాబాద్ వరదమయమైందని చెప్పుకొచ్చారు. ఇదేనా మీ పదేళ్ల అభివృద్ధి? అని ప్రశ్నించారు. చెరువులు, నాలాలు కబ్జా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. తొలకరి వర్షం పడితేనే హైదరాబాద్‌లో రోడ్లు ఎక్కడికక్కడ స్తంభించి పోయాయని కిలోమీటర్ దూరానికి రెండు నుంచి నాలుగు గంటలు పట్టిందన్నారు. 100 కోట్లకు ఎకరం అమ్మినమని జబ్బలు చర్చుకున్న వాళ్లు నిన్నటి వరదలకు సమాధానం చెప్పాలన్నారు. ప్రభుత్వ భూములను అక్రమించుకుని కుంటలను చెరపట్టడం వల్లనే చెరువుల్లో ఉండాల్సిన నీళ్లు కాలనీలు,బస్తీలకు వచ్చాయన్నారు. ప్రభుత్వ భూములు,చెరువులను,కుంటలను అక్రమించుకున్న వారి కట్టడాలను నిర్దాక్షణ్యంగా కూలుస్తున్నామని చెప్పారు. మేం ఎవరిదైనా ఇంచు భూమైనా తీసుకున్నామా? ఆక్రమణలను తొలగించి చెరువులను పునరుద్దరిస్తున్నామన్నారు. బిఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్‌రెడ్డి బతుకమ్మ కుంటను ఆక్రమించి, కెసిఆర్ సభలకు హెలికాప్టర్‌లో పూలు చల్లాడని గత ప్రభుత్వం ఆయనకు రాసిచ్చిందన్నారు. బతుకమ్మ కుంటను దుర్మార్గులు చెరపడితే వాళ్ల పనిపట్టి పునరుద్దరించామని, కబ్జాకోరులు బాధపడినా పర్వాలేదని, తమ అభివృద్ధి ప్రయత్నం మాత్రం ఆగదని తేల్చిచెప్పారు. కబ్జాకోరులపై ఉక్కుపాదం మోపుతామని.. తోకలు కత్తిరిస్తామని హెచ్చరించారు. ప్రపంచానికి దిక్సూచిగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం నిలుస్తుందని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని సిఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు రాష్ట్ర భవిష్యత్తు ముఖచిత్రాన్ని మార్చబోతోందని ధీమా వ్యక్తం చేశారు.

కేవలం 150 రోజుల రికార్డు సమయంలో ఫ్యూచర్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ భవనాన్ని పూర్తి చేయడం ప్రభుత్వ చిత్తశుద్ధికి, వేగానికి నిదర్శనమని ముఖ్యమంత్రి తెలిపారు. రాబోయే ఎనిమిదేళ్లలో ఫ్యూచర్ సిటీని న్యూయార్క్, టోక్యో, సింగపూర్‌వంటి అంతర్జాతీయ నగరాలకు దీటుగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. 2034నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యసాధనలో ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదని, ప్రపంచానికి అని స్పష్టం చేశారు.గతంలో హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్, జీనోమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్ విస్తరించడం వల్లే ప్రపంచ పటంలో నగరానికి ప్రత్యేక స్థానం లభించిందని గుర్తుచేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు హైదరాబాద్‌లో రహదారులు జలమయం కావడాన్ని ప్రస్తావిస్తూ.. చెరువులు, నీటి వనరులు ఆక్రమణలే ఇందుకు ప్రధాన కారణమని ముఖ్యమంత్రి అన్నారు. గత ప్రభుత్వాల హయాంలో జరిగిన భూకబ్జాలను తొలగించి, చెరువులను పునరుద్ధరించడం ద్వారా 'లేక్ ఎకానమీ'ని అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఈ ఏడాది డిసెంబర్‌లో మరో గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

హైదరాబాద్ నగరాన్ని నిరంతరం విస్తరించడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని ఆయన అన్నారు. 200 ఏళ్ల క్రితం హైదరాబాద్‌ను విస్తరించడం వల్ల సికింద్రాబాద్‌తో కలిసి జంట నగరాలుగా విలసిల్లుతున్నాయన్నారు. 1908లో తుఫాన్ వచ్చి వేలాది మంది ప్రాణాలు కోల్పోతే ఆ నాటి నిజాం నవాబు మూసీ నదిపైన నిర్మాణాలు చేశారని, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో యుద్ధ సామాగ్రిని ఉంచడం వల్ల శత్రు దుర్భేద్యంగా మారిందన్నారు. ఆ నాటి పాలకులు సైబరాబాద్‌ను నిర్మించి గొప్ప నగరాన్ని ప్రపంచానికి అందించారన్నారు.గ్రీన్ ఫార్మా,జిసిసి,ఐటీ కంపెనీలతో పాటు ప్రపంచంలోని ప్రసిద్ది గాంచిన 500 పెద్ద కంపెనీలు ఫ్యూచర్ సిటీకి రప్పించబోతున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అడ్డుపడిన వాళ్లను అడ్డంగా తొక్కుకుంటూ ఈ ప్రాంతం వాళ్లే వెళ్తారని, ఈ నగరాన్ని ఇక్కడి వాళ్లే కాపాడుకుంటారని, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. వీలైనప్పుడల్లా ఫ్యూచర్ సిటీ అథారిటీ కార్యాలయానికి వస్తానని, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు వారానికోసారి ఇక్కడికి వస్తారన్నారు. అనంతరం ఫ్యూచర్ సిటీ పరిధిలోకి కొన్ని గ్రామాలను కలుపుతూ సిద్ధం చేసిన ఫైల్‌పై వేదికపై నుంచే సిఎం రేవంత్‌రెడ్డి సంతకం చేశారు. ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఎంపికైన కన్సల్టెంట్ సంస్థ ప్రతినిధులకు లెటర్ ఆఫ్ అవార్డును అందజేశారు.

# వేగంగా నీటి ప్రాజెక్టులు

>> ప్రభుత్వం వ్యవసాయం, నీటిపారుదల రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి చెప్పారు. సిఎం ప్రకటించిన ఐదువేల కోట్ల రూపాయల ప్యాకేజీతో ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించి, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణం మరింత వేగవంతం అవుతుందని ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాల్లో నీటిపారుదల, పౌర సరఫరాల శాఖలు కీలక రంగాలుగా మారాయని అయన అన్నారు.ఉత్తర తెలంగాణ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేసిన మంత్రి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను వేగవంతం చేస్తామని ఆయన తెలిపారు. ప్రస్తుత వ్యవసాయ సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సుమారు 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని వివరించారు. రైతులు పండించిన ఒక్క ధాన్యపు గింజ కూడా కొనుగోలు కాకుండా మిగిలిపోనివ్వమని ఆయన హామీ ఇచ్చారు.వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని అన్ని నీటిపారుదల ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తామని, రైతుల జీవనోపాధి మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నీటిపారుదల శాఖ అధికారులు, పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# చరిత్రలో మోడీది కొత్త అధ్యాయం

>> చలమైన నమ్మకానికి ఈ సుదీర్ఘ పాలనే నిదర్శనమని రాష్ట్రపతి కొనియాడారు. ఆయన హయాంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా దూసుకుపోతోందని, అట్టడుగు స్థాయి ప్రజలకు సైతం సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ప్రశంసించారు. ముఖ్యంగా ఆదివాసీల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎంజన్మన్, ధర్తీ ఆబా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ వంటి పథకాలకు తన హృదయంలో ప్రత్యేక స్థానం ఉందని ముర్ము వెల్లడించారు. ఆత్మనిర్భర్, వికసిత్ భారత్ దార్శనికతతో ప్రధాని మోదీ దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారని, ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం భావితరాల్లో భారత ప్రజాస్వామ్యంపై నూతన విశ్వాసాన్ని నింపుతుందని రాష్ట్రపతి ఆశాభావం వ్యక్తం చేశారు. భారత రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని ప్రధానిమోడీ లిఖించారు. దేశ ప్రధానిగా నరేంద్ర దామోదరదాస్ మోడీవరుసగా అత్యధిక కాలం పాలించిన అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించి మోడీ ఈ ఘనత సాధించారు. 2014 మే 26న తొలిసారి బాధ్యతలు చేపట్టిన మోదీ, నేటితో (బుధవారం) ప్రధానిగా వరుసగా 4,399 రోజులు పూర్తి చేసుకున్నారు. గతంలో నెహ్రూ ఎన్నికైన ప్రధానిగా వరుసగా 4,398 రోజులు (1952 మే 13 నుండి 1964 మే 27 వరకు) పనిచేయగా ఇప్పుడు మోడీఆ రికార్డును దాటేశారు. ఈ జాబితాలో ఇందిరాగాంధీ (4,077 రోజులు) మూడో స్థానంలో ఉన్నారు.

# గొప్ప నాయకుడు మోడీ

>> యేళ్లు పూర్తిచేసుకున్న ప్రధానిమోడీని ట్రంప్ అభినందిస్తూ "మిత్రునికి శుభాభినందనలు. భారత్‌కు సుదీర్ఘకాలం పనిచేసిన చేస్తున్న ప్రధానమంత్రి నామిత్రుడు మోడీ" ఆయన ఒక గొప్ప నాయకుడు అని శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానిమోడీ శక్తివంతమైన గొప్ప నాయకుడని, అంతేకాకుండా ఆలోచనాశక్తి ఉన్న ప్రముఖ మేధావి అని కొనియాడారు. అమెరికా భారత్‌లమధ్య ఉన్న సంబంధాలు ఈ 12 యేళ్లకాలంలో మరింత పురోగమించాయని ఆయన ఈసందర్భంగా ప్రస్తావించారు. ఆయన మరింత సుదీర్ఘకాలం పదవిలో కొనసాగి మరింత అభివృద్ధిలోకి తీసుకురావాలని ట్రంప్ ఆకాంక్షించారు.

## వారం - వర్జ్యం

11-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
ఏకాదశి రా.10.31
రేవతి ఉ.8.14
వర్జ్యం : రా.2.45 - తె.4.14
దు.ఉ.9.56-ఉ.10.48. 2)మ.3.11-సా.4.03
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** సన్నిహితుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**వృషభం:** భాగస్వామ్య వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. అనుకొని అవకాశాలు లభిస్తాయి.వివాదాలకు దూరంగా ఉండండి.

**మిథునం:** ఆస్తి వివాదాలు తీరి లబ్ధి పొందుతాయి. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వివాహ యత్నాలు ముమ్మరం చేస్తారు.

**కర్కాటకం:** సంతాన విద్యావిషయంలో జాగ్రత్తలు అవసరం. మంచితనంతో అందరినీ ఆకట్టుకుంటారు.వాహనసౌఖ్యం.

**సింహం:** ఆర్థిక పరిస్థితి కొద్దిపాటి ఒడిదుడుకులుగా ఉంటుంది. కుటుంబసభ్యుల సహాయం అందుకుంటారు.వస్త్రలాభం.

**కన్య :** వ్యాపారాలు పురోభివృద్ధిలో ఉంటాయి. పరిశ్రమలలో ఏర్పడిన అవరోధాలు తొలగుతాయి.

**తుల :** ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. కొత్త కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. స్పెక్యులేషన్ కలిసి వస్తుంది. వస్త్రలాభం.

**వృశ్చికం:** కొన్ని పనులు అప్రయత్నంగా పూర్తి కాగలవు. వివాహయత్నాలు సాగిస్తారు. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

**ధనుస్సు:** కీలక నిర్ణయాలలో తొందరపాటు వద్దు. ఖర్చులు అదుపు చేసుకోవడానికి ఎంత గానో కృషి చేస్తారు.శుభవార్తలు.

**మకరం:** కోపతాపాలకు దూరంగా ఉండండి. చాకచక్యంగా వ్యవహరించి ముందుకు సాగుతారు.బంధువుల కలయిక.

**కుంభం:** వృత్తి ఎదురైన ఆటంకాలు తొలగుతాయి. కీర్తి ప్రతిష్ఠలు పెరుగుతాయి. ఎదురు చూడని అవకాశాలు లాభిస్తాయి.

**మీనం:** ముఖ్య సమాచారం అందుకుంటారు. విలువైన వస్తువులు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. శుభవార్తలు అందుకుంటారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



బుధవారం చెన్నైలో భారతీరాజా భౌతికకాయం వద్ద నివాళులర్పించి విలపిస్తున్న తమిళ సిఎం విజయ్

# దిగ్గజ దర్శకుడు భారతీరాజా ఇకలేరు

>> సినిమా రంగంలో తన ఉనికిని చాటుకోవాలని తపించేవారు. దాంతో మదరాసుకు చేరి చిత్రసీమలో చేరేందుకు పలు పాట్లు పడ్డారు. తొలుత కన్నడ దర్శకుడు పుట్టన్న కణగల్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు. తరువాత తెలుగు దర్శకులు పి.పుల్లయ్య వద్ద కొన్ని చిత్రాలకు పనిచేశారు. మళయాళ దర్శకుడు ఎమ్.కృష్ణన్ నాయర్ దగ్గర, తమిళ దర్శకుడు ఎ.జగన్నాథన్ చిత్రాలకూ అసోసియేట్ గా, కోడైరెక్టర్‌గా ఉన్నారు భారతీరాజా. నాలుగు భాషల దర్శకుల వద్ద పనిచేయడంతో భారతీరాజాకు దర్శకత్వంపై మంచి పట్టు లభించింది. తన ఊరికి సమీపంలోని వారే అయిన ఇళయరాజా, వారి సోదరులను కూడా చిత్రసీమలో అడుగు పెట్టేలా చేయడానికి భారతీరాజా ఎంతగానో సహకరించారు. ఇక భారతీరాజా తాను తీసే చిత్రం రెగ్యులర్ మూవీస్‌కు భిన్నంగా ఉండాలని ఎప్పుడూ తపించేవారు. ఆ తపనతోనే 1977లో విడుదలైన 16 వయతినిలే'చిత్రంతో దర్శకుడిగా అరంగేట్రం చేసి సంచలనం సృష్టించారు. ఆ చిత్రం సాధించిన ఘనవిజయంతో భారతీరాజా వైవిధ్యం కోసం సినీజనం పరుగులు తీశారు. భారతీరాజా రెండో చిత్రం కిళక్కే పోగుం రైల్ ఈ చిత్రం ద్వారా రాధికను నాయికగా పరిచయం చేశారు. ఇందులో మన తెలుగు నటుడు సుధాకర్ హీరోగా నటించారు. ఈ సినిమా మరింత విజయం సాధించింది. సుధాకర్‌కు తమిళనాట స్టార్ హీరోగా మారడానికి కారణమయింది. మూడో చిత్రం సిగప్పు రోజాక్కల్. ఇది సంచలన విజయం సాధించింది. కమల్, శ్రీదేవి నటించిన ఈ చిత్రం తెలుగులో ఎర్ర గులాబీలుగా అనువాదమై, ఇక్కడా విజయం సాధించింది. నాల్గవ చిత్రంగా 16 వయదినిలేను హిందీలో సోల్వా సావన్‌గా తెరకెక్కించారు భారతీరాజా. ఈ సినిమాతోనే శ్రీదేవి హిందీ చిత్రసీమలో అడుగుపెట్టింది. తెలుగులో భారతీరాజా రూపొందించిన సీతాకోక చిలుక చిత్రం ఎంత ఘనవిజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమా ద్వారా ముచ్చెర్ల అరుణ నాయికగా పరిచయమయింది. తెలుగులో కార్తిక్‌కు ఇదే తొలిచిత్రం. ఇక భారతీరాజా రూపొందించిన సస్పెన్స్ థ్రిల్లర్ టిక్ టిక్ టిక్ కూడా అప్పటి యువతరాన్ని ఆకట్టుకుంది. తెలుగులో యువతరం పిలిచింది, ఈతరం ఇల్లాలువంటి చిత్రాలు రూపొందించారు. అవి అంతగా ఆకట్టుకోలేక పోయాయి. కృష్ణతో జమదగ్ని, చిరంజీవితో ఆరాధన రూపొందించారు భారతీరాజా. ఆరు జాతీయ పురస్కారాలు, నాలుగు ఫిల్మ్‌ఫేర్ సౌత్ అవార్డులు, పలు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్నా రాజాను భారతీయ సినీ రంగానికిచేసిన సేవలకు గుర్తింపుగా 2004లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. నాలుగు దశాబ్దాలకు పైగా తమిళ సినీ పరిశ్రమలో తన ప్రత్యేక శైలితో ప్రేక్షకులను అలరించిన భారతీరాజా భారతీయ సినిమా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే దర్శకుల్లో ఒకరిగా గుర్తింపు పొందారు.

**ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు...**

భారతీరాజా అంత్యక్రియలు పూర్తిప్రభుత్వ లాంఛనాలతో జరుగుతాయనిసీఎం విజయ్‌ప్రకటించారు. తమిళ చలనచిత్ర పరిశ్రమకు ఆయన చేసిన అసమాన సేవలకు గుర్తింపుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇదిలా ఉండగా భారతీ రాజా నివాసానికి చిత్రరంగ ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. సిఎం విజయ్ భారతీరాజా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయంవద్ద నివాళులర్పించారు. మాజీ సిఎం స్టాలిన్, ఉదయనిధి మారన్, కమల్‌హసన్,సూర్య వంటి దిగ్గజనటులు, దర్శకులు భారతీ రాజా నివాసానికి వెళ్లి ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. ఆయన దర్శకత్వంలో నటించిన హీరోహీరోయిన్లు, నేటితరం నాయికలు పలువురు భారతీరాజాకు ఘనంగా నివాళులర్పించారు.

# భగ్గుమన్న కాంగ్రెస్

>> చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఎన్నికల ప్రక్రియను తమకు అనుకూలంగా మలచుకోవడం కోసం బిజెపి అనేక అడ్డదారులు తొక్కుతొందని అన్నారు.ఓటర్ల జాబితాల్లో అవకతవకలు, ప్రజా ప్రతినిధుల కొనుగోళ్లు, రాజకీయ ఒత్తిళ్లు బిజెపి రాజకీయ సంస్కృతిగా మారాయని విమర్శించారు.ఎన్నికల కమిషన్ స్వతంత్ర సంస్థలా కాకుండా బిజెపి అనుబంధ జేబుసంస్థలా వ్యవహరిస్తోందనే అనుమానాలు బలపడుతున్నాయని అన్నారు. ఆర్అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గతంలో ఓట్ల దోపిడీకి పాల్పడిన బిజెపి ఇప్పుడు సీట్ల దోపిడీకి కూడా సిద్ధమైందని ఆరోపించారు.రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనుక ఉన్న అసలు కారణాలను ఎన్నికల సంఘం దేశ ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.సాంకేతిక కారణాల పేరుతో ప్రతిపక్ష అభ్యర్థులను ఎన్నికల బరిలో నుంచి తప్పించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.రాజకీయంగా ఎదుర్కోలేక ప్రతిపక్షాలపై కుట్రలు చేయడం బిజెపి బలహీనతకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ వేమల వీరేశం సిఎల్‌పిలో మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రత దెబ్బతింటోందని విమర్శించారు.ఎన్నికల కమిషన్‌ను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించడం దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు ప్రమాదకరమన్నారు.మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ఘటనపై దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యవాదులు స్పందించాలని పిలుపునిచ్చారు.ప్రజల తరఫున పోరాడే నాయకులను ఎన్నికల ప్రక్రియ నుంచే దూరం చేయాలని ప్రయత్నించడం ఆందోళనకర పరిణామమన్నారు.రాజ్యాంగ సంస్థలను అధికార పార్టీ రాజకీయ ఆయుధాలుగా మార్చే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు.ప్రజాస్వామ్య వ్యవస్థలపై జరుగుతున్న దాడులను కాంగ్రెస్ పార్టీ ఎప్పటికప్పుడు బహిర్గతం చేస్తుందని తెలిపారు.ఎన్నికల సంఘం తన తటస్థతను నిరూపించుకోవాల్సిన బాధ్యత ఉందని పేర్కొన్నారు. టిపిసిసి మీడియా కమిటీ చైర్మన్ సామల రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్‌వోకు నామినేషన్ తిరస్కరించే అధికారం ఎక్కడిదనీ ప్రశ్నించారు. దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు ముందుకు రావాలని కోరారు. బిజెపి రాజకీయ కక్షసాధింపు చర్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ న్యాయపరమైన పోరాటం చేపడుతుందని వెల్లడించారు.ప్రజాస్వామ్యాన్ని కాపాడటం ప్రతి భారతీయుడి బాధ్యత అనీ రెడ్డిఅన్నారు.

ప్రభుతవ్వ సలహాదారు వి. హనుమంతరావు మాట్లాడుతూ చీకటి రోజని అభివర్ణించారు. రాజ్యాంగ విలువలను కాపాడే పోరాటంలో కాంగ్రెస్ వెనుకడుగు వేయదని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలపై జరుగుతున్న దాడులను దేశ ప్రజలు తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు.మీనాక్షి నటరాజన్ ఘటనపై పూర్తి స్థాయి విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా ఉద్యమాలకు సిద్ధంగా ఉందని తెలిపారు.రాజ్యాంగబద్ధ సంస్థల గౌరవాన్ని కాపాడటం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, దానిలో వైఫల్యం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని హెచ్చరించారు. పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ రాజకీయపార్టీలు అన్ని గొంతు విప్పాలనీ బిజెపి ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేయడం తగదని అన్నారు. ప్రజలు ప్రజాస్వామిక హక్కుల కోసం నిలబడకపోతే సీట్లతో మొదలైన అరాచకం మన ఇంటికి నియంతృత్వం వివిధ రూపాలతో వస్తోందని హెచ్చరించారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ సభ్యత్వం తిరస్కరించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాత్రలేదని భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఖండించారు. రాజీకీయ దురుద్దేశ్యంతో ఆయన ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఇలాంటి కుట్రలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

# భారత్ నౌకపై అమెరికా వైమానిక దాడిపట్ల నిరసన

>> డం లేదని విదేశాంగశాఖ అదనపు కార్యదర్శి నాగరాజ్‌నాయుడు పేర్కొన్నారు. అంతేకాకుండా భారత్‌లో ఉన్న అమెరికా ప్రతినిధి జాసన్ మీక్స్‌కు తమ నిరసనను తెలియజేసారు. హర్మూజ్ జలసంధికి సమీపంలోనే ఓమన్ తీరంలో ఈ దాడిజరిగింది. మొత్తం 28 మంది క్రూసిబ్బంది ఉన్నారు. 24 మంది వారిలో భారతీయులు. ఓమన్‌లోని సోహార్ ఓడరేవుకు 20 నాటికల్‌మైళ్లదూరంలో ఉండగానే దాడి జరిగిందని రెడ్‌సిగ్నల్స్ పంపించింది. అమెరికా సంట్‌కామ్‌కూడా తాము పలావు జాతీయ పతాకం ఉన్న నౌక తమ నిబంధనలు ఉల్లంఘించి ముందుకు వెళ్లిందని అందుకే దాడులుచేసినట్లు ప్రకటించింది. భారతీయ సిబ్బంది ఉన్ననౌకపై దాడికిపాల్పడటంపై భారత్ అమెరికాకు తమతీవ్రనిరసనను తెలియజేసింది.

# నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్10:** ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు గురువారం ఉదయం 11:30కి విడుదల చేయనున్నట్లు రాష్ట్ర ఇంటర్ మీడియట్ బోర్డు బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. గురువారం ఉదయం 11.30 గంటల నుంచి ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాలు ఇంటర్ మీడియట్ బోర్డు అధికారిక వెబ్ సైట్‌లో చూసుకోవచ్చని తెలిపింది. ఫలితాల కోసం విద్యార్థులు వెబ్ సైట్లను సందర్శించవచ్చని పెర్కొంది.

## దర్శకుడు భారతీరాజా మృతి పట్ల సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం సంతాపం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** నటుడు, దర్శకుడు పద్మశ్రీ భారతీరాజా మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రసంతాపం వ్యక్తం చేశారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేసిన భారతీరాజా దర్శకుడిగా, నటుడిగా విశేష ఖ్యాతి గడించారని ముఖ్య మంత్రి గుర్తుచేసుకున్నారు. ఎన్నో వైవిధ్యభరితమైన, సందేశాత్మక చిత్రాలను వివిధ భాషల్లో తెరకెక్కించి భారతీయ చలనచిత్ర రంగానికి విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. భారతీరాజా మరణం చలనచిత్ర రంగానికి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు రేవంత్ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. భారతీయ సినీ రంగంలో గ్రామీణ జీవన సౌంద ర్యాన్ని, పల్లె మనుషుల భావోద్వేగాలను అత్యంత సహజంగా వెండితెరపై ఆవిష్కరించిన అరుదైన దర్శకుల్లో ఆయన ఒకరని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సీతా కోకచిలుక వంటి చిరస్మరణీయ చిత్రాలతో పాటు ఎన్నో అద్భుత కళాఖండాలను అందించి సినీ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని ప్రశంసించారు. అనేక మంది నటీనటులకు అవకాశాలు కల్పించి, సినీ రంగానికి విశేష సేవలు అందించారని కొనియాడారు. ఆయన మరణం భారతీయ సినీ పరిశ్రమకు తీరని లోటు అని, భారతీరాజా పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు పొన్నం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



బాలకృష్ణకు రూ. 10లక్షల విరాళం అందిస్తున్న కాకర్ల రాఘవేంద్రరావు

## 22న బసవతారకం రజతోత్సవాల ముగింపు

### హాజరుకానున్న తెలుగు రాష్ట్రాల సిఎంలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), జూన్ 10, ప్రభాతవార్త:** ఈ నెల 22న బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి, పరిశోధన సంస్థ రజితోత్సవ ముగింపు వేడుకలను నిర్వహిస్తున్నట్లు బసతతారకం ఆసుపత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ప్రారంభమైన ఈ ఆసుపత్రి పాతిక సంవత్సరాలు పూర్తి చేసుకొని ముందుకు సాగుతుందన్నారు. దివంగత ఎన్టీఆర్ దంపతుల ఆశయాల మేరకు ఈ ఆసుపత్రిని ముందుకు సాగిస్తున్నా మన్నారు. గత ఏడాది కాలంగా రజితోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నామని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రుల సమక్షంలో ముగింపు వేడుకలను 22న హైటెక్ సిటీ నోవాటెల్ హోటల్‌లో నిర్వహిస్తున్నట్లు వివరించారు. కేంద్ర మంత్రులు జేపి నడ్డా, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, తెలుగు రాష్ట్రాల సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు, కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్ తదితరులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో హైదరాబాద్ ఆసుపత్రిలో నిర్మించనున్న సరికొత్త నార్త్‌బ్లాక్, అమరావతి తుళ్లూరులో నిర్మించనున్న ఆసుపత్రులను గడువులోగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ సందర్భంగా బాలకృష్ణ క్యాన్సర్ బారిన పడి చికిత్స పొందుతున్న చిన్నారులతో కలిసి కేక్‌ను కట్ చేశారు. చిన్నారులకు బహుమతులను అందించారు. నగరానికి చెందిన సీతారామారాజు ఆసుపత్రికి లక్ష రూపాయల విరాళాన్ని అందించగా బాలకృష్ణ వాటిని స్వీకరించారు. అలాగే త్రివేణి, కృష్ణవేణి పాఠశాలలకు చెందిన విద్యార్థులు క్యాన్సర్ రోగుల సహాయార్థం సేకరించిన రూ. 1,01,116ల విరాళాన్ని అందించారు. అమరావతిలో జరుగుతున్న ఆసుపత్రి నిర్మాణానికి కాకర్ల రాఘవేంద్రరావు అందించిన రూ. 10లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో స్వీకరించారు. దాతలందరికి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ డైరక్టర్ డాక్టర్ టి. సుబ్రమణ్యేశ్వర్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణి కోటేశ్వర్‌రావు, అసోసియేట్ డైరక్టర్ డాక్టర్ కల్పనా రఘునాథ్‌లతోపాటు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

### వాతావరణంపై రైతులకు ముందస్తు సమాచారం

### ఇన్నోవేషన్ ల్యాబ్, ఎవిడెన్స్ యాక్షన్‌తో ఒప్పందాలు

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. వ్యవసాయంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి రైతులకు వాటి ఫలితాలు అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులోభాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా రైతులకు వాతావరణానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని అందించేందుకు సిద్ధమైంది. ఇందుకు సాంకేతికత ఆధారిత సమాచార వ్యవస్థను రూపొందించిన అధికారులు వాటిని అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారాన్ని రైతాంగానికి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక కార్యక్రమాన్ని ప్రారంభించింది. వాతావరణ శాఖ సహకారంతో రాష్ట్రంలోని 17 జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ఈ జాబితాలో ఖమ్మం, మహబూబాబాద్, హన్మకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు, కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, సిద్దిపేట జిల్లాలు ఉన్నాయి. వాతావరణ పరిస్థితులపై సమాచారాన్ని నేరుగా రైతుల మొబైల్ ఫోన్లకు వాట్సాప్‌లో అధికారులు చేరవేస్తారు. అంతేకాకుండా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆధారిత సలహాలను కూడా రైతులకు అందచేస్తారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, డిజిటల్ సాంకేతిక డేటాల అనుసంధానంతో శాటిలైట్ ఆధారిత వాతావరణ అంచనాలతో రూపొందించిన సమాచారం, సలహాలను రైతులకు చేరవేస్తారు. ఇందుకు గాను డెవలప్‌మెంట్ ఇన్నోవేషన్ ల్యాబ్, ఇండియా ఎవిడెన్స్ యాక్షన్ సంస్థలతో వ్యవసాయ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చు కుంది. అంతేకాకుండా వాతావ రణం, వర్షపాతాన్ని దృష్టిలో ఉంచుకుని ఏ విత్తనాలు వాడాలి, ఏ ఎరువులు వాడాలి, పంటలను ఎలా కాపాడుకోవాలి అనే విషయాలపై సలహాలు ఇవ్వడానికి నిపుణులు కూడా అందుబాటులో ఉంటారు. వార్షాలు, ఉష్ణోగ్రతలు, వడగాలులు, వాతావరణ మార్పుల ముందస్తు అంచనాలను రైతులకు అందించనున్నారు. వాతావరణ పరిస్థితులపై సలహా కోసం స్థానిక వ్యవసాయ అధికారులను కూడా అందుబాటులో ఉంటారు.

## వాటర్ వర్క్స్ జిఎం అనంతకుమార్‌కు రెండురోజుల ఎసిబి కస్టడీ

**హైదరాబాద్ జూన్ 10, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో అరెస్టయిన వాటర్ వర్క్స్ బోర్డు ప్రాజెక్టు విభాగంలో ఇంజినీరింగ్ జనరల్ మేనేజ ర్ సగ్గం అనంత లక్ష్మీ కుమార్‌ను రెండు రోజుల ఎసిబి కస్టడీకి ఇస్తూ నాంపల్లి ఎసిబి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీని తరువాత చంచల్‌గూ డ జైల్లో వున్న ఆయనను ఎసిబి అధికారులు తమ కస్టడీలోకి తీసుకుని బంజారాహిల్స్‌లోని ఎసిబి ప్రధాన కార్యాలయానికి తరలించారు. అన ంత లక్ష్మీ కుమార్‌ను గురువారం సాయంత్రం వరకు విచారించి ఆ తరువాత ఎసిబి కోర్టులో హాజరు పరిచి తిరిగి జైలుకు తరలించనున్నారు. గత నెల 19న అనంత లక్ష్మీకుమార్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబి అధికారులు అరెస్టు చేయడం తెలిసిందే. నగర ంలోని రెడ్‌హిల్స్‌లో గల వాటర్ వర్క్స్ ప్రాజెక్టు విభాగంలో ఇంజినీరింగ్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న అనంత లక్ష్మీ కుమార్‌పై అవినీతి ఆ రోపణలు రావడంతో ఎసిబి అధికారులు దాడులు చేపట్టి 5.88 కోట్ల రూపాయల అక్రమాస్తులను రట్టుచేశారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ 100 కోట్ల రూపాయలకు పైబడి వుంటుందని అధికారులు తెలిపారు. ఈ కేసులో అనంత లక్ష్మీకుమార్ అప్పటి నుంచి చంచల్ గూడ జైల్లో రిమాండు ఖైదీగా వున్నారు.

# ఘనా పారిశ్రామికాభివృద్ధికి తెలంగాణ మార్గనిర్దేశం

### అక్కడ ఫార్మా హబ్ ఏర్పాటుకు పూర్తిస్థాయి సహకారం

### రిపబ్లిక్ ఆఫ్ ఘనా ఉన్నతస్థాయి బృందం భేటీలో మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** రిపబ్లిక్ ఆఫ్ ఘనా పారిశ్రామికాభివృద్ధికి మార్గనిర్దేశం చేసేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. అక్కడ ఏర్పాటు చేయనున్న 'ఫార్మా హబ్'కు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని రకాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆ దేశ ప్రెసిడెన్షియల్ అడ్వైజర్ ఆగస్టస్ ఒబువాడుం టానో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో బుధవారం మంత్రి శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణ - ఘనా మధ్య ద్వైపాక్షి క సంబంధాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, అవకాశాలపై విస్తృతంగా చర్చించారు. ఘనా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 24 అవర్ ఎకానమీ అండ్ యాక్సలరేటెడ్ ఎక్స్‌పోర్ట్ డెవలప్ మెంట్ ప్రోగ్రాం, ఫార్మా హబ్ ఏర్పాటు తదితర అంశాలను ఆగస్టస్ ఒబువాడుం టానో వివరించారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనకు సహకరించాలని మంత్రి శ్రీధర్ బాబును విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఆనతికాలంలోనే పారిశ్రామిక రంగంలో తెలంగాణ అద్భుతమైన వృద్ధిని నమోదు చేసిందన్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, ఫుడ్ ప్రాసెసింగ్, డిఫెన్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగిందన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్స హించేందుకు అమలు చేస్తున్న 'ఈజ్ ఆఫ్ డూయింగ్' పాలసీలను ఆయన వివరించారు. ఫార్మాస్యూటికల్ మ్యాను ఫ్యాక్చరింగ్, రీసెర్చ్, వ్యాక్సీన్ల తయారీ, గ్లోబల్ సప్లై చైన్ నిర్వహణ, లైఫ్ సైన్సెస్ రంగంలో తెలంగాణకున్న అంతర్జాతీయ నైపుణ్యాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని ఘనా ప్రతినిధులకు చెప్పారు. ఘనా పారిశ్రామిక, ఆర్థిక పరివర్తనలో తెలంగాణ ఒక నమ్మకైన భాగస్వామిగా ఉంటుందని భరోసానిచ్చారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతినెలా ఒకటినే వేతనాలు

### ఇవ్వకపోతే సంబంధిత అధికారులపై చర్యలు

### కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకూ ఇదే విధానం

### మార్గదర్శకాలు విడుదల చేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి సైతం ప్రతీ నెలా 1వ తేదీనే వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు దీనికి సంబంధించి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తాజాగా మార్గదర్శకాలు విడుదల చేశారు. ఈ ఉద్యోగులతో పాటు, గౌరవ వేతనంపై పనిచేసే సిబ్బంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ సంస్థలు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లు, సొసైటీల ఉద్యోగులకు వేతనాల చెల్లింపుల్లో జాప్యం లేకుండా వేతనాలు ఇవ్వనున్నారు. ఇదే సమయంలో 1వ తేదీన ఇవ్వకుండా జీతాలను ఆలస్యంగా ఇస్తే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామని మార్గదర్శకాల్లో హెచ్చరించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం జీతాల బిల్లుల కోసం హాజరు గణనను ప్రతి నెల 21వ తేదీ నుంచి తదుపరి నెల 20వ తేదీ వరకు పరిగణించాలని సూచించారు. అన్ని జీత, వేతన బిల్లులను ప్రతి నెల 25వ తేదీలోగా సంబంధిత ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాలకు సమర్పించాలని ఆదేశించారు. ట్రెజరీ, అకౌంట్స్ అధికారులు నెల చివరి పని దినంలోపు బిల్లుల పరిశీలన, ఆడిట్, అనుమతుల ప్రక్రియ పూర్తి చేయాలని కోరారు. డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులు (డీడీఓలు) తగిన బడ్జెట్ నిధులు అందుబాటులో ఉండేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా ప్రభుత్వ, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యో గులకు ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ, కొన్ని శాఖల్లో బిల్లుల సమర్పణలో జాప్యం, హాజరు వివరాల ఆలస్యం, ఆడిట్, పరిశీలన, అనుమతుల ప్రక్రియల్లో ఆలస్యం కారణంగా జీతాలు నెలాఖరున చెల్లిస్తున్నట్టు ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. దీంతో ఆ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని పేర్కొన్నారు. ఇటీవల నిర్వహించిన సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి, రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, గౌరవ వేతన సిబ్బందికి కూడా ఎలాంటి జాప్యం లేకుండా ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని వివరించారు. జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం జరిగితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కూడా స్పష్టం చేశారని తెలిపారు. సంబంధిత శాఖాధిపతులు, కార్యాలయాధిపతులు జీత బిల్లుల సమర్పణ, ప్రాసెసింగ్‌ను నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. జీతాలు లేదా వేతనాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యం కారణంగా ఆలస్యం జరిగితే సంబంధిత శాఖాధిపతి, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారులపై క్రమశిక్షణ చర్యలు చేపడతామని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ శాఖలు, విశ్వవిద్యాలయాలు, కార్పొరేషన్లు, గ్రాంట్‌ఇన్ ఎయిడ్ సంస్థలు ఈ ఆదేశాలను కచ్చితంగా అమలుచేయాలని ఆదేశించారు. అన్ని శాఖల సమన్వయ బాధ్యతను ఐఏఎస్ అధికారి గౌరవ్ ఉప్పల్‌కు అప్పగించామని తెలిపారు. ప్రతి ఉద్యోగికి ఒకటో తేదీన జీతం అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తులు జప్తు చేసిన సిసిఎస్ పోలీసులు

**హైదరాబాద్ జూన్ 10, ప్రభాతవార్త:** ధన్వంతరి ఫౌండేషన్ కేసులో సిసిఎస్ పోలీసులు నిందితుల ఆస్తులను జప్తు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ఈ సంస్థకు సంబంధించి తెలంగాణ, ఎపిలో గల 450 ఎకరాల భూములను సిసిఎస్ పోలీసులు జప్తు చేశారు. దీంతో పాటు హైదరాబాద్‌లో ఖరీదైన ప్రాంతంలో గల మూడు వేల చదరపు గజాల స్థలాన్ని కూడా జప్తు చేశారు.

బ్రహ్మణ సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసుకుని, అ ధిక లాభాలు, అధిక వడ్డీ పేరిట నాలుగు వేల మందిని నిండా ముంచి 540 కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసిన ధన్వంతరి ఫౌండేషన్ గోల్‌మాల్ వ్యవహారం నాలుగేళ్ల క్రితం రట్టవడం తెలిసిందే. శివార్లలోని మైలార్‌దేవుపల్లిలో గల ఈ సంస్థకు అదే ప్రాంతంలోని రాఘవేంద్ర పేరిట వున్న ఆసుపత్రి ఛైర్మన్ పంతంగి కమలాకర శర్మ ఛైర్మన్‌గా వ్యవహరించగా ఆయన బంధువులు, సన్నిహి తులు డైరెక్టర్లుగా వున్నారు.

ఈ గోల్‌మాల్ వ్యవహారంలో నిందితులు అరెస్టవగా వారంతా బెయిల్‌పై వున్నారు. మరోవైపు ఈ సంస్థ బాధితులు తమ న్యాయ పోరాటాన్ని కొన సాగిస్తూనే వున్నారు. వారి పోరాటం ఫలించి సిసిఎస్ పోలీసులు ధన్వంత రి ఫౌండేషన్‌కు చెందిన భూములను జప్తు చేశారు. వీటిని వేలం వే సి బాధితులకు అందించే వీలుంది. గతంలో కృషీ బ్యాంకు సహా పలు కేసుల్లో బాధితులకు ఇదే తరహాల్లో పోలీసులు న్యాయం చేశారు. కాగా పోలీసులు జప్తు చేసిన ధన్వంతరి ఫౌండేషన్ ఆస్తుల విలువ 300 కోట్ల రూపాయల వరకు వుంటుందని తెలిసింది.

# నేరాల కంటే ప్రమాదాల వల్ల పోయే ప్రాణాలే ఎక్కువ

### హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శిఖాగోయల్



సమావేశంలో మాట్లాడుతున్న శిఖాగోయల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** సమాజంలో జరుగుతున్న నేరాల కంటే రహదారి ప్రమాదాల వలన ఎక్కువమంది ప్రాణాలు కోల్పోతున్నారని హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, డిజి శిఖాగోయల్ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కన్వెన్షన్ సెంటర్‌లో 'అరైవ్, అలైవ్' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రహదారి భద్రత అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో యేడాదికి సగటున 800 హత్యలు జరుగుతుంటే.. 8 వేల మంది రోడ్డు ప్రమా దాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఇందులో అత్య ధిక ప్రమాదాలు గ్రామీణ ప్రాంతాల రోడ్లపైనే జరుగుతున్నాయన్నారు. అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడ పడం వలన వారి ప్రాణాలకే కాకుండా ఎదుటివారి ప్రాణాలకు సైతం ముప్పు తెస్తున్నారని వాపోయారు. వాహనం నడుపుతూ సెల్ ఫోన్ మాట్లాడడం అత్యంత ప్రమాదకర మన్నారు. ప్రజ లు అడిగిన పలు ట్రాఫిక్ ఉల్లంఘనల ప్రశ్నలకు ఆమె సమాధానాలిచ్చారు. జిల్లా కలెక్టర్ కె.హై మావతి మాట్లాడుతూ ప్రజాపాలన ప్రగతి ప్రణా ళిక కార్యక్రమంలో 'అరైవ్ అలైవ్ (రహదారి భద్రత) వారం రోజులు ముఖ్యమైన అంశంగా జరిగింద న్నారు. సీపీ రష్మీపెరుమాళ్ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణతోపాటు ప్రజల్లో సామా జిక అవగాహన కల్పించడం సైతం పోలీసుల బాధ్యత అన్నారు. అంతకుముందు రహదారి భద్రతపై అవగాహన విడియోలను ప్రదర్శించారు. కనువిప్పు బృందం ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతా ప్రమాణాలు, ఉల్లంఘ నలపై ఆలపించిన చైతన్య గీతాలు ఆకట్టుకున్నాయి. కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిం చారు. అర్హులైన లబ్ధిదా రులకు డిజి చేతుల మీదుగా ఉచిత కంటి అద్దాలు, మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. అలాగే ద్విచక్ర వాహనదారులకు ఉచితంగా హెల్మెట్లను అందించారు.

## నేటి నుంచి నూతన కార్మిక కోడ్‌లపై సంప్రదింపు సమావేశాలు

**హైదరాబాద్, జూన్ 10 ప్రభాత వార్త:** కేంద్ర ప్రభుత్వం అమలు చేయ నున్న నాలుగు నూతన కార్మిక కోడ్‌లకు సంబంధించిన రాష్ట్ర నిబంధనల ఖరారు ప్రక్రియలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం నాలుగు అధికారుల కమిటీలను ఏర్పాటు చేసింది. ఈ కమిటీలు యజమానుల సం ఘాలు, ఉద్యో గులు, కార్మిక సంఘాలు, ట్రేడ్ యూనియన్ల ప్రతినిధులతో సంప్రదింపు సమావేశాలను నిర్వ హించనున్నాయి.

ఈ సమా వేశాలు గురువారం నుంచి జూన్ 16 వరకు హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ఉన్న టి. అంజయ్య భవన్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయంలో జరుగు తాయని కార్మిక కమిషనర్ తెలి పారు. సమావేశాల ఉదయం 11 గంటలకు మొదలవుతాయి తొలి రోజు గురువారం నాడు సోషల్ సెక్యూరిటీ కోడ్ - 2020 పై ఉదయం 11 గంటలకు కోడ్ ఆన్ వేజెస్ - 2019పై ఉదయం 11 గంటలకు, ఆక్యుపేషనల్ సేఫ్టీ, హెల్త్ అండ్ వర్కింగ్ కండిషన్స్ కోడ్ - 2020 జూన్ 15, ఉద యం 11 గంటలకు ఇండస్ట్రియల్ రిలేషన్స్ కోడ్ - 2020 పై జూన్ 16, ఉదయం 11 గంటలకు ఉంటాయనీ తెలిపారు. ఈ సంప్రదింపుల ద్వారా కార్మికులు, యజమానులు ఇతర భాగ స్వాముల అభిప్రాయాలను పరిగణ నలోకి తీసుకుని రాష్ట్ర నిబంధ నలను మరింత సమగ్రంగా రూపొందించనున్నట్లు తెలిపారు.

## బిఆర్ఎస్ సర్కారు దుర్మార్గంగా వ్యవహరించిందని ధ్వజం

## ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ నేత కోలన్ హనుమంత్‌రెడ్డి విచారణ

**హైదరాబాద్ జూన్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితుల విచారణ కొనసాగుతోంది. ఈ కేసుకు స ంబంధించి కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కోలన్ హనుమంత్ రెడ్డిని సిట్ అధికారులు విచారించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోలన్ హనుమంత్ రెడ్డితో పాటు ఆయన కుటుంబీకుల ఫోన్‌లు ట్యాపింగ్ అయినట్లు ఫోన్ ట్యాపింగ్ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు గుర్తించారు. ఇందులో భాగంగా బుధవారం కోలన్ హనుమంత్ రెడ్డిని కమాండ్ కంట్రోల్ రూంలో గల సిట్ కార్యాలయానికి విచార ణకు పిలిచారు. ఆయనను గంట పాటు విచారించారు. దీని తరువాత కోలన్ హనుమంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ సర్కారు దుర్మార్గంగా వ్యవహ రించిందని ఆరోపించారు. అప్పట్లో వేల సంఖ్యలో ఫోన్‌లను నాటి సర్కారు ట్యాపింగ్ చేసిందని ఆయన ఆరోపించా రు. గత ఎన్నికల్లో తాను కుత్బుల్లాపూర్ నియోజికవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంఎల్ఎగా పోటీ చేయగా తన ప్రత్యర్థిగా బిఆర్ఎస్ త రపున వివేకానంద గౌడ్ పోటీ చేశారని, సరిగ్గా ఎన్నికల సమయంలో తనతో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్‌లు ట్యాపింగ్‌కు గురయినట్లు కోలన్ హనుమంత్ రెడ్డి తెలిపారు. నాటి ఎన్నికల్లో తాను ఓడిపోయానని, దీని వెనుక ఫోన్ ట్యాపింగ్ ప్రధాన కారణమని ఆయన ఆరోపించా రు. పక్కాగా వ్యవహరించిన వివేకానంద్ తన ఫోన్‌ను కుటుంబ సభ్యుల ఫోన్‌లను ట్యాపింగ్ చేయించి. తాము ఏమి మాట్లాడినా వెంటనే తె లుసుకుని భారీగా డబ్బులు ఖర్చుపెట్టి విరుగుడు వ్యూహాలు అమలు చేసి గెలుపొందారని ఆయన తెలిపారు. తనకు మద్దదుగా వున్న అనేక బ స్తీలలో వివేకానంద విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టి ఫలితాలను ప్రభావం చేసినట్లు కోలన్ తెలిపారు. తన విచారణలో అనేక విషయాలను సిట్ అధికారులకు వెల్లడించానని, ఈ కేసులో నిందితులకు కచ్చితంగా శిక్షలు పడాలని ఆయన కోరారు.

## మీనాక్షి నామినేషన్ తిరస్కరణకు బిజెపిని నిందించడం హాస్యాస్పదం

### బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** బిజెపి జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ గురించి మాట్లాడే స్థాయి, అర్హత టిపిసిసి అధికార ప్రతినిధి సామ రామ్మోహన్ రెడ్డికి లేదని బిజెపి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ మండిపడ్డారు. ప్రజా హితం కోసం జీవితాన్ని అంకితం చేసిన కర్మయోగిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ నాయకుల రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనమని ఆయన అన్నారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై టిపిసిసి అధికార ప్రతినిధి రామ్మోహన్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. చట్టం అందరికీ సమానం.

2రిటర్నింగ్ అధికారికి ఉన్న స్పష్టమైన ఆదేశాల మేరకు, అఫిడవిట్‌లో దాచకూడని విషయాలను దాచినందుకు ఎన్నికల కమిషన్ నామినేషన్‌ను తిరస్కరణను చూసి, బిజెపి పార్టీని నిందించడం మీ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం అన్నారు. తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కోర్టుల మీద, ఎన్నికల కమిషన్ మీద బురద జల్లడం కాంగ్రెస్ సంస్కృతిగా మారిందని విమర్శించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంటే, దానికి కుట్ర అని రంగు పులమడం మీ అలవాటు. చట్టాన్ని గౌరవించడం తెలియక, ఒక అభ్యర్థిని సరైన రీతిలో సిద్ధం చేయలేక, ఇప్పుడు బిజెపి మీద, మోడీ మీద బురద జల్లడం చూస్తుంటే జాలివేస్తుందన్నారు. నామినేషన్ వేయడం కూడా రాని, మీరా బిజెపి నీతి గురించి విమర్శించేది? అని ఎస్. కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అరాచకానికి, అబద్ధాల రాజకీయానికి చిరునామగా మారిందన్నారు.

# భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త

### మల్కాజిగిరిలో దారుణం

### పోలీసుల అదుపులో నిందితుడు?

**హైదరాబాద్ (మల్కాజిగిరి) జూన్ 10, ప్రభాతవార్త:** కుటుంబ కలహాల కారణంగా కట్టుకున్న భార్యను తుపాకితో కాల్చి చంపిన కిరాతక భర్త ఉ దంతం శివార్ల లోని మల్కాజి గిరిలో వెలుగు చూసింది. బుధవారం తెల్లవారు జామున జరిగిన ఈ ఘటన స్థానికంగా సంచలనం రేపింది. వివ రాలు ఇలావున్నాయి. మల్కాజి గిరిలోని మారుతీ నగర్‌కు చెందిన దామెర అరుణ్ కుమార్ (49) ఓ చిరు వ్యా పారి. అరుణ్‌కు స్వర్ణలతతో 25 యేళ్ల క్రితం వివాహం జరిగింది. ఈ దంప తులకు ఒక కుమారుడు, కుమార్తె వున్నారు. కుమార్తె 2017లో మల్కాజిగిరిలో గోడ కూలిన ఘటనలో చనిపోయింది. దీని తరువాత అరుణ్ కుమార్ తన మరదలు నిషా రాణి (39)ని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ వివాహాన్ని స్వర్ణలత మొ దట వ్యతిరేకించి, పోలీసులకు ఫిర్యాదు చేసినా చివరకు సర్దుకుని భర్త, చెల్లెలితో కలిసి వుంటోంది. నిషా రాణి, అరుణ్ కుమార్‌లకు సంతానం లేరు. అయితే కొన్ని నెలలుగా నిషా రాణితోనూ అరుణ్ కుమార్ గొడవ పడుతున్నాడు. ఆమెపై అనుమానం పెంచుకుని, ఎవరితోనో అక్రమ స ంబంధం కలిగివుందన్న అనుమానంతో హింసించసాగాడు. దీంతో ఆమె భర్తతో దూరంగా మెదక్‌లోని తన బంధువుల ఇంట్లో వుంటోంది. ఇదే సమయంలో గత మార్చి నెలలో అంబర్ పేటలో స్నేహితులతో జరిగిన మద్యం పార్టీలో అరుణ్ కుమార్ తుపాకితో గాలిలో కాల్పులు జరిపి హ ల్‌చల్ చేయడంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఈ కేసులో ఇటీవలే బెయిలుపై వచ్చిన అరుణ్ కుమార్ మెదక్‌లో బంధువుల ఇ ంట్లో వున్న భార్యకు నచ్చచెప్పి మల్కాజి గిరిలోని తన ఇంటికి తీసుకువచ్చాడు. దీని తరువాత కొన్ని రోజులు బాగానే వున్నా మళ్లీ ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఈ గొడవల విషయంలో అరుణ్ కుమార్ తన భార్యతో రాజీకి ప్రయత్నించినా కుదరలేదు. దీంతో పాతబస్తీలో త నకు పరిచయం వున్న ఓ వ్యక్తి వద్ద నుంచి కంట్రీమేడ్ తుపాకిని కొన్నాడు. దీనిని తన వద్ద భద్రంగా వుంచుకుని తనతో రాజీకి రాని భార్యను చంపాలని నిర్ణయించు కున్నాడు. బుధవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో భార్య భర్తలు ఏదో విషయమై గొడవపడగా ఇది ముదిరింది. దీంతో అరుణ్ కుమార్ తన భార్య నిషా రాణిపై తుపాకితో మూడు రౌండ్లు నిషా రాణిపై కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆమె అక్కడికక్కడే చనిపోయింది. కాల్పుల శబ్దానికి ఇరుగు పొరుగు వారు భయపడి వెంటనే పోలీసులకు సమాచారం అ ందించారు. దీంతో పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించగా రక్తపు మడుగులో నిషారాణి శవం కనిపించింది. ఆమె మృ తదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇదిలా వుండగా భార్యను తుపాకితో కాల్చి చంపిన ఘటనలో నిందితుడు అరుణ్ కుమార్‌ను పోలీసుల అదుపులో వున్నట్లు తెలిసింది. దీంతో పాటు అతనికి తుపాకిని అమ్మిన ఇద్దరిని కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితుడి వద్ద నుంచి తుపాకిని స్వాధీనం చేసుకున్నారని తెలిసింది.

ప్రకటన నం. 04/2026

**కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం**

పార్లమెంట్ చట్టం ద్వారా స్థాపించబడింది

56-57, ఇనిస్టిట్యూషనల్ ఏరియా, జనక్‌పురి, న్యూఢిల్లీ-110058

వెబ్‌సైట్: www.sanskrit.nic.in

NAAC A++

**నియామక ప్రకటన**

ఢిల్లీలోని కేంద్ర సంస్కృత విశ్వవిద్యాలయం, తన మూడు క్యాంపస్‌లైన వేదవ్యాస్ క్యాంపస్, బలహోర్, హిమాచల్ ప్రదేశ్, శ్రీ రఘునాథ్ కీర్తి క్యాంపస్, దేవప్రయాగ్, ఉత్తరాఖండ్, మరియు ఏకలవ్య క్యాంపస్, అగర్తలా, త్రిపురలలోని వివిధ బోధన/ఇతర అకడమిక్ పోస్టుల (అసోసియేట్ ప్రొఫెసర్-23, అసిస్టెంట్ ప్రొఫెసర్-63 మరియు ఇతర అకడమిక్ పోస్టులు-04) ప్రత్యక్ష నియామకం కోసం భారత జాతీయుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అర్హతా ప్రమాణాలు, విద్యార్హతలు, నియామక ప్రక్రియ, ఖాళీల పంపిణీ, రిజర్వేషన్లు, దరఖాస్తు విధానం, UGC నిబంధనల ఆధారంగా షార్ట్ లిస్టింగ్ ప్రమాణాలతో సహా ఎంపిక విధానం & వెయిటేజ్ ప్రమాణాలతో సహా పరీక్షలు, అసెస్‌మెంట్ ప్రమాణాలు, ఇంటర్వ్యూ మరియు ఇతర అవసరమైన అర్హతల గురించిన పూర్తి సమాచారం వివరణాత్మక ప్రకటన నెం. 04/2026లో అందుబాటులో ఉంది. ఈ ప్రకటన 10.06.2026 నుండి CSU వెబ్‌సైట్ www.sanskrit.nic.in లో రిక్రూట్‌మెంట్/నోటిఫికేషన్ శీర్షిక క్రింద లభిస్తుంది. ఆసక్తిగల అభ్యర్థులందరూ, కింద అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ దరఖాస్తును పూరించే ముందు, వివరణాత్మక ప్రకటనను పూర్తిగా చదవాలని గట్టిగా సూచించడమైనది. ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి చివరి తేదీ: 10.07.2026.

సం/-

రిజిస్ట్రార్ I/c

తేదీ: 10.06.2026

CBC 21212/11/0005/2627

వార్త

ప్రపంచం తాలూకు రహస్యాన్ని అర్థం చేసుకోవాలంటే దీర్ఘకాలం పాటు శిక్షణాభ్యాసం సాగించాలి.

**- అలివర్ గోల్డ్‌స్మిత్**

# అణచివేత అన్నిటా వర్థిల్లదు!

ఎన్నో ఉగ్రవాద సంస్థలను తనలో ఇముడ్చుకుని ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఉద్రిక్తతలను దారిలోకి తెచ్చుకోలేక సతమతమవుతోంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఆర్థిక రాజకీయ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న పౌరహక్కుల కూటమి జాయింట్ అవామీ యాక్షన్ కమిటీని నిషేధించి పాకిస్థాన్ పీకల మీదకు తెచ్చుకుంది. తమ అధీనంలో ఉన్న కశ్మీర్ భాగం ఇండియాదని తెలిసి కూడా దానికి స్వతంత్రత కల్పించకపోగా కనీసం అక్కడున్న ప్రజా చైతన్యాన్ని అణచివేయడంపైనే పాక్ పాలకులు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో అతి స్వల్పకాలంలోనే భద్రతా దళాలకు నిరసన కారులకు మధ్య జరిగిన ఘర్షణల్లో కనీసం 30 మంది మరణించారు. ఎంతో మంది క్షతగాత్రులైనారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో జూలై 27న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ నేపథ్యంలోనే కశ్మీర్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. ఒక పక్క పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో ఏమాత్రం మానవ హక్కులు లేవని, అన్నీ ఉల్లంఘనలేనని భారత్ అభిప్రాయపడ్తోంది. అక్కడ చట్టసభలో శరణార్థుల కోసం కేటాయించిన సీట్లను రద్దు చేయాలని జెఎఎసి ఎప్పట్నించో కోరుతోంది. దీనిపై మంగళవారం తీవ్రస్థాయిలో రావల్‌కొట్, ముజఫరాబాద్‌లో నిరసనలు చెలరేగాయి. నిరసనకారులపై భద్రతా దళాలు కాల్పులు జరిపాయి. ఈ ఉద్రిక్తతలపై బ్రిటన్‌కు చెందిన 50 మందికిపైగా పార్లమెంట్ సభ్యులు తమ దేశవిదేశాంగ కార్యాలయానికి లేఖ రాశారు. ఆ లేఖలోని సంగతుల్లోకి వెళ్తే ఈ ఉద్రిక్తతలను నివారించేందుకు వెంటనే దౌత్య చర్యలు చేపట్టడం అవసరమని కోరారు. పాక్ ఆక్రమిత కశ్మీర్ (పిఒకె)లో దశాబ్దాలుగా అణచివేతకు గురవుతున్న వారంతా తాము భారత్‌తో కలిసి ఉండాలని అనుకున్నవారే. అక్కడ ఎన్నాళ్లుగానో అసంతృప్తి నివురుగప్పిన నిప్పులా ఉంది. అనేక సందర్భాల్లో ప్రభుత్వ నిర్ణయాలపై మూకుమ్మడి అసంతృప్తులు చెలరేగాయి. కశ్మీర్ పహల్‌గాం దుర్ఘటనలో భారతీయులను ఊచకోత తర్వాత పాక్ అండదండలతో ఉగ్రవాదులు ఈ దురాగతానికి పాల్పడ్డారనే భారత్ నిర్ణయానికి వచ్చి పాక్ మీద యుద్ధం ప్రకటించిన విషయం విదితమే. ఆ సందర్భంలో పిఒకె వాసులు భారత్‌కే మద్దతు పలికారు. పాక్ పాలకుల నుంచి అణచివేతకు గురవుతున్న పిఒకె వాసుల్లో తీవ్రఅసంతృప్తి ఉంది. ఇటీవల కాలంలో వారంతా పాక్ పాలకుల ఆర్థిక, రాజకీయ దోపిడీపై మూకుమ్మడిగా చారిత్రాత్మక తిరుగుబాటుకు నడుం కట్టారు. పాకిస్థాన్ అధీనంలో ఉన్న ఆక్రమిత కశ్మీరులో నివసిస్తున్న శరణార్థుల కోసం స్థానిక చట్టసభలో కేటాయించిన 12 ప్రత్యేక సీట్లను రద్దు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిజానికి ఆ 12 సీట్ల మద్దతుతోనే పాక్ పాలకులు తమపై అరాచక పాలన రుద్దుతున్నారన్నది వారి ఆరోపణ.

దీనికితోడు ప్రజాఉద్యమాలను అణచివేసేందుకు జాయింట్ అవామీ యాక్షన్ కమిటీని పాక్‌ప్రభుత్వం ఉగ్రవాదనిరోధక చట్టాల కింద నిషేధించడం, రావల్‌కోట్ కాల్పుల్లోఅమాయకులు మరణించారన్న ఆరోపణతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు కట్టుకుంది. పాక్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్, బాల్టిస్తాన్ ప్రాంతాలు సహజవనరులకు నిలయాలుకాగా ఆ వనరులన్నీపంజాబ్‌కు తరలించి తమ ప్రాంతానికి ఆర్థిక వనరులు సమకూర్చే విషయంలో మొండిచెయ్యి చూపడం కూడా ఆ ప్రాంత వాసులకు రుచించలేదు. తమ ప్రాంతంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను పంజాబ్‌కు తరలిస్తున్నా, తమకు కనీస నిత్యావసరాలైన గోధుమ పిండిని కూడా రాయితీపై ఇవ్వకపోవడాన్ని వారు గర్హిస్తున్నారు. తమప్రాంతంలో తయారైనవిద్యుత్ తమకు ఉపయోగించుకునే ఆస్కారంలేదని, తరచు విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నారని వారి ఆందోళన పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో ఇంటర్నెట్ నిలిపివేత, సైనికచర్య, మానవ హక్కుల ఉల్లంఘనలపై బ్రిటన్ ప్రభుత్వం జోక్యం చేసుకోవాలంటూ లండన్‌లోని బ్రిటన్‌ఎంపీలు కోరడం ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన విషయం. ప్రస్తుతం ఎదురైన పరిస్థితుల రీత్యా కెనడా తన ప్రజలను పిఒకెకు వెళ్లవద్దని నిషేధం విధించింది. 2025 భారత్, పాక్‌ల మధ్య జరిగిన 'ఆపరేషన్ సింధూర్' తర్వాత పాక్ ఆర్థిక పరిస్థితి బాగా దిగజారింది. అయినా వారు పిఒకెపై అణచివేత చర్యలు తగ్గలేదు. పాక్ పాలకులు దశాబ్దాలుగా అంతర్జాతీయ వేదికలపై భారత్ ఆధీనంలో ఉన్న కశ్మీర్ కూడా వారిదేనన్నట్లు ప్రసంగాల్లో వ్యక్తం చేయడం, తమ వాదనల్లో పసలేదని తెలిస్సినా పదే పదే అవే అంశాలపై పోరాట కాంక్షతో ఉంటున్నారు. అంతేతప్ప పాక్ ఆక్రమిత కశ్మీర్‌కు ఏంకావాలో ఇవ్వాలని, తద్వారా వారిలోని అసంతృప్తిని చల్లార్చాలన్న ప్రయత్నమే మీ చేయడంలేదు. ప్రజాస్వామ్య కాంక్షను అణచివేయాలని పాక్ ఆలోచన సరైనది కాదు. ఎక్కడిదైనా, ఏ ప్రాంతమైనా ఎవరి అధీనంలో, ఎవరి పాలనలో ఉన్నా అక్కడి ప్రజలు కోరుకునేది ప్రధానంగా మానవ హక్కులు, స్వేచ్ఛాజీవితం, వాటి విషయంలో పాక్ ప్రజారంజకంగా పాలించేందుకు దారులు వెతుక్కొంటే ప్రస్తుతానికి శాంతి పరిఢవిల్లుతుంది. స్థానికరాజకీయ హక్కులు, ప్రాతినిధ్య రాజకీయం, స్వయం పాలనా ప్రతిపత్తి వంటి అంశాలలో పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రజలు పాక్ అరాచక విధానాలను వ్యతిరేకిస్తున్నారు. ప్రజల ఆకాంక్షలను గౌరవించడమొక్కటే పాక్ ఆక్రమిత కశ్మీరులో శాంతికి సుస్థిర మార్గం ఏర్పడగలదు. అణచివేత తాత్కాలిక పరిష్కారానికి హేతువు కాగలదేమో తప్ప దీర్ఘకాలిక పరిష్కారానికి దోహదపడదని పాక్ పాలకులు తెలుసుకోవాలి. పిఒకెలో అశాంతి అటు పాకిస్థాన్ ఇటు భారత్‌ల మధ్య సంబంధాలను కూడా దెబ్బతీసే పరిస్థితి ఉంది. పిఒకెపై ఆధిపత్యం కావాలనుకుంటున్న పాక్ ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షల విషయంలో సంయమనంతో వ్యవహరించకపోవడం దురదృష్టకరం.

అందరిలోనూ శక్తిసామర్థ్యాలు ఎంతో కొంత ఉంటాయి. వాటిని వినియోగించుకోవడంలోనే అసలు సమస్య ఉంటుంది.



**రామకృష్ణ పరమహంస**

మన ప్రవర్తనే మనకు మిత్రుల్ని, శత్రువుల్ని సమకూరుస్తుంది. మన భవిష్యత్తుకు మనమే రూపురేఖలు దిద్దుకోవాలి.



**షేక్ స్పియర్**

# ప్రజావాక్కు



## రైళ్ల రంగు మార్చాలి

**ఇటీవల** హైదరాబాద్, బెంగళూరు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో పట్టాలపై రెండు ఆవులు రైలు ఢీ కొనగా మరణించటం విషాదకరం. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోలను బట్టీ ఛిద్రమైన ఆవుల మాంసం ముద్దలు లోకోపైలెట్ క్యాబిన్‌లోకి వచ్చిపడి ఉండటం బాధాకరం. మనుషులకు హెచ్చరికలు తెలిపే బోర్డులు పెట్టగలం కానీ మరి పశువులకు ఎట్లా తెలిసేది? వందే భారత్ రైళ్ల వెలుపలి భాగాలు ముఖ్యంగా తెలుపు లేత నీలం, తెలుపు కాషాయరంగుల్లో ఉంటున్నాయి. తెలుపు రంగు నిండైన సూర్యకాంతిలో కనపడదు. అలాగే లేత నీలంరంగు మేఘావృతవర్ణంలో ఉండటంవల్ల, అత్యంత వేగంవల్ల జంతువులు త్వరగా పోల్చుకొలేకపోతున్నాయి. లేతరంగులు సూర్యకాంతిలో మిళితమవుతాయి. రైలు దూరం నుంచే ప్రస్ఫుటంగా కనపడేటట్లు ఉండాలి. అప్పుడే పశు మరణాలను ఆపవచ్చు.

**- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్**

## గుళ్లు కాదు..బళ్లు నిర్మించండి

గుళ్లు ఆటవీకం. బళ్లుఆధునికం. ఈమధ్య పాత గుళ్లను పునర్నిర్మించడం ఒక పాషన్ అయిపొయింది. ప్రతివాడు సనాతనంఅని ప్రచారం చేస్తున్నాడు. వాస్తవానికి సనాతనం అంటే ఏమిటోకూడా తెలియదు. అది ఈనాటి సమాజానికిఎందుకు పనికిరాదో తెలియదు. మా నాయనమ్మ, మాతాత సనాతనం అన్నారు కాబట్టినేను అంటున్నాను. మీరుకుడా అనండి తప్ప ఏమీ తెలియదు. పూర్వజనం గుళ్లు నిర్మించేవాళ్ళు. గుళ్లుభక్తిని పెంచుతాయి. భక్తి ఆలోచనని చంపుతుంది. ఎక్కడో ఏదో తవ్వుతుంటే పురాతన విగ్రహంబయటపడింది. పురాతనమైనవి దొరికితె మ్యూజియంలోఉంచాలి. గుళ్లుకాదు, బళ్లునిర్మించండి. గుళ్లు మతాన్ని పెంచుతాయి. బళ్లుశాస్త్రీయసమాజాన్ని పెంచుతాయి.

**- నార్నెవెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా**

## లోక్ అదాలత్‌లో సమస్యలు పరిష్కరించాలి

జూన్20వ తేదీన జరగనున్న లోక్ అదాలత్‌లో పోలీస్ స్టేషన్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖల పరిధిలో ఉన్న భూ కబ్జాలు, అక్రమ నిర్మాణాలువంటి సమస్యలు పరిష్కరించాలి. సంవత్సరాలుగా భూ సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. మానవ హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో, జిల్లా పోలీస్‌అధికారి కార్యాలయాలలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను ఈ లోక్‌అదాలత్‌లోపరిష్కరించాలి.,

**-కదురు శ్రీనివాస్, వరంగల్**

## ఉక్కు ప్రమాదం

**విశాఖ** నగరం స్టీల్‌ప్లాంట్‌లో 150టన్నుల వేడి ఉక్కు ద్రవం ఒకేసారి లీక్ అయిన పెను ప్రమాదంలో 9 మంది ప్రాణాలు కోల్పోవడం, 6గురు తీవ్రగాయాల పాలవడం తీవ్ర విషాదం. 1500 డిగ్రీల వేడిమికి భారీ పరికరాలు కూడా మాడి మసి అయిన దుర్ఘటనలో బాధితులు, మృతులు ఎంత నరకం చూసి ఉంటారో తలచుకుంటేనే గుండె ముక్కలౌతుంది. గతంలోప్రమాదాలు జరిగినా, ఇలా భారీస్థాయిలో విస్ఫోటనం జరగడం బహుశా ఇదే తొలిసారి. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను, నిర్వహణ, ప్రమాద నివారణ, తనిఖీ వ్యవస్థల పట్ల సందేహాల్ని రేకెత్తించే ప్రమాదమిది. రాష్ట్రానికే కాకుండా దేశానికే తలమానికంగా నిలిచే ఈ ప్రభుత్వ రంగ సంస్థ పట్ల ప్రభుత్వాలు పూర్తి శ్రద్ధపెట్టడం అవసరం. లాభనష్టాల కోణాలతోపాటు పూర్తిభద్రత, అవసరమైన సిబ్బంది భర్తీ, ప్రమాద రహిత చర్యలు, ఉద్యోగ భద్రత, గనుల కేటాయింపులతో మంచి ఉత్పాదకత తదితర కోణాలపై దృష్టి పెట్టి అంతర్జాతీయ ప్రమాణాలను సాధించాలి.

**- డా. డి. వి. జి. శంకరరావు, విజయనగరం**

## ఉపాధి హామీని కొనసాగించాలి

**ఉపాధి** పని చేయడం ద్వారా వచ్చిన డబ్బుతో ఆర్థిక స్థిరీకరణ వైపు అడుగులు వేయించడం ముఖ్యం. ఆ వచ్చిన డబ్బుతో గొర్రెలుమేకలు కొనిపించేవిధంగా అడుగులు వేయించడం ముఖ్యం. అంతేకాదు అవి తక్కువ సమయంలోనే వాళ్ళను ఆర్థికంగా బలోపేతం చేస్తాయి. అంతే కాదు భూమికి బలాన్ని ఇవ్వడంలో వాటి ఎరువు ఉపయోగపడుతుంది. అంతే కాదు జీవజాలం పెరుగుదలకు ఉపయోగపడుతుంది. అంటే ఉపాధిహామీ ద్వారా రెండు ఉపయోగాలు ఒకటి గ్రామీణా ఆర్థిక వ్యవస్థ స్థిరీకరణ రెండు జీవజాలం పెరుగుదల.

**- భారత అవినాష్, జనగామ**

## మీసేవ అందుబాటులో ఉండాలి

సామాన్య ప్రజలకు నిత్యం ఏదో ఒక విషయంలో మీసేవ సేవలపై ఆధారపడి ఉంటారు. కానీ కొన్ని మీ సేవలు సమయానికి షాప్‌లు తెరవకుండా తాళం వేసి ప్రజలకు అందుబాటులో లేకుండా అందులో కూడా అధిక డబ్బులు వసూలు చేయడం అలవాటుగామలుచుకున్న సిబ్బంది మీసేవలు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలి. ఎక్కడ నిర్లక్ష్యం వహించిన అధికారులు చర్యలు తీసుకుంటేనే కొంతైనా మెరు గుపడే అవకాశం ఉంది.

**- మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా**

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# అగ్నిప్రమాదాల నివారణకు 'డిజిటల్ ట్విన్'

**అగ్నిప్రమాదాలు ఒక్కసారిగా పుట్టుకొచ్చే విపత్తులు కావు. అవి సంవత్సరాల నిర్లక్ష్యం, బలహీన అమలు, బాధ్యతారాహిత్యపు ఫలితాలు. ప్రతి ప్రమాదం తర్వాత మంటలను ఆర్పడంలో మనం విజయం సాధించవచ్చు. కానీ వాటికి కారణమైన లోపాలను సరిదిద్దకపోతే అదే విషాదం మరో నగరంలో, మరో భవనంలో పునరావృతమవుతుంది. భవనాల ఎత్తు పెరుగుతున్న కొద్దీ భద్రతా ప్రమాణాలు కూడా పెరగాలి. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ పర్యవేక్షణ వ్యవస్థలు కూడా బలోపేతం కావాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే నగరాల నుంచి, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి అడ్డుకునే నగరాల వైపు భారత్ అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే ప్రతి అగ్నిప్రమాదం తర్వాత మనం కోల్పోయిన ప్రాణాలను లెక్కించగలుగుతాం గానీ, వాటిని కాపాడలేకపోయిన వ్యవస్థను మార్చలేం. అదే నేటి పట్టణ భారతం ముందున్న అసలు సవాలు.**

**డి. జయరాం**

ఢిల్లీలో జరిగిన తాజా అగ్నిప్రమాదం మరోసారి దేశాన్ని విషాదంలో ముంచింది. ప్రాణనష్టం, ఆస్తి నష్టం, అధికారుల తనిఖీలు, విచారణ కమిటీలు, పరిహార ప్రకటనలు. ఇవన్నీ ప్రతీ పెద్ద అగ్నిప్రమాదం తర్వాత కనిపించే దృశ్యాలు. కొన్ని రోజులు చర్చ జరుగుతుంది. బాధ్యుల కోసం వెతుకులాట సాగుతుంది. ఆ తర్వాత మరో ప్రమాదం వరకు అంతా మామూలే. కానీ ఒక ప్రశ్నమాత్రం అలాగే మిగిలిపోతుంది. సాంకేతికంగా ఎంతో ముందుకు వెళ్లామని చెప్పుకునే మన దేశంలో ఇటువంటి అగ్నిప్రమాదాలు ఎందుకు పదేపదే జరుగుతున్నాయి? దేశంలో అగ్నిప్రమాదాలు యాదృచ్ఛిక ఘటనలుగా మారడం లేదు. ప్రతి ఏడాది వేలాది మంది అగ్నిప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, పరిశ్రమలు ఏ రంగమూ దీనికి మినహాయింపు కాదు. ఢిల్లీలోని హోటల్‌లో జరిగిన అగ్నిప్రమాదం, సూరత్ కోచింగ్ సెంటర్ ప్రమాదం, కోల్‌కతా హోటల్ అగ్నిప్రమాదం, రాజ్‌కోట్ గేమింగ్ జోన్ విషాదం వంటి ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీశాయి. అయినప్పటికీ వాటి నుంచి నేర్చుకోవాల్సిన పాఠాలు పూర్తిగా అమలులోకి వచ్చినట్లు కనిపించడం లేదు. ఈ ప్రశ్నకు సమాధానం వెతికితే సమస్య మంటల్లో కాదు, మన పట్టణ పాలనలో ఉందనే విషయం స్పష్టమవుతుంది. అగ్నిప్రమాదం ఒక సంఘటన మాత్రమే. దానికి దారితీసే నిర్లక్ష్యం, ప్రణాళికా లోపాలు, నిబంధనల అమలులో బలహీనతలు, బాధ్యతారాహిత్యమే అసలు కారణాలు. దేశంలో పట్టణీకరణ వేగంగా విస్తరిస్తోంది. వచ్చే దశాబ్దాల్లో దేశ జనాభాలో గణనీయమైన భాగం నగరాల్లోనే నివసించనుంది. ఎత్తైన భవనాలు, వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ పెరుగుతున్నాయి. కానీ వాటికి అనుగుణంగాభద్రతా సంస్కృతి ఎదగడం లేదు. ఒకప్పుడు నివాస అవసరాల కోసం నిర్మించిన భవనాలు నేడు వాణిజ్య సముదాయాలుగా మారుతున్నాయి. చిన్న దుకాణాలు పెద్ద రెస్టారెంట్లుగా రూపాంతరం చెందుతున్నాయి. గిడ్డంగులు కార్యాలయాలుగా మారుతున్నాయి. అయితే భవనాల వినియోగం మారినంత వేగంగా భద్రతా ప్రమాణాలు మారడం లేదు. ఫలితంగా పాత నిర్మాణాలపై కొత్త ప్రమాదాలు పేరుకుపోతున్నాయి. మన నగరాల్లోని అనేక ప్రాంతాల్లో ఫైర్ ఇంజిన్ తిరగలేని ఇరుకైన వీధులు కనిపిస్తాయి. భవనాల చుట్టూ అత్యవసర వాహనాలకు దారి ఉండదు. పార్కింగ్ వాహనాలతో ప్రవేశ మార్గాలు మూసుకుపోతాయి. అత్యవసర నిష్క్రమణ ద్వారాలు వస్తువుల నిల్వ గదులుగా మారిపోతాయి. అనుమతి లేని అదనపు అంతస్తులు నిర్మించబడతాయి. విద్యుత్ వ్యవస్థలు అనుమతించిన సామర్థ్యానికి మించి వినియోగించబడతాయి. ప్రమాదం సంభవించిన తర్వాత ఇవన్నీ బయటపడతాయి. కానీ ప్రమాదం జరగకముందే గుర్తించి సరిదిద్దే వ్యవస్థ మాత్రం చాలా చోట్ల కనిపించదు. ఇదే మన పట్టణ భద్రతలోని అతిపెద్ద బలహీనత. అగ్నిప్రమాదాల్లో ఎక్కువ మంది మంటల వల్ల కాకుండా పొగ వల్ల ప్రాణాలు కోల్పోతారన్న విషయం తరచూ మరచిపోతాం. కొన్ని నిమిషాల్లోనే పొగ మెట్లు, కారిడార్లను కమ్మేస్తుంది. బయటకు వెళ్లే మార్గాలు మూసుకుపోతాయి. ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు ఉన్నా, అత్యవసర నిష్క్రమణ మార్గాలు పనిచేయకపోతే అవి పెద్దగా ఉపయోగపడవు. అందుకే ఆధునిక అగ్నిభద్రత అంటే కేవలం మంటలను ఆర్పడం కాదు. ప్రమాదం సంభవించిన వెంటనే ప్రజలు సురక్షితంగా



బయటపడేలా వ్యవస్థలను రూపొందించడం. ఇక్కడే మనం ఒక నిజాన్ని అంగీకరించాలి. మన సమస్య సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడం కాదు. అమలు వ్యవస్థ బలహీనంగా ఉండటమే. అగ్నిభద్రతా నిబంధనలున్నాయి. నిర్మాణ ప్రమాణాలు ఉన్నాయి. తనిఖీ వ్యవస్థలు ఉన్నాయి. కానీ అవి చాలాసార్లు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు వినిపిస్తుంటాయి. దేశంలోని అనేక పెద్ద ప్రమాదాలపై జరిగిన దర్యాప్తుల్లో ఒకే తరహా లోపాలు బయటపడ్డాయి. అత్యవసర నిష్క్రమణ ద్వారాలు లేకపోవడం, అగ్నిమాపక పరికరాలు పనిచేయకపోవడం, అనుమతులు లేకుండా నిర్మాణ మార్పులు చేయడం, విద్యుత్ నిర్వహణలో నిర్లక్ష్యం వంటి అంశాలు పదేపదే వెలుగుచూశాయి. అంటే సమస్య నిబంధనల కొరత కాదు. వాటి అమలులోనిరంతర పర్యవేక్షణ లేకపోవడమే. ఇప్పటి వరకు అగ్నిప్రమాదాలపై మన దృష్టి ప్రధానంగా ప్రతిస్పందనపైనే ఉంది. ప్రమాదం జరిగిన తర్వాత అగ్నిమాపక దళాలు ఎంత వేగంగా స్పందించాయన్న దానిపై చర్చ సాగుతుంది. కానీ ప్రమాదం సంభవించే అవకాశాన్ని ముందుగానే గుర్తించి అడ్డుకోవడంపై తగినంత దృష్టి లేదు. ఇరవై ఒకటో శతాబ్దంలో అగ్నిభద్రత అంటే కేవలం ఫైర్ ఇంజిన్లు, నీటి ట్యాంకులు, అగ్నిమాపక పరికరాలు మాత్రమే కాదు. డేటా, కృత్రిమ మేధ, సెన్సార్ సాంకేతికతలు కూడా అంతే కీలకమైనవి. కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, స్మార్ట్ సెన్సార్లు, రియల్‌టైమ్ మానిటరింగ్ వ్యవస్థలు భవనాల్లో ఉష్ణోగ్రత మార్పులు, పొగ స్థాయిలు, గ్యాస్ లీకేజీలు, అసాధారణ విద్యుత్ వినియోగాన్ని నిరంతరం పర్యవేక్షించగలవు. ప్రమాద సూచనలు కనిపించిన వెంటనే హెచ్చరికలు జారీ చేయగలవు. తద్వారా ప్రమాదం సంభవించకముందే జాగ్రత్త చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ప్రపంచంలోని అనేక నగరాలు ఇప్పటికే ఈ దిశగా అడుగులు వేస్తున్నాయి. భవనాల డిజిటల్ నమూనాలను రూపొందించి అత్యవసర పరిస్థితులను ముందుగానే అంచనా వేసే 'డిజిటల్ ట్విన్' సాంకేతికతను వినియోగిస్తున్నాయి. ఒక ప్రాంతంలో మంటలు చెలరేగితే పొగ ఏ దిశగా వ్యాపిస్తుంది? ప్రజలను ఏ మార్గంలో తరలించాలి? అగ్నిమాపక వాహనాలు ఎంత సమయంలో చేరగలవు? వంటి అంశాలను ముందుగానే విశ్లేషిస్తున్నాయి. మన దేశంలోకూడా స్మార్ట్ సిటీ కార్యక్రమాలు అమలవుతున్నాయి. అయితే నగరాలను స్మార్ట్‌గా మార్చడం అంటే కేవలం సీసీ కెమెరాలు, వైఫై సదుపాయాలు ఏర్పాటు చేయడం కాదు. ప్రజల భద్రతను ముందుగానే నిర్ధారించే తెలివైన వ్యవస్థలను నిర్మించడమే అసలైన స్మార్ట్‌నెస్. అయితే సాంకేతిక పరిష్కారాలు మాత్రమే సరిపోవు. వాటిని అమలు చేసే పరిపాలనా సంకల్పం అవసరం. మున్సిపల్ సంస్థలు, అగ్నిమాపక శాఖలు, విద్యుత్ విభాగాలు, పట్టణాభివృద్ధి సంస్థలు విడివిడిగా కాకుండా సమన్వయంతో పని చేయాలి. భవన అనుమతుల నుంచి భద్రతా పర్యవేక్షణ వరకు మొత్తం వ్యవస్థను డిజిటల్‌గా అనుసంధానించాలి. భద్రతా తనిఖీల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అధిక ప్రమాదం ఉన్న భవనాలను గుర్తించి ప్రత్యేక పర్యవేక్షణలో ఉంచాలి. అంతకంటే ముఖ్యంగా భద్రతను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. ఢిల్లీ ఘటన మరోసారి ఒక కఠినమైన పాఠాన్ని గుర్తుచేసింది. అగ్నిప్రమాదాలు ఒక్కసారిగా పుట్టుకొచ్చే విపత్తులు కావు. అవి సంవత్సరాల నిర్లక్ష్యం, బలహీన అమలు, బాధ్యతారాహిత్యపు ఫలితాలు. ప్రతి ప్రమాదం తర్వాత మంటలను ఆర్పడంలో మనం విజయం సాధించవచ్చు. కానీ వాటికి కారణమైన లోపాలను సరిదిద్దకపోతే అదే విషాదం మరో నగరంలో, మరో భవనంలో పునరావృతమవుతుంది. భవనాల ఎత్తు పెరుగుతున్న కొద్దీ భద్రతా ప్రమాణాలు కూడా పెరగాలి. నగరాలు విస్తరిస్తున్న కొద్దీ పర్యవేక్షణ వ్యవస్థలు కూడా బలోపేతం కావాలి. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే నగరాల నుంచి, ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి అడ్డుకునే నగరాల వైపు భారత్ అడుగులు వేయాల్సిన సమయం ఆసన్నమైంది. లేకపోతే ప్రతి అగ్నిప్రమాదం తర్వాత మనం కోల్పోయిన ప్రాణాలను లెక్కించగలుగుతాం గానీ, వాటిని కాపాడలేకపోయిన వ్యవస్థను మార్చలేం. అదే నేటి పట్టణ భారతం ముందున్న అసలు సవాలు. ●

# ఇంధన స్వాతంత్ర్యం ఇంకెంత దూరం!

**తిప్పర్తి శ్రీనివాస్**

భారత్-వెనిజులా మధ్య ఇంధన భాగస్వామ్యానికి కొత్త ఊపు రావడం స్వాగతించదగ్గ పరిణామం. ప్రపంచంలో అతిపెద్ద చమురు నిల్వలు కలిగిన దేశాలలో వెనిజులా ఒకటి. అలాంటి దేశంతో భారత్ తన ఇంధన సంబంధాలను విస్తరించుకోవడం కేవలం వాణిజ్యపరమైన అంశం కాదు. అది జాతీయ ప్రయోజనాలకు సంబంధించిన వ్యూహాత్మక నిర్ణయం కూడా. అయితే ఈ సందర్భంగా ఒక ప్రాథమిక ప్రశ్న మన ముందుకు వస్తుంది. రాజకీయంగా స్వాతంత్ర్యం సాధించి దాదాపు ఎనిమిది దశాబ్దాలు గడిచినా, ఇంధన అవసరాల విషయంలో భారత్ ఇంకా పూర్తిస్థాయి స్వేచ్ఛను ఎందుకు పొందలేకపోయింది? 1947 ఆగస్టు 15న మన దేశం విదేశీ పాలన నుంచి విముక్తి పొందింది. కానీ ఆర్థిక రంగంలో, ముఖ్యంగా ఇంధన భద్రత విషయంలో, మన స్వాతంత్ర్యం ఇప్పటికీ అసంపూర్ణంగానే కనిపిస్తోంది. దేశ అభివృద్ధికి విద్యుత్తు ఎంత అవసరమో, విద్యుత్తు ఉత్పత్తికి ఇంధనం అంతే అవసరం. చమురు, సహజవాయువు లేకుండా ఆధునిక ఆర్థికవ్యవస్థ ఒక్కరోజు కూడా ముందుకు కదలదు. అలాంటి కీలక రంగంలో మనం ఇంకా దిగుమతులపై ఆధారపడాల్సి వస్తోంది. భారత్ తన చమురు అవసరాలలోసుమారు 85 శాతానికి పైగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అంటే మన ఆర్థికవ్యవస్థకు అవసరమైన జీవనాడి మన చేతుల్లో లేదు. అంతర్జాతీయ మార్కెట్లలో ధరలు పెరిగినా, యుద్ధాలు జరిగినా, రాజకీయ ఉద్రిక్తతలు తలెత్తినా వాటి ప్రభావం నేరుగా భారత ఆర్థిక వ్యవస్థపై పడుతుంది. ఈ పరిస్థితిలో చమురు ఎక్కడి నుంచి కొనుగోలు చేయాలన్న నిర్ణయం కూడా పూర్తిగా మన చేతుల్లో ఉండకపోవడం ఆందోళనకరమైన విషయం. రష్యా, ఇరాన్, వెనిజులా వంటి దేశాలు ప్రపంచ ఇంధన మార్కెట్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. కానీ అంతర్జాతీయ రాజకీయ సమీకరణలు, ఆర్థిక ఆంక్షలు, పాశ్చాత్య దేశాల ఒత్తిళ్లు వంటి కారణాల వల్ల భారత్ తన అవసరాలకు అనుగుణంగా ఈ దేశాలతో పూర్తిస్థాయిలో వ్యాపారం చేయలేకపోయిన సందర్భాలు ఉన్నాయి. ఒక స్వతంత్ర దేశంగా మనం ఎవరితో వ్యాపారం చేయాలో, ఎవరినుంచి చమురు కొనుగోలు చేయాలో నిర్ణయించే హక్కు మనకుండాలి. ఆ నిర్ణయాలు ఢిల్లీ తీసుకోవాలి తప్ప వాషింగ్టన్, బ్రస్సెల్స్ లేదా మరెక్కడో తీసుకోవాల్సిన అవసరం ఉండకూడదు. అంతర్జాతీయ సంబంధాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరు. శాశ్వతంగా ఉండేది జాతీయ ప్రయోజనమే. ఈ సూత్రాన్ని ప్రపంచంలోని అన్ని ప్రధాన దేశాలు అనుసరిస్తున్నాయి. అమెరికా తన ప్రయోజనాలను కాపాడుకుంటుంది. చైనా తన అవసరాలను ముందుంచుకుంటుంది. రష్యా తన వ్యూహాలకు అనుగుణంగా వ్యవహరిస్తుంది. అలాంటప్పుడు భారత్ కూడా తన ఇంధన అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవడం సహజం. ఇటీవలి సంవత్సరాలలో భారత్ తన విదేశాంగ విధానంలో వ్యూహాత్మక స్వతంత్రతను ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోళ్లను కొనసాగించడం అందుకు ఒక ఉదాహరణ. ఇప్పుడు వెనిజులాతో సంబంధాలను బలోపేతం చేయడం కూడా అదేదిశలో మరో అడుగుగా చూడాలి. ప్రపంచ ఇంధన మార్కెట్‌లో సరఫరా వనరులను విస్తరించుకోవడం ద్వారా భారత్ తన ఇంధన భద్రతను మరింతబలోపేతం చేసుకోవచ్చు. అయితే దీర్ఘకాలిక పరిష్కారం కేవలం కొత్త దేశాల నుంచి చమురు కొనుగోలు చేయడంలో లేదు. దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడంలో ఉంది. సౌరశక్తి, పవనశక్తి, హరిత హైడ్రోజన్ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వనరుల అభివృద్ధికి భారత్ ఇప్పటికే పెద్దఎత్తున ప్రాధాన్యత ఇస్తోంది. ఈ ప్రయత్నాలు మరింత వేగవంతం కావాలి. దేశీయ చమురు, సహజవాయువు అన్వేషణను కూడా విస్తరించాలి. ఇంధన వినియోగంలో సామర్థ్యాన్ని పెంచాలి. అయినప్పటికీ, సమీ ప భవిష్యత్తులో చమురు అవసరం తగ్గే అవకాశం లేదు. అందువల్ల ప్రపంచంలో ఎక్కడ నాణ్యమైన, చౌకైన ఇంధనం లభిస్తే అక్కడి నుంచి దిగుమతి చేసుకునే సామర్థ్యాన్ని భారత్ పెంచుకోవాలి. అది రష్యాకావచ్చు, ఇరాన్ కావచ్చు, వెనిజులా కావచ్చు లేదా మరే ఇతర దేశం కావచ్చు. భారత ప్రయోజనాలే అంతిమ ప్రమాణంగా ఉండాలి. వెనిజులాతో ఏర్పడుతున్న కొత్త భాగస్వామ్యం ఆ దిశగా ఒకసానుకూల సంకేతం. దేశానికి అవసరమైన ఇంధనాన్ని ప్రపంచంలోని ఏ మూలనుంచైనా, ఎటువంటి బాహ్య ఒత్తిళ్లకు లోనుకా కుండా, పూర్తిగా జాతీయ ప్రయోజనాల ఆధారంగా సమ కూర్చుకోగలిగిన రోజునే భారత్ ఆర్థికంగా నిజమైన స్వాతంత్ర్యాన్ని సాధించిందని చెప్పవచ్చు. రాజకీయ స్వాతంత్రం 1947లో వచ్చింది. ఇంధన స్వాతంత్రం ఎప్పుడు వస్తుందో మరి. ●

# నిజమైన ఆహార భద్రత సాధించామా?

**డి చంద్రభాను**

మానవ వనరుల అభివృద్ధికి, దేశ సుస్థిర ప్రగతికి అత్యంత ప్రాథమికమైన పునాది ఆహార భద్రత. ఐక్యరాజ్యసమితి నిర్వచనం ప్రకారం ప్రతి వ్యక్తికి ఎల్లప్పుడూ సురక్షితమైన, పోషక విలువలు కలిగిన ఆహారం భౌతికంగాను, ఆర్థికంగాను అందుబాటులో ఉండే పరిస్థితినే ఆహార భద్రతగా పరిగణిస్తారు. అయితే నేటి పరిస్థితుల్లో ఆహార భద్రత అంటే కేవలం కడుపు నింపే ధాన్యాలు అందుబాటులో ఉండటం మాత్రమేకాదు. శరీరానికి అవసరమైన మాంసకృత్తులు, కొవ్వులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమతుల్యంగా లభించడం కూడా అంతే ముఖ్యమైన అంశంగా మారింది. అందుకే ఇప్పుడు ఆహార భద్రత భావన పోషకాహార భద్రత స్థాయికి విస్తరించింది. ఆహార భద్రతను అంచనా వేయడంలో ఈ నాలుగు అంశాలను పరిగణనలోకి తీసుకుంటారు. దేశంలో తగినంత ఆహార ఉత్పత్తి, నిల్వలు ఉండాలి. ఉత్పత్తి అయిన ఆహారం ప్రతి వ్యక్తి వరకు చేరాలి. స్వచ్ఛమైన తాగునీరు, పారిశుధ్యం, ఆరోగ్య పరిస్థితులు అనుకూలంగా ఉండి ఆహారం శరీరానికి సక్రమంగా ఉపయోగపడాలి. ప్రకృతి వైపరీత్యాలు, ఆర్థిక సంక్షోభాలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు వచ్చినా ఆహార సరఫరా నిరంతరాయంగా కొనసాగాలి. ఈ నాలుగు అంశాలు సమగ్రంగా ఉన్నప్పుడే నిజమైన ఆహార భద్రత సాధ్యమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ కోట్లాది మంది ప్రజలు ఆకలి, పోషకాహార లోపాలతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశాలలో ఒకటైన భారత్ తన ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో గణనీయమైన పురోగతి సాధించింది. ఇటీవల వెలువడిన జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే తాజా గణాంకాలు దేశంలో పోషకాహార పరిస్థితి క్రమంగా మెరుగుపడుతున్నట్లు సూచిస్తున్నాయి. ఐదేళ్ల లోపు పిల్లల్లో ఎదుగుదల లోపం గణనీయంగా తగ్గడం, తీవ్రమైన పోషకాహార లోపం తగ్గుముఖం పట్టడం సానుకూల పరిణామాలు. తెలుగు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ జాతీయ సగటుతో పోలిస్తే మెరుగైన ఫలితాలు నమోదు చేశాయి. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితధాన్యాల పంపిణీ, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార కార్యక్రమాలు ఈ పురోగతికి దోహదపడ్డాయి. దేశవ్యాప్తంగా కేరళ, తమిళనాడు, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, గోవా వంటి రాష్ట్రాలు పోషకాహార భద్రతలో ఆదర్శంగా నిలుస్తున్నాయి. సమర్థవంతమైన పంపిణీ వ్యవస్థలు, వైవిధ్యభరితమైన ఆహారపథకాలు



అక్కడ మెరుగైన ఫలితాలను అందిస్తున్నాయి. భారత్ నేడు ప్రపంచంలో అతిపెద్ద ఆహార ధాన్యాల ఉత్పత్తిదారులలో ఒకటిగా ఉన్నప్పటికీ, ఆహార భద్రతకు కొత్త తరహా సవాళ్లు ఎదురవుతున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా వర్షపాత నమూనాలు మారడం, అకాల వర్షాలు, కరవులు, తీవ్ర ఉష్ణోగ్రతలు పంటల దిగుబడిపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు నిల్వ సదుపాయాల కొరత, శీతలీకరణ గిడ్డంగుల లేమి, రవాణా లోపాల కారణంగా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలలో గణనీయమైన భాగం వినియోగదారులకు చేరకముందే వృథా అవుతోంది. అయితే దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కేవలం ఆహార కొరత కాదు. ఒక వైపు పోషకాహార లోపం కొనసాగుతుండగా, మరోవైపు ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి జీవనశైలి వ్యాధులు వేగంగా పెరుగుతున్నాయి. దీనినే నిపుణులు పోషకాహార ద్వంద్వ భారంగా పేర్కొంటున్నారు. అంటే కొందరు సరిపడా ఆహారం లేక బాధపడుతుంటే, మరికొందరు అసమతుల్య ఆహారం వల్ల ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లల్లో సమతుల్య పోషకాహారం అందకపోవడం, పెద్దవారిలో అధికంగా శుద్ధి చేసిన ఆహార పదార్థాల వినియోగం పెరగడం ఆందోళన కలిగించే అంశాలు. ఆకలి తగ్గుతున్నప్పటికీ గుప్త పోషకాహార లోపం ఇంకా కొనసాగుతుండటం వాస్తవ పరిస్థితిని తెలియజేస్తోంది. దేశంలో ఆహార భద్రతను బలోపేతం చేయడంలో జాతీయ ఆహార భద్రతా చట్టం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ చట్టం ద్వారా కోట్లాది మంది ప్రజలకు సబ్సిడీ ధరలకే లేదా ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. ఒక దేశం-ఒక రేషన్ కార్డు విధానం వలస కార్మికులకు ప్రత్యేక ప్రయోజనం కల్పించింది. అదే సమయంలో గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల కోసం అమలు చేస్తున్న పౌష్టికాహార పథకాలు పోషకాహార లోపాన్ని తగ్గించడంలో తోడ్పడుతున్నాయి. అయితే భవిష్యత్తులో ఆహార భద్రతను మరింత బలోపేతం చేయాలంటే కేవలం ధాన్యాల పంపిణీసరిపోదు. ఇనుము, జింక్, విటమిన్లు అధికంగా ఉండే పంటరకాలను విస్తృతంగా ప్రోత్సహించాలి. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి చిరుధాన్యాలను ప్రజల ఆహారంలో భాగం చేయాలి. గ్రామీణ ప్రాంతాల్లో నిల్వ, శీత లీకరణ సదుపాయాలను విస్తరించడం ద్వారా ఆహార వృథా ను తగ్గించవచ్చు. అలాగే ప్రజాపంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా మార్చడంఅవసరం. గత రెండు దశాబ్దాల్లో ఆకలి నిర్మూలన, ఆహార పంపిణీ రంగాల్లో దేశం గణనీయ మైన పురోగతి సాధించింది. అయితే ఇకపై లక్ష్యం కేవలం కడుపు నింపడం కాకుండా ప్రతి పౌరుడికి సమతుల్యమైన, ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడం కావాలి. పరిమాణం నుంచి నాణ్యతవైపు, ధాన్యాల నుంచి పోషకాలవైపు అడుగులు వేయగలిగితేనే ఆహార భద్రత సాధ్యమవుతుంది. ●

# పశ్చిమాసియా రణరంగం
# అమెరికా - ఇరాన్ మధ్య భీకర దాడులు



**వాషింగ్టన్, జూన్ 10:** పశ్చిమాసియా మరోసారి రణరంగంగా మారింది. హార్ముజ్ సమీపంలో అపాచీ హెలికాప్టర్ కూలిపోయిన ఘటనకు సంబంధించి ఇరాన్‌పై అమెరికా ప్రతీకార దాడులకు దిగింది. దీనికి టెహ్రాన్ కూడా గట్టిగా ప్రతిస్పందిస్తోంది. గల్ఫ్ ప్రాంతాల్లో అగ్రరాజ్య స్థావరాలే లక్ష్యంగా భీకర దాడులు చేస్తోంది. అమెరికా దాడులను దురాక్రమణ చర్యగా ఐఆర్‌జిసి అభివర్ణించింది. బహ్రెయిన్‌లోని అమెరికా నావికా ఫ్లీట్‌తోపాటు, జోర్డాన్‌లోని ఆ దేశానికి చెందిన అల్ అజ్రాక్ వైమానిక స్థావరం లక్ష్యంగా దాడులు చేసినట్లు తెలిపింది. కువైట్, బహ్రెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సహా ఉత్తర ఇరాక్‌లతో పలు పేలుడు శబ్దాలు వినిపించాయి. తమ భూభాగంపై దాడులు ఇలానే కొనసాగితే.. తీవ్ర ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ హెచ్చరించింది. దీనికి ముందు దక్షిణ ఇరాన్‌లోని జాస్క్, సిరిక్, ఖేష్మ్ సహా పలు ప్రాంతాలు లక్ష్యంగా యుఎస్ దళాలు దాడులు చేశాయి. ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై ఆత్మరక్షణ దాడులు ప్రారంభించినట్లు యుఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) పేర్కొంది. ఈ దాడులను ట్రంప్ సమర్థించుకున్నారు. ఓ మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్‌కు గట్టి సందేశం ఇచ్చేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 'ప్రతిస్పందనలు చాలా ముఖ్యం అని నేను భావిస్తున్నా. వారు మా హెలికాప్టర్‌ను కూల్చివేశారు. వారు చేసిన దానికి ఇది మా ప్రతిస్పందన. ఇది చాలా బలంగా.. అత్యంత శక్తిమంతంగా ఉండాలని అనుకుంటున్నా' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

**అమెరికా ఎంక్యు-9 రీపర్ డ్రోన్ కూల్చేశాం: ఇరాన్**

వైమానిక ఘర్షణ నేపథ్యంలో.. బుషెహర్ ప్రావిన్స్‌పై ఒక అమెరికా ఎంక్యు-9 రీపర్ డ్రోన్ కూల్చివేసినట్లు ఐఆర్‌జిసి ప్రకటించింది. దీనికి సంబంధించిన ఓ విడియోను కూడా విడుదల చేసింది. అయితే, ఈ ప్రకటనను అమెరికా ఇంకా ధ్రువీకరించలేదు.



# మీనాక్షి నామినేషన్ తిరస్కరణ ఉపసంహరించండి

సిఇసి జ్ఞానేష్‌కుమార్‌కు కాంగ్రెస్ వినతి

ఇసి చర్యలో చట్టపరమైన లోపముందని వాదన

ఒత్తిడితోనే ఆ నిర్ణయం : మీనాక్షి ఆరోపణ

**న్యూఢిల్లీ, జూన్ 10:** చట్టప్రకారం ఉనికిలో లేని ఒక క్రిమినల్ కేసు ఆధారంగా రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్‌ఒ) నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపిస్తూ, సీనియర్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ బుధవారం ఎన్నికల కమిషన్ (ఇసి)ని కలిసింది. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ నేతృత్వంలోని ఒక ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం, ఇందులో అభ్యర్థి నటరాజన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అభిషేక్ సింఘ్వీ, జైరామ్ రమేష్, భూపేష్ బఘేల్, దీపా దాస్‌మున్షి, రణదీప్ సింగ్ సుర్జేవాలా కూడా ఉన్నారు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లను కలిసింది. ఎన్నికల అధికారి (ఆర్‌ఒ) నిర్ణయం చట్టబద్ధంగా నిలవదని, ఓటింగ్ జరగకముందే ఎన్నికల ప్రక్రియను వక్రీకరించిందని వారు వాదించారు. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33ఎను ప్రస్తావిస్తూ, రెండేళ్లకుపైగా జైలు శిక్ష విధించదగిన క్రిమినల్ కేసులను, కోర్టు ఇప్పటికే అభియోగాలు నమోదు చేసిన కేసులను మాత్రమే అభ్యర్థులు వెల్లడించాల్సి ఉంటుందని సింఘ్వీ అన్నారు. నటరాజన్ కేసు ఆ దశకు చాలా దూరంలో ఉందని ఆయన అన్నారు. "మొదట విచారణకు స్వీకరించడం, ఆ తర్వాత దర్యాప్తు, ఆపై ఛార్జిషీట్, చివరకు అభియోగాలు నమోదు చేయడం జరుగుతుంది. అభియోగాలు నమోదు చేసిన తర్వాతే వివరాలు వెల్లడించాలని చట్టం నిర్దేశిస్తుంది" అని ఆయన అన్నారు. ఇలాంటి కారణాలతో ఒక నామినేషన్‌ను తిరస్కరించడం అసమాన పోటీ వాతావరణాన్ని సృష్టిస్తుందని, ఒక అభ్యర్థికి ఎన్నికలలో పోటీ చేసే అవకాశాన్ని నిరాకరిస్తుందని కాంగ్రెస్ ఇసికి తెలిపింది. ఇటు వంటి చర్యలు ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధమని, ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతాన్ని ప్రభావితం చేస్తాయని ఆ పార్టీ వాదించింది. దీనిని ఒక తీవ్రమైన చట్టపరమైన లోపంగా అభివర్ణిస్తూ, దానిని సరిదిద్దడానికి రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 కింద తన అధికారాలను ఉపయోగించాలని కూడా ఆ ప్రతినిధి బృందం కమిషన్‌ను కోరింది. రిటర్నింగ్ అధికారుల నిర్ణయాలను సమీక్షించేందుకు, రద్దు చేసేందుకు ఇసికి పూర్తి అధికారం ఉందని, ఎన్నికల పిటిషన్ల ద్వారా న్యాయపరమైన పరిష్కారాల కోసం అభ్యర్థులను సంవత్సరాల తరబడి వేచి ఉండేలా బలవంతం చేయకూడదని సింఘ్వీ అన్నారు. ఆర్‌ఒ ఉత్తర్వును "తీవ్రమైనది", "స్పష్టంగా చట్టవిరుద్ధమైనది" "చట్టబద్ధమైన అధికారం లేనిది"గా అభివర్ణిస్తూ, ఎన్నికల ప్రక్రియలో నిష్పక్షపాతాన్ని పునరుద్ధరించడానికి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను రద్దు చేయడానికి ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పేర్కొంది. ఆర్‌ఒ ఉత్తర్వు లోపభూయిష్టం: ఇసి అధికారులతో సమావేశం అనంతరం అభిషేక్ సింఘ్వీ మీడియాతో మాట్లాడుతూ, ఆర్‌ఒ ఆ ఉత్తర్వు ఎంత లోపభూయిష్టంగా ఉందంటే అది "రెండు ప్లస్ రెండు సమానం ఏడు" అని రాయడం లాంటిదని అన్నారు. తన నామినేషన్ పత్రాలలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసును వెల్లడించడంలో విఫలమైనందున నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆయన అన్నారు. నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసు పెండింగ్‌లో లేదని సింఘ్వీ స్పష్టం చేశారు. ఒక ప్రైవేట్ ఫిర్యాదుపై ఎందుకు విచారణ చేపట్టకూడదో వివరించడానికి హాజరు కావాలని కోరుతూ ఆమెకు కేవలం కోర్టు నోటీసు మాత్రమే అందిందని ఆయన చెప్పారు. క్రిమినల్ చట్టం ప్రకారం, ఒక మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించిన తర్వాతే అది ఉనికిలోకి వస్తుందని ఆయన అన్నారు. "మేజిస్ట్రేట్ కేసును విచారణకు స్వీకరించలేదు. విచారణకు స్వీకరించకుండా, క్రిమినల్ కేసు ఉండదు. అందువల్ల, ఆమె వెల్లడించడానికి ఏమీ లేదు" అని సింఘ్వీ అన్నారు. రిటర్నింగ్ అధికారులపై ఒత్తిడితోనే: రిటర్నింగ్ అధికారులు ఒత్తిడికి లోనయ్యారని, ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవహరించారని మీనాక్షినటరాజన్ ఆరోపించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, ఇది కేవలం రాజకీయ దురుద్దేశం మాత్రమే. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు జరిగిన ప్రయత్నాలను నిన్న ప్రతి దశలోనూ తాము చూశామన్నారు.

# పశ్చిమాసియా రౌడీ ఇకలేడు.. చనిపోయాడు!

## ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ట్రూత్ పోస్టు!



**వాషింగ్టన్,జూన్ 10:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయని అనుకుంటే అనూహ్యంగా మళ్లీ పెరుగుతున్నాయి. గల్ఫ్ దేశాలు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండగా ప్రతీకారంగా అమెరికా దాడులు చేయడంతో మళ్లీ టెన్షన్ వాతావరణం నెలకొంది. మధ్యప్రాచ్యం ఉద్రిక్తతలపై ప్రపంచ దేశాలు భయాందోళన చెందుతున్నాయి. తాజాగా ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మధ్యప్రాచ్య రౌడీ ఇక చనిపోయాడు అంటూ ఇరాన్‌ను లక్ష్యంగా చేసుకుని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికాఇరాన్ మధ్య తాజా సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ట్రంప్ ఇరాన్ సైన్యం పూర్తిగా ఓడిపోయిందని వారి నౌకాదళం, వైమానిక దళ సామర్థ్యాలు దాదాపు నిర్వీర్యమయ్యాయని పేర్కొన్నారు. అమెరికాతో ఒప్పందం కుదుర్చుకునే విషయంలో టెహ్రాన్ ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేసిందని ఆరోపిస్తూ ఇప్పుడు దానికి భారీ మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్ సైన్యం పూర్తిగా గందరగోళంలో ఉంది. వారు పూర్తిగా ఓడిపోయారు. ఇరాన్ మాటలు మాత్రమే చెబుతుంది చర్యలు ఉండవు. మధ్యప్రాచ్య రౌడీ ఇక చనిపోయాడు అని ట్రంప్ తన పోస్టులో వ్యాఖ్యానించారు. ఇటీవల కాలంలో ఇరాన్‌పై ట్రంప్ చేసిన అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలలో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు. కొన్ని గంటల ముందే ఇరాన్‌పై ట్రంప్ విమర్శలు గుప్పించారు. అమెరికాతో ప్రయోజనకరమైన ఒప్పందం చేసుకునే అవకాశాన్ని ఇరాన్ కోల్పోయిందని చర్చలు జరపడంలో చాలా ఆలస్యం చేసిందని అన్నారు. వారికి ఎంతో ఉపయోగపడే ఒప్పందంపై నిర్ణయం తీసుకోవడానికి చాలా సమయం తీసుకున్నారు. ఇప్పుడు దానికి మూల్యం చెల్లించాల్సిందేనని హెచ్చరించారు. ఇటీవల అమెరికా.. ఇరాన్‌కు చెందిన పలు సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులు నిర్వహించగా దానికి ప్రతిస్పందనగా ఇరాన్ బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లలో ఉన్న అమెరికా సైనిక కేంద్రాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసింది. ఈ పరిణామాలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు మరింత పెరిగాయి.

# కాంగ్రెస్‌లో టిఎంసి విలీనం?

- సోనియాగాంధీతో మమత సమావేశం - మరుసటి రోజే రాహుల్‌తో అభిషేక్ భేటీ
- మమతకు మరో షాక్... రాజ్యసభకు, పార్టీకి సుస్మితా దేవ్ రాజీనామా
- తిరుగుబాటు శిబిరంలో చేరిన లోక్‌సభ ఎంపి సాయోని ఘోష్



**న్యూఢిల్లీ, జూన్ 10:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత తేరుకుంటున్న మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్‌ను దాని మాతృ పార్టీ అయిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌లో విలీనం చేస్తారా? 1998 జనవరి 1న పార్టీని చీల్చి, 15 యేళ్లపాటు తాను కోరుకున్న విధంగా రాష్ట్రాన్ని పాలించిన ఫైర్‌బ్రాండ్ నాయకురాలి రాజకీయ వలయం ఇప్పుడు పూర్తయినట్లు కనిపిస్తోంది. 20యేళ్ల వయసులో కళాశాల విద్యార్థినిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి, ఇటీవలి వరకు రాజకీయ ఒడిదుడుకులను ఎదుర్కొన్న మమత, ఇప్పుడు 72 యేళ్ల వయసులో తాను ప్రయాణం మొదలుపెట్టిన చోటికే తిరిగి వెళ్తున్నట్లు కనిపిస్తోంది. 1976లో జైప్రకాష్ నారాయణ్ ప్రయాణిస్తున్న కారు ముందు దూకి తొలిసారిగా వెలుగులోకి వచ్చిన దీదీ, 1984లో సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు సోమనాథ్ ఛటర్జీని ఓడించి సంచలనం సృష్టించి మరోసారి వార్తల్లో నిలిచారు. సోనియాతో మమత భేటీ: ఇండియా బ్లాక్ సమావేశానికి హాజరైన అనంతరం, మమతా బెనర్జీ రాహుల్ గాంధీ సమక్షంలో సోనియా గాంధీ నివాసంలో ఆమెను కలిశారు. కాంగ్రెస్ అధినేత్రితో ఆమె విడిగా చర్చలు జరిపిన సరిగ్గా అదే సమయంలో, అరెస్ట్ వారెంట్‌తో సిఐడి ఆమె కోల్‌కతా నివాసానికి చేరుకోవడంతో ఈ పుకార్లు జోరుగా వ్యాపించాయి. బుధవారం మమత మేనల్లుడు, టిఎంసి ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో సమావేశం అయ్యారు. దీంతో ఈ వార్తలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఇరుపక్షాలు విలీనం గురించి ఎలాంటి సూచనలు ఇవ్వనప్పటికీ, ఇటు ఢిల్లీలో అటు బెంగాల్‌లో రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. మమతకు షాక్‌ల మీద షాక్‌లు: 294 స్థానాలున్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రమే ఉన్నారు. అయితే, మమతా బెనర్జీకి చెందిన 80 మంది ఎమ్మెల్యేలలో సుమారు 62 మంది పార్టీని వీడారు, ఈ సంఖ్య ఇంకా పెరుగుతోంది. లోక్‌సభలో టిఎంసికి 29 మంది సభ్యులు ఉన్నారు. అయితే, వారిలో 20 మంది పార్టీ మారడానికి ఒక వర్గంగా ఏర్పడ్డారు. రాజ్యసభలో పార్టీకి 13 మంది సభ్యులు ఉన్నారు, వారిలో సుఖేందు శేఖర్ రాయ్, సుష్మితా దేవ్ రాజీనామా చేశారు, మరికొందరు సరైన సమయం కోసం వేచి చూస్తున్నారు. అయితే, అధీర్ రంజన్ చౌదరి వంటి సొంత రాష్ట్ర నాయకుల నుండి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి ఉంటుంది. గత లోక్‌సభ ఎన్నికల్లో చౌదరిపై క్రికెటర్ యూసుఫ్ పఠాన్‌ను పోటీకి దింపడం ద్వారా మమతా బెనర్జీ ఆయన రాజకీయ జీవితాన్ని ముగించారని ఆరోపణలు ఉన్నాయి.

# కుప్పకూలిన పాక్ సైనిక హెలికాప్టర్: 21 మందిమృతి

**ముజఫరాబాద్,జూన్ 10:** పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ17 హెలికాప్టర్ ముజఫరాబాద్ సమీపంలో టేకాఫ్ అవుతున్న సమయంలో కూలిపోయింది. సాంకేతిక లోపం కారణంగా కూలిపోయింది. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది అందరూ అమరులయ్యారని పాకిస్థాన్ మీడియా తెలిపింది. ఈ ఘటనలో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్‌ను ఉటంకిస్తూ పాకిస్థాన్ డాన్ పత్రిక వెల్లడించింది. హెలికాప్టర్‌లో 21 మంది సైనికులు ఉన్నట్లుగా తెలుస్తోంది. అందరూ చనిపోయినట్లుగా సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనాస్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టాయి. అయితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఎవరూ ప్రాణాలతో బయటపడలేదని అధికారులు వెల్లడించారు. హెలికాప్టర్‌లో ఉన్న సైనిక సిబ్బంది దేశ సేవలో అమరులయ్యారని పాకిస్థాన్ సైన్యం పేర్కొంది. ఈ ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలను తెలుసుకునేందుకు పాకిస్థాన్ ఆర్మీ దర్యాప్తు ప్రారంభించింది. సాంకేతిక లోపమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నప్పటికీ పూర్తి వివరాలు విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. ముజఫరాబాద్ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన పాకిస్థాన్ సైనిక వర్గాల్లో విషాదాన్ని నింపింది. ఈ ఆధునిక విమానం ఎంఐ17, ఐసిఎం8 కొత్త వెర్షన్ మిల్ మాస్కో హెలికాప్టర్ ప్లాంట్ ద్వారా నిర్మించారు. రష్యాలో తయారైన అత్యధిక బరువు మోసే రవాణా హెలికాప్టర్ ఇది.

# ప్రధాని మోడీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ శుభాకాంక్షలు



**రోమ్,జూన్ 10:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ బుధవారం ప్రత్యేక అభినందనలు తెలిపారు. భారత చరిత్రలో అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానిగా మోడీ నిలవడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఇరు దేశాల ప్రజలకు కొత్త అవకాశాలు సృష్టించేందుకు మోడీతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆమె తన సోషల్‌మీడియాలో పోస్టుచేసారు. బుధవారం నాటికి ప్రధానిగా 4,399 రోజులు పూర్తి చేసుకున్న మోడీ, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డును అధిగమించారు. భారత చరిత్రలో అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా నిలిచిన నరేంద్ర మోడీకి అభినందనలు. ఇటీవల రోమ్‌లో మరోసారి మిమ్మల్ని కలవడం సంతోషాన్నిచ్చింది. మన దేశాలు, మన ప్రజల కోసం భవిష్యత్తులో కొత్త అవకాశాలు సృష్టించేలా ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది అని మెలోనీ తన పోస్టులో పేర్కొన్నారు. గత నెల మేలో ప్రధాని మోడీ ఇటలీలో రెండు రోజుల పాటు పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో ఆయన ఇటలీ ప్రధాని మెలోనీ, అధ్యక్షుడు సెర్గియో మట్టరెల్లాలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి పెంచాలని నిర్ణయించారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత, సైన్స్ అండ్ టెక్నాలజీ, అంతరిక్షం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, విద్య, సాంస్కృతిక రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని నేతలిద్దరూ అంగీకరించారు.

# సంక్షిప్తంగా..

## బహ్రెయిన్‌లోని అమెరికా స్థావరాలపై ఐఆర్జీసి దాడులు!

**టెహ్రాన్,జూన్ 10:** ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ అమెరికా నేవీ 5వ ఫ్లీట్ ప్రధాన కార్యాలయంపై మిస్సైల్, డ్రోన్ దాడులు చేసినట్లు ప్రకటించింది. ఇది యూఎస్ దాడులకు ప్రతీకారంగా జరిగినట్లుఐఆర్జీసీ తెలిపింది. యూఎస్ దళాలు ఖేష్మ్ ద్వీపం సమీపంలో ఇరాన్ టెలికమ్యూనికేషన్స్ టవర్‌పై, స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ సమీపంలో ఇరాన్ ఆయిల్ ట్యాంకర్‌పై దాడి చేశాయని ఐఆర్జీసీ చెప్పింది. ఇందుకు ప్రతిగా బహ్రెయిన్‌లోని 5వ ఫ్లీట్ హెడ్‌క్వార్టర్స్, ప్రాంతీయ ఎయిర్‌బేస్‌లు, హెలికాప్టర్ బేస్‌లపై దాడులు జరిపినట్లు ప్రకటించింది. బహ్రెయిన్‌లో ఎయిర్ రైడ్ సైరన్లు మోగాయని, గల్ఫ్ దేశాల్లో ఉద్రిక్తత పెరిగిందని నివేదికలు వచ్చాయి. యూఎస్ సెంట్రల్ కమాండ్ ఈ క్లెయిమ్‌లను తప్పు అని తోసిపుచ్చింది.

## ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలి ఇద్దరు సైనికులు మృతి



**శ్రీనగర్,జూన్ 10:** ప్రమాదవశాత్తు గ్రెనేడ్ పేలిన ఘటనలో ఇద్దరు భారత జవాన్లు దుర్మరణం పాలయ్యారు. జమ్మూ కశ్మీర్‌లోని బారాముల్లా జిల్లా ఉరి సెక్టార్లోగల కమాల్‌కోట్ సైనిక శిబిరంలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. శిబిరంలోని సైనికులు ఆయుధ పరికరాలను ఒకరి నుంచి మరొకరికి అప్పగిస్తున్న సమయంలో గ్రెనేడ్ అకస్మాత్తుగా పేలింది.

ఈ పేలుడు ధాటికి ఇద్దరు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను వెంటనే సైన్యానికి చెందిన 92 బేస్ ఆసుపత్రికి తరలించినప్పటికీ, వారు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

## జోహాన్స్‌బర్గ్‌లో కాల్పులు, 12 మంది మృతి

**జోహాన్స్‌బర్గ్, జూన్ 10:** దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్‌బర్గ్‌లో కాల్పులు కలకలం సృష్టించాయి. ఈ ఘటనలో 12 మంది మరణించారు. ఈ ఘటన తూర్పు జోహన్నెస్‌బర్గ్‌లోని, క్లీవ్‌ల్యాండ్‌లో ఉన్న జంపర్స్ ఇన్‌ఫార్మల్ సెటిల్‌మెంట్‌లో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సెటిల్‌మెంట్ ఏరియాలోకి పది మంది వరకు దుండగులు టొయోటా వాహనంలో వచ్చారు. ఆయుధాలు కలిగిన ఈ దుండగులు అక్కడ ఉన్న వారిపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపారు. ఈ సెటిల్‌మెంట్ పరిధిలోని రెండు యాక్సెస్ పాయింట్లను ఎంచుకుని,

అక్కడి నుంచి కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పో యారు. మరో 9 మంది గాయపడ్డారు. కాల్పుల అనంతరం దుండగులు అక్కడినుంచి పారిపోయారు.

## దర్గా ఉన్నంత మాత్రాన వక్ఫ్ ఆస్తిగా పరిగణించలేం: మద్రాస్ హైకోర్టు

**చెన్నై, జూన్ 10:** కేవలం దర్గా లేదా సమాధి ఉండటం వల్ల ఆ భూమి వక్ఫ్ ఆస్తిగా పరిగణించలేమని మద్రాస్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వక్ఫ్ హోదా పొందాలంటే ముస్లిం వ్యక్తి ఆస్తిని శాశ్వతంగా మత, ధార్మిక లేదా దాతృత్వ కార్యక్రమాల కోసం అంకితం చేసినట్లు చట్టబద్ధమైన ఆధారాలు ఉండాలని స్పష్టం చేసింది. చెన్నైలోని ట్రిప్లికేన్ ప్రాంతంలో ఉన్న 240 ఏళ్ల చరిత్ర కలిగిన సర్కార్ సయ్యద్ హబీబుల్లా షా ఖాదరీ ఆరిఫ్ రబ్బానీ హజ్రత్ దర్గాకు కొత్త ముతవల్లీని నియమిస్తూ వక్ఫ్ బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని జస్టిస్ కె.జి. తిలకవాడి రద్దు చేశారు. దర్గాకు ముత వల్లీగా వ్యవహరిస్తున్నానని వ్యక్తి కోర్టును ఆశ్రయించారు.

# ఉత్తర ఐర్లాండ్‌లో భారీ విధ్వంసం - చెలరేగిన ముసుగువీరులు



**బెల్‌ఫాస్ట్,జూన్ 10:** ఉత్తర ఐర్లాండ్ రాజధాని బెల్‌ఫాస్ట్‌లో హింసతో అట్టుడికింది. ముసుగులు ధరించిన ఆందోళనకారులు చెలరేగిపోయారు కార్లు, నివాసాలను టార్గెట్‌గా చేసుకుని తగలబెట్టారు. దీంతో పెద్ద ఎత్తున వాహనాలు దగ్ధం కావడంతో మంటలు ఎగిసిపడ్డాయి. వలసదారులను లక్ష్యంగా చేసుకుని ఈ అల్లర్లు చెలరేగాయి. భారీ సంఖ్యలో నిరసనకారులు రోడ్లపైకి వచ్చి బీభత్సం సృష్టించారు. కత్తిపోటు ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బెల్‌ఫాస్ట్‌లో ఉద్రిక్తతలు పెరిగాయి. ఈ ఘటనలకు సూడాన్ దేశస్థుడే కారణంగా తెలుస్తోంది. కత్తితో వీరంగం సృష్టించాడు. ఒక వ్యక్తిని కత్తితో పొడవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఈసంఘటన సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున వైరల్ అయ్యింది. దీంతో ముసుగు ధరించిన వ్యక్తులు రోడ్లపైకి వచ్చి వీరంగం సృష్టించారు. కార్లు, ఇళ్లు తగలబెట్టారు. ఇక కత్తిపోటు కేసులో సూడాన్‌కు చెందిన 30 ఏళ్ల హాది అలోడిడ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హత్యాయత్నం కేసులో అతడిని కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్‌కు తరలించింది. ఈ దాడిలో బాధితుడు ఒక కన్ను కోల్పోయినట్లు, ముఖం, వెన్నుపైన తీవ్ర గాయాలు అయినట్లు కోర్టులో వెల్లడైంది. సోషల్ మీడియా వేదికగా హింసాత్మక నిరసనలకు పిలుపు ఇవ్వడంతో పరిస్థితి అదుపు తప్పింది. ఆగ్రహంతో వీధుల్లోకి వచ్చిన గుంపులు పలు ప్రాంతాల్లో పోలీసులపై రాళ్లు రువ్వి, వాహనాలు, బస్సులకు నిప్పంటించారు. కొన్ని కుటుంబాలు తమ ఇళ్లలో చిక్కుకుపోగా, పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుని వారిని సురక్షితంగా బయటకు తరలించారు. అనేక కార్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానిక రాజకీయ నాయకులు, మతపెద్దల ప్రకారం దాడులకు గురైన వారిలో ఎక్కువ మంది నల్లజాతీయులు, వలసదారులే ఉన్నట్లు తెలుస్తోంది. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ కూడా స్పందిస్తూ. ప్రజలను వారి జాతి, నేపథ్యం కారణంగా లక్ష్యంగా చేసుకోవడం అస్సలు సహించం. బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రిటన్‌లో వలస దారుల అంశంపై వివాదాలు పెరుగు తున్నాయి. ఆశ్రయం విధానాల కారణంగా ప్రమాదకర వ్యక్తులు దేశంలోకి ప్రవేశిస్తున్నారంటూ కొన్ని పార్టీలు ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి.

# బెంగాల్‌లో మంత్రులకు పోర్టుఫోలియోలు కేటాయింపు!


**కోల్‌కత్తా,జూన్ 10:** పశ్చిమబెంగాల్‌లో మంత్రులకు శాఖలు కేటాయించారు. సీఎం సువేందు అధికారి హోంశాఖను తన వద్దే ఉంచుకున్నారు. గతంలో ఇళ్లల్లో పనిచేస్తూ జీవనం గడిపి, ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మంత్రి పదవి దక్కించుకున్న కలితా మాఝికి గృహనిర్మాణ శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు అప్పగించారు. బెంగాల్ ఎన్నికల్లో తూర్పు వర్ధమాన్ జిల్లా ఔస్‌గ్రామ్ నియోజకవర్గం నుంచి కలితా టీఎంసీ అభ్యర్థిపై 12,535 ఓట్ల తేడాతో విజయం సాధించారు. మరోవైపు జర్నలిస్ట్ నుంచి రాజకీయ నాయకుడిగా మారిన స్వపన్ దాస్‌గుప్తాకు ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు కట్టబెట్టారు. ఇక మిగతావాళ్లలో తపస్ రాయ్‌కి పరిశ్రమలు, వాణిజ్య శాఖలు అప్పగించారు. దిలీప్ ఘోష్‌కు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలను కట్టబెట్టారు. ఇక సీనియర్ నాయకురాలు అగ్నిమిత్ర పాల్‌కు పట్టణాభివృద్ధి, పురపాలక వ్యవహారాల శాఖల బాధ్యతలు అప్పజెప్పారు. డాక్టర్ శరద్వత్ ముఖర్జీకి ఆరోగ్య శాఖ కేటాయించారు. జగన్నాథ్ ఛటోపాధ్యాయకు ఉన్నత విద్యాశాఖ. దూద్ కుమార్ మండల్‌కు వ్యవసాయ శాఖ బాధ్యతలు అప్పగించారు. దీపక్ బర్మన్‌కు పాఠశాల విద్యాశాఖ బాధ్యతలు కట్టబెట్టారు. శంకర్ ఘోష్‌కు పర్యాటక, పార్లమెంటరీ వ్యవహారాల శాఖలు అప్పగించారు. అర్జున్ సింగ్‌కు కార్మిక శాఖ, రవాణా శాఖలను కట్టబెట్టారు. ఇంద్రనీల్ ఖాన్‌కు క్రీడలు, యువజన, వినియోగదారుల వ్యవహారాల శాఖలను కేటాయించారు.

# అఫ్ఘాన్‌పై పాక్ బాంబుల వర్షం - నిద్రలోనే 11 మంది చిన్నారులు మృతి



**ఇస్లామాబాద్, జూన్ 10:** అఫ్ఘానిస్థాన్-పాకిస్థాన్ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు తలెత్తాయి. అర్ధరాత్రి వేళ.. అఫ్ఘాన్ సరిహద్దుల్లోని నివాస ప్రాంతాలపై పాక్ బాంబులతో విరుచుకుపడింది. ఈ ఘటనలో 11 మంది చిన్నారులు నిద్రలోనే కన్నుమూశారు. మంగళవారం అర్ధరాత్రి దాటాక ఖోస్ట్, కునార్, పక్తికా ప్రావిన్స్‌లలోని పౌర నివాసాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు అఫ్ఘాన్ ప్రభుత్వ ప్రతినిధి జబిహుల్లా ముజాహిద్ పేర్కొన్నారు. సెర్పా జిల్లాలోని ఓ ఇంటిపై జరిగిన దాడిలోనే 9 మంది చనిపోయారని, మరో 10 మంది గాయపడ్డారని ఖోస్ట్ ప్రావిన్స్‌కు చెందిన అధికారి తెలిపారు. పక్తికా ప్రావిన్స్‌లోని బర్మల్ జిల్లాలో జరిగిన మరో దాడిలో ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా చిన్నారులేనని స్థానికులు తెలిపారు. బాధితులు నిద్రిస్తున్న సమయంలో ఈ దాడులు జరగడంతో.. వారు తప్పించుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ దాడి ఘటనలో మొత్తం 11 మంది చిన్నారులతో సహా ఓ మహిళ, ఓ వృద్ధుడు ప్రాణాలు కోల్పోయారు. మరో 14 మంది గాయపడగా.. వారిలో అనేకమంది మహిళలు, చిన్నారులలో ఉన్నారు. మృతి చెందిన చిన్నారుల ఫొటోలను జబిహుల్లా ఎక్స్‌లో పంచుకున్నారు. కాగా.. ఈ దాడుల విషయంపై పాక్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. అఫ్ఘాన్ సరిహద్దులోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని ఓ సెక్యూరిటీ పోస్టుపై ఇటీవల దాడి జరిగింది. తాలిబన్ మిలిటెంట్లు ఈ దాడి చేసినట్లు పాక్ అధికారులు అనుమానిస్తున్నారు. ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.

# కెనడాలో భారత సంతతి పోలీస్ అధికారి మృతి



**ఒంటారియో,జూన్ 10:** కెనడాలో భారత సంతతికి చెందిన ఒక పోలీస్ అధికారి విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారు. ఒంటారియో ప్రావిన్షియల్ పోలీస్ విభాగంలో పనిచేస్తున్న కానిస్టేబుల్ తరుణ్ బాలి, మంగళవారం ఒక దర్యాప్తు సందర్భంగా తీవ్రంగా గాయపడి మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒంటారియోలోని హియర్స్ సమీపంలో ముందురోజు మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. కెండల్ కన్సెషన్ రోడ్ 7, కన్సెషన్ రోడ్ 6 వద్ద అధికారులు ఒక కేసు దర్యాప్తు చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఈ క్రమంలో తీవ్రంగా గాయపడిన తరుణ్ బాలిని ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. రెండున్నరేళ్ల సర్వీసు ఉన్న తరుణ్ బాలి, డఫెరిన్ డిటాచ్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

# ఉద్యాన ఆధారిత స్టార్టప్‌లకు ఎంతో భవిష్యత్తు

## ప్రత్యామ్నాయ పంట యాజమాన్య పద్ధతులపై ప్రత్యేక బులిటెన్ విడుదల

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** ఆధునిక సాంకేతిక సలహాలు, సూచనలు ఉద్యాన రైతులకు సకాలంలో అందించడంలో తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం ముందుందని తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ బాలకిస్టా రెడ్డి అన్నారు. 2026 లో ఎల్‌నినో నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో 2026-27 సంవత్సరానికి గాను ఉద్యాన పంటల్లో ప్రత్యామ్నాయ పంట యాజమాన్య పద్ధతులపై 48 పేజీల ప్రత్యేక బులిటెన్ విడుదల చేసింది కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వ విద్యాలయం. ఈ బులిటెన్ విడుదల చేసిన అనంతరం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ డాక్టర్ బాలకిస్టా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నైపుణ్యం, ఎంప్లాయిబిలిటీ పెరిగేందుకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఉద్యాన ఆధారిత అంకుర పరిశ్రమలకు చాలా భవిష్యత్తు ఉందని, దేశంలో ఇప్పటికీ 1,50,000 స్టార్టప్స్ ఉన్నాయని, భారతదేశం మూడో స్థానంలో ఉందని తెలిపారు. విద్యార్థులలో గ్లోబల్ కాంపిటీటివ్నెస్ పెరిగేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు ఋతు పవనాలు కీలకమని, సరైన సమయంలో, సమ పాళ్లలో, సరైన మోతాదులో వర్షాలు ఉంటేనే ఖరీఫ్‌లో దిగుబడులు బాగుంటాయని కొండ లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజిరెడ్డి అన్నారు.పంటల సాగులో ఋతుపవనాలు ఆలస్యం కావడం, వర్షాలకు మధ్య చాలా వ్యవధి ఉండటం నష్టం కలిగిస్తుందని చెప్పారు. 2026 లో ఎల్‌నినో ఉండనుందని, భారత వాతావరణ కేంద్రం ఇప్పటికే అంచనా వేసిందని, లాంగ్ పీరియడ్ యావరేజ్ ప్రకారం సాధారణ వర్షపాతంలో ఈ సంవత్సరం దేశంలో 90శాతం ఉంటుంది అన్నారు.అయితే తెలంగాణ రాష్ట్రంలో సమపాళ్లలో వర్షపాతం ఉండే అవకాశాలు కనిపించడం లేదని డాక్టర్ రాజిరెడ్డి అన్నారు. మధ్య తెలంగాణ జిల్లాల్లో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువగా, అలాగే దక్షి ణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో సాధారణం కంటే తక్కువగా వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎల్‌నినో ప్రభావం పంటలపై తగ్గించేందుకు రైతులు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విడుదల చేసిన బులిటెన్‌లో కూరగాయలు, పండ్ల తోటలు, పూల పంటలతో పాటు ఔషధ, సుగంధ ద్రవ్య పంటలు అలాగే ప్లాంటేషన్ పంటలపై ప్రత్యామ్నాయ ప్రణాళికలు, యాజమాన్య పద్ధతులు పొందుపర్చినట్టు వైస్ ఛాన్సలర్ తెలిపారు.

# దేశాన్ని మోసం చేసి ప్రధానిగా రికార్డు సాధించిన మోడీ

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆరోపణ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** దేశాన్ని మోసం చేసి ప్రధానమంత్రిగా రికార్డు సాధించిన మోడీ పాలనకు అభినందనలు, ఆయన పాలనలో దేశం రికార్డు స్థాయి అప్పులు, రికార్డుస్థాయి అవినీతి, రికార్డు స్థాయి ఇంధన ధరలు, రికార్డు స్థాయి నిరుద్యోగం, రికార్డు స్థాయి ప్రశ్నా పత్రాల లీకులు, రికార్డు స్థాయిలో రూపాయి విలువ పతనంతో దేశప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ట్వీట్ (ఎక్స్) వేదికగా ఆరోపించారు. ఎవ్వరినైనా కొంతకాలం మోసం చేయ వచ్చుని ఎల్లకాలం మోసం చేయలేమని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. 12 సంవత్స రాలుగా యావత్ దేశాన్నే మోసం చేయడంలో మోడీ విజయం సాధించారని, రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి మోడీ ప్రభుత్వం రాష్ట్ర ఆకాంక్షలను, అభివృద్ధిని నిరంతరం నిర్లక్ష్యం చేస్తూ వచ్చిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన ఒక్క ప్రధాన హామీ కూడా పూర్తిగా అమలు కాలేదని ఆయన దుయ్యబట్టారు. బయ్యారం ఉక్కు కర్మాగారం నుంచి తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుకు సహకారం నిరాకరించడం వరకు, వరి కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్య వైఖరి నుంచి ఇటీవల మూసీ పునరుజ్జీవనానికి సహకరించకపోవడం వరకు తెలంగాణకు దక్కింది నిర్లక్ష్యం, వివక్ష, నెరవేరని హామీలేనని మంత్రి పొంగులేటి ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధిని కోరుకుంటే బిజెపి మాత్రం విభజన రాజకీయాలను ఎంచుకుందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం హిందువులు, ముస్లింల మధ్య విద్వేషాలను బిజెపి రెచ్చగొట్టే ప్రయత్నాలు పదేపదే చేస్తోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మోసం, నిరక్ష్యం, వివక్షల కాలం ముగింపు దశకు చేరుకుందని, రాహుల్ గాంధీ నాయకత్వంలో న్యాయం, అభివృద్ధి, సహకార సమాఖ్య స్ఫూర్తిపై ఆధారపడిన కొత్త విజన్ భారతదేశం కోసం ఆవిష్కృతమవుతోందని, తెలంగాణ ఎప్పటికీ మర్చిపోదని, బిజెపిని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఆయన తెలిపారు.

# జూనియర్ కళాశాలల్లో తక్షణమే అతిథి అధ్యాపకులను నియమించాలి

## రాష్ట్ర ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్ల అసోసియేషన్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గెస్ట్ అధ్యాపకులను వెంటనే నియమించాలని తెలంగాణ ఇంటర్మీడియట్ గవర్నమెంట్ లెక్చరర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని కోరింది.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు జూన్ 1వ తేదీ నుండి పునఃప్రారంభమైనప్పటికీ, అనేక కళాశాలల్లో ఇప్పటికీ అధ్యాపకుల కొరత కొనసాగుతుండడం వల్ల విద్యా బోధన కార్యక్రమాలు సక్రమంగా సాగడం లేదు. అదేవిధంగా దీని ప్రభావం విద్యార్థుల అడ్మిషన్లపై కూడా పడుతుంది. కళాశాలలు పునఃప్రారంభమయ్యే నాటికే గెస్ట్ అధ్యాపకులను నియమిస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసింది. విద్యార్థుల పురోగతి కోసం మధ్యాహ్న భోజనం, యూనిఫాం వంటి ఎన్నో పథకాలను ప్రకటించిన ప్రభుత్వం ముఖ్యమైన బోధనకు సంబంధించి గెస్ట్ అధ్యాపకులను నియమించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఈ నేపథ్యంలో, విద్యార్థుల విద్యా ప్రమాణాలు దెబ్బతినకుండా ఉండేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత యేడాది పనిచేసిన 892 మంది గెస్ట్ అధ్యాపకులను ఈ సంవత్సరం జూన్ 1 వ తేదీ నుండి కొనసాగించాలని, అదేవిధంగా ఈ మధ్య జరిగిన ప్రిన్సిపల్ పదోన్నతుల కారణంగా ఏర్పడిన 100కుపైగా అధ్యాపక ఖాళీలను తక్షణమే గెస్ట్ అధ్యాపకులతో నియమించాలని టిగ్లా అధ్యక్ష మైలారం జంగయ్య, ప్రధాన కార్యదర్శి నయీం పాష డిమాండ్ చేశారు.

# మహిళా ప్రగతితో తెలంగాణ ఆర్థిక ఉన్నతి

## మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క




**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** మహిళా ప్రగతే తెలంగాణ ఉన్నతి అనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారని మహిళా శిశు సంక్షేమం పంచాయరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గాంధీభవన్‌లో బుధవారం మంత్రి సీతక్క, బొజ్జ సంధ్యారెడ్డి నిర్వ హిస్తున్న మదర్ ఎడ్యుకేషన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడువేల మంది మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ సర్టిఫికెట్ల అందజేత కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ 15 యేళ్ల నుంచి 60 యేళ్లు దాటిన వారు కూడా మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరవచ్చని శిక్షణ పూర్తయిన వారికి కుట్టుమిషన్లు అందిస్తామని తెలిపారు. దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల వరకు రుణం అందిస్తామన్నారు. మరిన్ని మిషన్లు కొనుగోలు చేసి వ్యాపారాన్ని విస్తరించుకో వాలనుకుంటే అదనపు రుణాలతోపాటు శిక్షణ కూడా అందిస్తామని అన్నారు. ఆర్టీసిలో కూడా అద్దెబస్సులను పేదలు సంఘటితమై ఏర్పాటు చేసుకొన్న మహిళా సంఘాల నుంచి తీసుకొంటున్నామని మంగళ వారం 553 బస్సులను మహిళా సంఘాలకు అందజేసే కార్య క్రమాన్ని నిర్వహించామని వివరించారు. ఇప్పటికే మహిళా సంఘాల చేత నిర్వహించే బస్సుల ద్వారా నెలకు సగటున రూ.70 వేల వరకు ఆదాయం పొందుతున్నారనీ తెలిపారు. పంటల సీజన్‌లో మహిళా సంఘాల ద్వారా కొనుగోలు కార్య క్రమాలు చేపడుతున్నామనీ చెప్పారు. కుట్టుమిషన్లను ఎలా అందించాలనే అంశంపై ముఖ్యమంత్రితో చర్చించాం.'గుర్రాన్ని నీళ్ల దగ్గరకు తీసుకెళ్లగలం, కానీ నీళ్లు తాగించ లేం. అవకాశాలను మాత్రం కల్పించగలం. వ్యాపారం ఏర్పాటు చేసుకుని మహిళలు ఎదగాలి' అని మంత్రి చెప్పారు. మహిళా సంఘాలకు ఇప్పటివరకు రూ.61 వేల కోట్ల రుణాలు అందించామనీ, ఇప్పటి వరకు 6 లక్షల మంది మహిళలు రుణాలు పొందారని చెప్పారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను విస్తరిం చామని మహిళలు వాటిపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. మహిళలకు ఏదైనా మేలు చేస్తే కొందరు విమర్శిస్తున్నారనీ ఆవేదన చెందారు. భూదేవికి ఉన్న ఓర్పు, రాకెట్‌కు ఉన్న వేగం మహిళలకు ఉన్నదని మంత్రి సీతక్క కితాబు ఇచ్చారు.

# ఆర్‌అండ్‌బి ఇఎన్‌సికి రిమాండు

## చంచల్‌గూడ జైలుకు తరలింపు

**హైదరాబాద్ జూన్ 10, ప్రభాతవార్త:** ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన కేసులో ఎసిబికి పట్టుబడిన రోడ్లు భవనాల శాఖ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఈఎన్‌సి) మోహన్‌కు నాంపల్లి ఎసిబి కోర్టు బుధవారం రెండువారాల రిమాండు విధించింది. మంగళవారం మోహన్‌నాయక్‌ను ఎసిబి అధికా రులు అరెస్టు చేయడం తెలిసిందే. ఆయన ఇంటితోపాటు నిజామాబాద్ సహా 15 చోట్ల రాత్రి బాగా పొద్దుపోయే వరకు ఎసిబి అధికారులు సోదాలు చేబట్టి రూ.17.94 కోట్ల రూపాయల అక్రమాస్తులను కనుగొన్నారు. వీటిని జప్తు చేశారు. బహిరంగ మార్కెట్లో వీటి విలువ 200 కోట్ల రూపాయలు వుం టుందని అధికారులు చెబుతున్నారు. కాగా బుధవారం ఉదయం ఎసిబి అధికా రులు ఎసిబి కోర్టుల న్యాయమూ ర్తి ఇంటి వద్ద మోహన్ నాయక్‌ను హాజరుపరచగా ఈ కేసును విచారించిన మెజిస్ట్రేట్ నిందితుడికి రెండు వారాల రిమాండు విధించారు. అనంతరం ఆయనను ఎసిబి అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఇదిలావుండగా అక్రమాస్తుల కేసులో అరెస్టయిన అర్‌అండ్‌బి ఈఎన్‌సి మోహా న్ నాయక్‌ను మరింతగా విచారించేందుకు వారం రోజులపాటు కస్టడీకి ఇవ్వా లని ఎసిబి అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు నిర్ణయించా రు. ఒకటి రెండు రోజుల్లో ఈ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది.

# ముఖ్యమంత్రిపై రౌడీ అంటూ ముద్ర వేయడం తగదు

## కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలి: ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్ జూన్10,ప్రభాతవార్త:** రాష్ట్ర సమస్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రౌడీ అని ముఖ్యమంత్రిపై ముద్రవేయడం తగదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మతిభ్రమించి నట్లుగా మాట్లాడుతున్నాడనీ విమర్శించారు. రాష్ట్ర సమస్యలపైన కేంద్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రశ్నిస్తుంటే కిషన్ రెడ్డి వాటికి సమాధానం ఇవ్వకుండా సభ్యత మరిచి మాట్లాడుతన్నారని ప్రజలు కూడా ఆయన భాషకు సిగ్గుపడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు నిధుల గురించి కేంద్రాన్ని, మోదీని నిలదీస్తే రౌడీ అవుతారా..? తెలంగాణ నుంచి 8 మంది బిజెపి ఎంపిలను గెలిపిస్తే కేంద్రం నుంచి ఏం తెచ్చారో ముందు కిషన్ రెడ్డి చెప్పాలనీ ఆయన సవాల్ చేశారు. మా సిఎం అడిగిన ప్రశ్నలకు కిషన్ రెడ్డి సమాధానం చెప్పలేక మోహం చాటేశాడని ఎద్దేవా చేశారు. కేంద్రం సహకరించపోయినా, నిధులు ఇవ్వకపోయినా మా సిఎం ప్రజా పాలన చేస్తుంటే ఓర్వలేక కిషన్ రెడ్డి పిచ్చి మాటలు మాట్లాడుతున్నాడని విమర్శిచారు. తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా గురించి మా సిఎం మాట్లాడుతున్నారని గుర్తుచేశారు. తెలంగాణ రైతులు పండించిన ధాన్యాన్ని కొనలేని స్థితిలో కేంద్రం ఉందనీ అన్నారు. కేంద్ర నిధులపైన కిషన్ రెడ్డి కాకీ లెక్కలు చెపుతున్నాడనీ దుయ్యబట్టారు.. తెలంగాణ కు కేంద్రం ఎన్ని నిధులు ఇచ్చిందో బహిరంగ చర్చకు మేం సిద్ధం, మీరు సిద్ధమా అని సవాల్ చేశారు. బిడ్డా తెలంగాణ మీ జాగీరు కాదు, అడుగు కూడా పెట్టనివ్వం జాగ్రత్త అని హెచ్చరించారు. తెలంగాణలో ఎప్పటికి బిజెపి అధికారంలోకి రాదనీ జోస్యం చెప్పారు తెలంగాణలో అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారనీ ఎకసెక్కాలు చేశారు. కేంద్రాన్ని నిలదీసే దమ్ము ధైర్యం కిషన్ రెడ్డికి లేదనీ రాష్ట్రానికి రావాల్సిన నిధులను అడగలేని కిషన్ రెడ్డి ఒక దద్దమ్మ అని అన్నారు. రేవంత్‌పై దుర్భాషలాడుతున్న కిషన్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలనీ డిమాండ్ చేశారు. కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి దేవుడి పేరు చెప్పి బిజెపి ఓట్లు అడుక్కుంటుందనీ ఆరోపించారు...తెలంగాణ లో ఓట్లు అడిగే నైతిక హక్కు బీజేపీకి లేదన్నారు. కిషన్‌రెడ్డి నోరు అదుపులో పెట్టుకోకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయ్ జాగ్రత్త అని హెచ్చరించారు.

## ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ

# ఫీజురీయింబర్స్‌మెంట్ జిఒ నం.9ను తక్షణమే ఉపసంహరించుకోవాలి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.9లోని నూతన నిబంధనలు పూర్తిగా విద్యార్థి వ్యతిరేకమైనవని, వాటిని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రజనీకాంత్, టి.నాగరాజు లు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సంక్షేమం పేరుతో ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ విధానం వాస్తవానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, విద్యాసంస్థలపై అదనపు భారం మోపే చర్యగా మారిందని వారు విమర్శించారు.

విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఫీజు మొత్తాన్ని వారం రోజుల్లోగా కళాశాలలకు చెల్లించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుం టామని, రికవరీ చేస్తామని పేర్కొనడం అత్యంత నిరంకుశ చర్య అని పేర్కొన్నారు. బ్యాంకింగ్ సాంకేతిక సమస్యలు, సర్వర్ లోపాలు, సమాచార లోపం లేదా ఇతర అనివార్య కారణాలతో ఆలస్యం జరిగితే విద్యార్థులను బాధ్యులను చేయడం ప్రభుత్వ బాధ్యతారాహిత్యానికి నిదర్శన మన్నారు.ప్రస్తుతం అమలులో ఉన్న కుటుంబ వార్షిక ఆదాయ పరిమితి రూ.2.5 లక్షలను యథాతథంగా కొనసాగించడం వల్ల వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు పథకం పరిధి నుండి బయటపడే ప్రమాదం ఉందన్నారు. పెరిగిన ద్రవ్యోల్బణం, జీవన వ్యయాలను దృష్టిలో ఉంచుకుని ఈ పరిమితిని కనీసం రూ.5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం తన బాధ్యతను విద్యార్థులపైకి నెట్టివేసి, ఫీజుల చెల్లింపును విద్యార్థుల ద్వారానే జరపాలని నిర్ణయించడం వల్ల కళాశాలల్లో అనవసర సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు.

ఫీజులు చెల్లించలేదనే పేరుతో విద్యార్థులను పరీక్షలకు అనుమతించకపోవడం, వేధింపులకు గురిచేయడం ,సర్టిఫికెట్స్ ఇవ్వకుండా వేధింపులు చేయడం వంటి పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.దరఖాస్తు తేదీల ఆధారంగా విడతల వారీగా 75 రోజులలోపు నిధులు విడుదల చేస్తామనడం విద్యార్థుల సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తుందని, ఏడాది పొడవునా దరఖాస్తుల ప్రక్రియ కొనసాగించడం ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల విడుదలను మరింత ఆలస్యం చేసే అవకాశం ఉందని విమర్శించారు.

# ఈగల్ పోలీసులకు పట్టుబడిన అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్

## ఎండిఎంఎ జప్తు

**హైదరాబాద్ జూన్ 10, ప్రభాతవార్త:** ఈగల్ పోలీసుల దాడిలో అంతరాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ పట్టుబడ్డాడు. ఈ సందర్భంగా ఇతని వద్ద నుంచి 20 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్ పట్టుబడింది. దీనికి సంబంధించిన వివరాలను ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా బుధవారం మీడియాకు వెల్లడించారు. యుపిలోని ఫరీదాబాద్‌కు చెందిన మోహిత్ కుమార్ (32) ఇంటీరియర్ డిజై నర్‌గా పనిచేస్తున్నాడు. ఇతను ప్రస్తుతం పేట్‌బషీరాబాద్‌లో వుంటున్నాడు. 2018 నుంచి ఇతను గంజాయి సహా పలురకాల డ్రగ్స్ వాడడం, అమ్మడం చేస్తున్నాడు. 2023లో ఇతను విజయనగ రం జిల్లాలో గంజాయి తరిస్తూ దొరికి పోయాడు. ఈ కేసులో కొంతకాలం జైల్లో వున్న తరువాత మళ్లీ తన వృత్తిలో వుంటూనే సైడ్ బిజినెస్‌గా డ్రగ్స్ అమ్మకాలు చేస్తున్నాడు. 2024 లో బెంగళూరు నుంచి సింథటిక్ డ్రగ్ తరలిస్తుండగా పేట్‌బషీరాబాద్ పోలీసులకు పట్టుబడ్డాడు. ఈ కేసులో చర్లపల్లి జైల్లో రిమాండులో వుండగా నిగ్, రాహుల్ అనే వ్యక్తులతో పరిచయం కలిగింది. వీరిని అంకుష్ అనే మరో నేరగాడు పరిచ యం చేశాడు. దీని తరువాత ముగ్గురు కలిసి తెలంగాణలో ఎండిఎంఎ డ్రగ్‌ను భారీగా అమ్మాలని నిర్ణయించారు. దీని తరువాత రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లిన మోహిత్ కుమార్ నిగ్, రాహుల్ నుంచి 20 గ్రాముల ఎండిఎంఎను గ్రాముకు రెండు వేల రూపాయలు ఇచ్చే విధం గా కొన్నాడు. దీనికి సంబంధించి 20 వేల రూపాయలు అడ్వాన్సుగా ఇచ్చాడు. దీనిని హైదరాబాద్‌లో నాలుగు వేల రూపాయల నుంచి ఆరు వేల రూపాయలకు అమ్మాలని అతని వ్యూహం. కాగా మోహిత్ కుమార్ బెంగళూరు నుంచి బుధవారం ఉదయం బస్సులో హైదరాబాద్‌కు వ స్తుండగా పక్కా సమాచారం అందుకున్న ఈగల్ పోలీసులు ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ సిబ్బందితో కలిసి షాద్‌నగర్ వద్ద దాడిచేసి పట్టుకున్నా రు. నిందితుడి వద్ద 20 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్‌ను జప్తు చేశారు. మాదకద్రవ్యాల విషయంలో సర్కారు కఠినంగా వుందని, స్మగర్ల భరతం పడతామని ఆయన హెచ్చరించారు. డ్రగ్స్ సంబంధించి ఎటువంటి సమాచారం వున్నా 1908 లేదా 8712671111కు సమాచారం అందించా లని ఈగల్ డైరక్టర్ సందీప్ శాండిల్యా కోరారు.




అంతర్రాష్ట్ర డ్రగ్ స్మగ్లర్ నుంచి జప్తు చేసిన ఎండిఎంఎ

# 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల సెలక్షన్ లిస్టు

## విడుదల చేసిన మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అధ్యాపకుల కొరతను తీర్చడంతో పాటు వైద్య విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపర్చే దిశగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన నియామక ప్రక్రియలో మరో కీలక ముందడుగు పడింది. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో 30 స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లలోని 433 పోస్టుల భర్తీ ప్రక్రియను మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు పూర్తి చేసింది. ఈ మేరకు ఉద్యోగాలకు ఎంపికైన డాక్టర్ల లిస్టును బుధవారం బోర్డు విడుదల చేసింది.ప్రభుత్వ మెడికల్ కాలేజీలలోని 34 విభాగాలకు చెందిన మొత్తం 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి బోర్డు గతంలో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో అనస్తీషియా, గైనకాలజీ, పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్ విభాగాలకు చెందిన 174 పోస్టుల భర్తీ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. ఆ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవలే నియామక పత్రాలను అందజేశారు. తాజాగా మిగిలిన 30 డిపార్ట్‌మెంట్లలో 433 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలు, సెలక్షన్ లిస్టును ఎంహెచ్ఎస్ఆర్‌బీ విడుదల చేసింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతో పాటు, 4 స్పీచ్ పాథాలజిస్ట్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ జాబితాను కూడా బోర్డు విడుదల చేసింది. ఉద్యోగాలకు ఎంపికైన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, స్పీచ్ పాథాలజిస్టులకు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. త్వరలోనే వారికి నియామక పత్రాలను అందజేస్తామని మంత్రి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు, టీచింగ్ హాస్పిటల్స్, ఇతర ఆరోగ్య సంస్థల్లో మానవ వనరులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. గత రెండున్నర సంవత్సరాల కాలంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ పరిధిలో సుమారు 15 వేల పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. ఇందులో ఎంబీబీఎస్ వైద్యులు, స్పెషలిస్టు వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది తదితర విభాగాలకు చెందిన పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ హాస్పిటల్స్‌లో వైద్య సేవల నాణ్యత మరింత మెరుగుపడి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.

# మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలకు బిజెపి రాష్ట్ర చీఫ్ రాంచందర్‌రావు ఒప్పించాలి


## ఫడ్నవీస్‌కు సిఎం రేవంత్ రాసిన లేఖలు ఇవిగో : మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** తుమ్మిడి హెట్టి వద్ద బ్యారేజిని 152 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేయడానికి మహారాష్ట్ర సిఎంతో చర్చలకు బిజెపి అధ్యక్షుడు రాంచందర్ రావు ఒప్పించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు.తెలంగాణ ప్రయోజనాల విషయంలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు పదేపదే అబద్ధమాడుతున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ను తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరనే లేదని అసలు లెటర్ రాయనేలేదని మాట్లాడటం విడ్డూరంగా ఉందనీ ఆయన విమర్శించారు. లెటర్ రాయకపోతే మహారాష్ట్ర సిఎం ఆఫీసు ఖండించాలి కదా..? మహారాష్ట్ర సిఎం ఆఫీసు ఎందుకు స్పందించటం లేదు..? అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర బీజేపీ తెలంగాణ ప్రజలను ఉద్దేశపూర్వకంగా మోసం చేస్తోందనీ దుయ్యబట్టారు. తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మిస్తే మన రైతులకు సాగునీరు, ఆదిలాబాద్ జిల్లా నుంచి రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వరకు రైతులకు మేలు జరుగుతుందనీ తెలిపారు. అదేమీ తెలియనట్లు రామచంద్రారావు రేవంత్‌రెడ్డి పైనే అసత్య ఆరోపణలు చేస్తూ లేఖ రాయలేదని చెబుతున్నారనీ ఆరోపించారు. మా నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మే 6న మహారాష్ట్ర సిఎంకు లేఖ రాశారు. ఆ తర్వాత మా సిఎం రేవంత్‌రెడ్డి మే 26న మరోసారి లేఖ రాశారు. ఇ-మెయిల్ అందుకున్నట్లు మహారాష్ట్ర సిఎం ఆఫీసు అక్‌నాల్డెజ్మెంట్ కూడా మీకు పంపిస్తామనీ అన్నారు. ఈ లెటర్ల కాపీలు కూడా రామచంద్రారావుకు పంపిస్తాం అది చదువుకొని తప్పును ఒప్పుకోవాలనీ డిమాండ్ చేశారు. స్వయంగా ఆయన మహారాష్ట్రకు వెళ్లి అక్కడున్న వాళ్ల పార్టీ సిఎంను ఒప్పించినా మాకెలాంటి అభ్యంతరం లేదనీ ఆయన చెప్పారు.మమ్మల్ని ఆయన వెంటబెట్టుకొని వెళ్లినా వచ్చేందుకు మేం సిద్ధంగానే ఉన్నామనీ అన్నారు ఎలాగూ వాళ్ల మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు తెలంగాణ ప్రజల మీద ప్రేమ లేదనీ విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాల మీద వాళ్లకు పట్టింపు లేదు. కనీసం ఆ పార్టీ అధ్యక్షునిగా ఉన్న రామచంద్రారావుకు ఉంటే ఆయనైనా నిరూపించుకోవాలనీ సవాల్ చేశారు. మేం లేఖలు రాయలేదని చెప్పటమెందుకు మీరు కూడా మహారాష్ట్రకు వెళ్లటం చేతకాకపోతే మీరే లేఖ రాసి చర్చలకు ఒప్పించండనీ ఆయన కోరారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి కట్టించేందుకు సహకరిస్తేనే తెలంగాణ ప్రజలు మిమ్మల్ని ఆదరిస్తారని అన్నారు. మేం రాసిన లెటర్లు చూపిస్తున్నా కూడా, లెటర్ రాయలేదంటే మీరు తెలంగాణ ప్రజలను మోసం చేసినట్లే అని అన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజి కట్టకుండా అడ్డుపడుతున్న ద్రోహులుగా నిలిచిపోతారని హెచ్చరించారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఐటిని వినియోగించాలి

## తప్పలకు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలి

## ఈ ప్రక్రియలో సాంకేతిక వినియోగంపై ఎస్ఇసి సుదర్శన్‌రెడ్డి విడియో కాన్ఫరెన్స్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:**ఈనెల 25 నుండి ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో ఐటి విరివిగా వాడుకోని ఓటరు నమోదు ప్రక్రియలో పూర్తి పారదర్శకంగా ఎలాంటి తప్పులకు తావివకుండా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ అధికారి సి. సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఐటి వినియోగంపై జిల్లా, మండల స్థాయి మాస్టర్ ట్రైనర్స్, ఐటి సపోర్ట్ టీం, డేటా ఆపరేటర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ కార్యక్రమం లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియలో ఐటి అంశం అత్యంత కీల కమైనదని, దానిని సిబ్బంది విరివిగా వాడుకొని ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం, సమర్థవంతంగా చేపట్టేందుకు దోహద పడుతుందని, అంతేకాకుండా ఓ టరు జాబితా రూపొందించడంలో పారదర్శకత ఉం టుందని తెలిపారు. అలాగే ఓటర్లు ఆన్ లైన్ ద్వారా తమ పేరును ఎన్యుమరేషన్ చేసుకోవడానికి వెబ్ సైట్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భారత ఎన్నికల కమిషన్ ఐటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చే ఇసిఐనెట్, బిఎల్ఓ, ఏపిపి అందుబాటులోకి తెచ్చిందని, దీంతో ఎస్ఐఆర్ ప్రక్రియ మరింత సులభతరం చేసేందుకు ఇందులో వివిధ టూల్స్‌ను పొందుపరిచిందని, వీటిని ఉపయోగించడంపై మాస్టర్ ట్రైనర్లు, ఐటి సపోర్ట్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో డేటా ఆపరేటర్లకు పూర్తిస్థాయిలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. ఆన్ లైన్ ద్వారా ఓటర్లను ఎన్యుమరేషన్ చేసుకునేందకు సదుపాయం కల్పించినందున దీనిపై అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను సిఇఓ ఆదేశించారు. అనంతరం రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి (ఎప్‌టిఎన్‌ఓ) బి. చెన్నయ్య, ఎస్ఐఆర్ ప్రక్రియలోని వివిధ దశలను సవివరంగా వివరించారు. పీఎంఐటీ డి. చిరంజీవి, ఈసీఐనెట్, బీఎల్ఓ యాప్‌కు సంబంధించిన సాంకేతిక శిక్షణను అందించారు. ఇందులో ఎన్యూమరేషన్ ఫారమ్‌లను పూరించడం, ఓటర్ల మ్యాపింగ్, సేకరించలేని ఎన్యూమరేషన్ ఫారమ్‌ల వర్గీకరణ, అలాగే ఇతర అనుబంధ కార్యకలాపాల విధానాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రధాన ఎన్నికల అధికారి డా.వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ఉప ప్రధాన ఎన్నికల అధికారి ఎ.ఎస్. చారిలతో పాటు నోడల్ అధికారులు, సంబంధిత సిబ్బంది కూడా పాల్గొన్నారు

# కాళేశ్వరం కమీషన్‌ల కోసమే!

**తెలంగాణకు కెసిఆర్ తీరని ద్రోహం**

**సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధ్వజం**

**వైఎస్సార్ హయాంలోనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభం**

**బిఆర్ఎస్ హయాంలోనే ప్రాజెక్టు లీకేజీలపై నివేదికలు వచ్చాయ్**

**జూలై మొదటి వారంలోగా మేడిగడ్డ వద్ద పరీక్షలు పూర్తి**



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**మహదేవపూర్ (జయశంకర్ భూపాలపల్లి), ప్రభాతవార్త:** రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టిందని, చేవెళ్ల నుండి మేడిగడ్డకు ప్రాజెక్టును మార్పు చేసి తెలంగాణకు తీరని ద్రోహం చేసిందని రాష్ట్ర సాగునీటి శాఖ మంత్రి నలమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మహదేవపూర్ మండలం పరిధిలోని లక్ష్మీ (మేడిగడ్డ) బ్యారేజీని సందర్శించి, అక్కడ జరుగుతున్న పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంపై ఘాటు వ్యాఖ్యలు చేశారు.

**కాంగ్రెస్ హయాంలోనే 30 పనులు పూర్తి..**

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే రాష్ట్ర రైతాంగానికి సాగు, తాగునీరు అందించాలనే సంకల్పంతో తాము ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును చేపట్టామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఈ ప్రాజెక్టు పనులను 30 శాతం వరకు పూర్తి చేశామని స్పష్టం చేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కేసీఆర్ కూడా ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని, నిధులు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు.

**కమీషన్ల కోసమే కాళేశ్వరం రీడిజైన్..**

కేసీఆర్ అధికారంలోకి వచ్చాక, గత కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎక్కడ పేరు వస్తుందోననే ఈర్ష్యతో ప్రాజెక్టును రీడిజైన్ చేశారని మంత్రి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో ఇప్పటివరకు రూ. 1.45 లక్షల కోట్లు ఖర్చు చేశారని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం ప్రాజెక్టు నుండి ఒక్క చుక్క నీరు కూడా ఉపయోగంలోకి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే ఈ ప్రాజెక్టు లోపభూయిష్టంగా ఉందంటూ నివేదికలు వచ్చాయని, ఆ నిజాన్ని దాచిపెట్టే ప్రయత్నం చేశారని విమర్శించారు.

**వేగంగా పునరుద్ధరణ పనులు..**

మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన నేపథ్యంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) మరికొన్ని నిపుణుల సంస్థల చేత విచారణ జరిపించినట్లు మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఆఫ్రిన్ (ఏఎఫ్ఆర్‌వై) సంస్థ ఆధ్వర్యంలో ప్రీ డిజైన్ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. రాబోయే జూలై మొదటి వారంలోపు బ్యారేజ్ వద్ద అన్ని రకాల పరీక్షలను పూర్తి చేస్తామని వెల్లడించారు. కల్నల్ పరీక్షిత్ మెహతా ఆధ్వర్యంలో ఈ పరీక్షలు, బ్యారేజ్ పునరుద్ధరణ పనులు నిరంతరాయంగా కొనసాగుతాయని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు.



# సుస్థిర మైనింగ్‌లో సింగరేణి మరో మైలురాయి

**పర్యావరణ ప్రమాణాలకు కేంద్రం ప్రశంస**

**రూ.40 కోట్ల డిపాజిట్ తిరిగి చెల్లింపు**

**సింగరేణి సిఎండి బుద్ధప్రకాష్**

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** బొగ్గు గనుల నిర్వహణలో మాత్రమే కాకుండా, గనుల మూసివేత అనంతరం పర్యావరణ పరిరక్షణలోనూ అత్యున్నత ప్రమాణాలను పాటిస్తున్న సంస్థగా సింగరేణి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. బెల్లంపల్లి ఏరియాలోని డోర్లీ2 ఓపెన్కాస్ట్ గనిని కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా విజయవంతంగా మూసివేసినందుకు గుర్తింపుగా, గని ప్రారంభ సమయంలో డిపాజిట్ చేసిన సుమారు రూ. 40 కోట్ల సొమ్మును వడ్డీతో సహా కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ సింగరేణికి తిరిగి చెల్లించింది. ఈ విషయాన్ని బుధవారం ఒక ప్రకటనలో సంస్థ సిఎండి డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. గనుల ప్రారంభం నుంచి మూసివేత వరకు అమలు చేయాల్సిన మైన్ క్లోజర్ ప్లాన్, పర్యావరణ పరిరక్షణ చర్యలు, భూసంరక్షణ, పునరుద్ధరణ కార్యక్రమాలు తదితర అంశాలను సింగరేణి సంస్థ నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా కచ్చితంగా అమలు చేసిందన్నారు. డోర్లీ2 గని మూసివేత ప్రక్రియలో సింగరేణి చూపిన బాధ్యతాయుత వైఖరి, పర్యావరణ హిత చర్యలు, పారదర్శకంగా అమలు చేసిన తీరుకు కేంద్ర ప్రశంసలే నిదర్శనమన్నారు గనుల అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు సమాన ప్రాధాన్యత ఇస్తూ సుస్థిర మైనింగ్ విధానాలను అమలు చేస్తున్న సింగరేణి సంస్థకు ఇది మరో విశిష్ట గుర్తింపుగా భావిస్తున్నట్లు చెప్పారు. అనేక రకాల చర్యలు తీసుకోవడంతో పాటు వాతావరణ కాలుష్యం నియంత్రణలో ఉన్న విషయాన్ని ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎన్విరాన్ మేంటల్ ప్రొటెక్షన్ ట్రైనింగ్ అండ్ రీసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా ఆడిటింగ్ జరిపించినట్లు వెల్లడించారు.

# నేల ఆరోగ్యంలో బయోచార్ కీలకం

**పంట వ్యర్థాల నుండి ఉత్పత్తి**

**ఉద్యాన 'వర్సిటీ విసి రాజిరెడ్డి**

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** నేల ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో బయోచార్ (జీవ బొగ్గు లేదా వ్యవసాయంలో ఉపయోగించే బొగ్గు) కీలక పాత్ర పోషిస్తుందని తెలంగాణ రాష్ట్ర ఉద్యానవన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి. రాజి రెడ్డి అన్నారు. ఈ బయోచార్ పంట వ్యర్థాలు, అవశేషాల నుండి పైరోలిసిస్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తి అవుతుందని తెలిపారు. హైదరాబాద్‌లో బయోచార్ టెక్నాలజీపై జరిగిన ఒక కార్యక్రమంలో డాక్టర్ రాజీరెడ్డి మాట్లాడుతూ బయోచార్ వాడకం పంట దిగుబడులను పెంచడమే కాకుండా కార్బన్ సీక్వెస్ట్రేషన్‌ను కూడా సాధ్యం చేస్తుందని, ఇది వాతావరణ స్మార్ట్ వ్యవసాయం దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు అని అన్నారు. బయోచార్ నేలలో సేంద్రియ కర్బనాన్ని పెంచుతుందన్నారు. పంట వ్యర్థాలను ప్రత్యేక పద్ధతిలో కాల్చి బయోచార్‌ను తయారుచేస్తారని పేర్కొన్నారు. ఇది నేలకు అధిక మొత్తంలో పోషకాలను అందించి, భూసారాన్ని పెంచుతుందని చెప్పారు. అలాగే మట్టిలో నీటిని నిలుపుకునే సామర్థ్యాన్ని పెంచి, తేమను ఎక్కువ కాలం కాపాడుతుందని వివరించారు. అంతేకాకుండా భూమిలో ఆమ్ల, క్షార గుణాలను తటస్థీకరించి మట్టి నాణ్యతను మెరుగుపరుస్తుందని వెల్లడించారు. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని తగ్గించడంలో, వాతావరణ మార్పుల ప్రభావాలను నివారించడంలో బయోచార్ ఒక ముఖ్యమైన సాధనంగా ఉపయోగ పడు తుందని ఆయన నొక్కి చెప్పారు. రైతులు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు బయోచార్ ఆధారిత సాంకేతికతలను విస్తృతంగా అవలంబించాలని కోరారు. ఈ రంగంలో విశ్వవిద్యాలయం తన పరిశోధన, శిక్షణ, అవగాహన కార్య క్రమాలను బలోపేతం చేస్తుందని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బయోచార్ నిపుణుడు డాక్టర్ ఆరిఫ్ ఖాన్, ఉద్యాన విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ భగవాన్, పుష్ప సాగు పరిశోధనా కేంద్రం అధిపతి డాక్టర్ జ్యోతి, కూరగాయల పరిశోధనా కేంద్రం నుండి అనితా కుమారి, అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రశాంత్, ఇతర శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# 127 మంది సైబర్ నేరస్తులు అరెస్ట్

**సైబర్ సెక్యూరిటీ బ్యూరో వెల్లడి**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 10:** 127 మంది సైబర్ నేరస్తులను అరెస్ట్ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) బుధవారం వెల్లడించింది. సైబర్ మోసాలపై ఆపరేషన్ క్రాక్ డౌన్ 3.0లో భాగంగా ఈ నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపింది. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో రాష్ట్రవ్యాప్తంగా 127 మంది సైబర్ నేరస్తులను గుర్తించామని వివరించింది. వారిలో 57 మంది తెలంగాణకు చెందిన వారని.. మిగిలిన వారు ఇతర రాష్ట్రాలకు చెందిన వారని పేర్కొంది. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు, జిల్లా సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ కేంద్రాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయని వివరించింది. 48 మంది నకిలీ గుర్తింపుతో ఈ మోసాలకు పాల్పడ్డారని తెలిపింది. 27 మంది ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్స్, 11 మంది డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో ఉన్నట్లుగా గుర్తించామని చెప్పింది. ఈ నిందితుల్లో 68 శాతం మంది పాత సైబర్ నేరస్తులేనని టీజీసీఎస్‌బీ స్పష్టం చేసింది. ప్రజలను మోసం చేసినట్లు 103 మంది నిందితులు తమ విచారణలో వెల్లడించారని తెలిపింది. ఈ నిందితుల వద్ద నుంచి కీలక డిజిటల్ ఆధారాలతోపాటు పలు పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు టీజీసీఎస్‌బీ పేర్కొంది. అయితే 24 మంది నిందితులు పరారీలో ఉన్నారని వెల్లడించింది. వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు చెప్పింది. సైబర్ నేరాల కట్టడికి మరిన్ని కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో స్పష్టం చేసింది.

# ఎన్టీపిసికి రామగుండం థర్మల్!

**800 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్‌కు గ్రీన్‌సిగ్నల్**

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని పెద్దపల్లి జిల్లా రామగుండంలో చేపట్టనున్న 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నిర్మాణాన్ని ఎన్టీపీసీకి అప్పచేప్పేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రామగుండంలో ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఉత్పత్తి అవుతున్న 2,600 మెగావాట్ల విద్యుత్‌ను డిమాండ్ లేక పూర్తి స్థాయిలో ఉత్పత్తి చేయ లేక పోతున్నది. అయితే ఈ 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన కొత్తగా ఏర్పాటు చేయనున్న ప్లాంట్ నిర్మాణ పనులను ఎన్టీపీసీ సంస్థకే అప్పగించాలనే నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించినట్లు సమాచారం. ఈ కొత్త ప్లాంట్ నిర్మాణానికి రూ.10,893 కోట్లు అవుతాయని అంచనా వేశారు.

మొదట ఈ ప్లాంట్‌ను సింగరేణి సంస్థ భాగస్వామ్యంతో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఈ ప్రతిపాదనను తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ జెన్కో వ్యతిరేకించింది. దీంతో రామగుండం బీథర్మల్ కేంద్రాన్ని నిర్మించే బాధ్యతను ఎన్టీపీసీకి అప్పగించాలని ప్రభుత్వం భావిస్తున్నది. రాష్ట్ర విభజనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర అవసరాల కోసం 4000 మెగావాట్ల సామర్థ్యంతో (800 మెగావాట్ల చొప్పున 5 యూనిట్లు) సూపర్ క్రిటికల్ థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఎన్టీపీసీ ద్వారా రామగుండంలో నిర్మించాలని చట్టంలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఆ మేరకు టీఎస్‌టీపీపీ కేంద్రాల నిర్మా ణాలను చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో 1600 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు కోసం పీపీఏ చేసు కోవడంతో 800 మెగావాట్ల సామర్థ్యం గల రెండు యూనిట్ల నిర్మా ణాన్ని ఎన్టీపీసీ చేపట్టి పూర్తి చేసింది. వాటి ద్వారా ఏడాదిన్నర కాలంగా విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. మిగిలిన 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కోసం ఇప్పటి వరకూ ఎటువంటి పీపీఏ కుదుర్చుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టాలనుకుంటున్న రామగుండం బీథర్మల్ ప్రాజెక్టును ఎన్టీపీసీ చేపట్టే విధంగా ఒప్పించాలని ప్రయత్నం చేస్తున్నది. ఇందులో భాగంగానే ఇటీవల ఎన్టీపీసీ కార్పొరేట్ బృందం రామగుండం థర్మల్ స్థలాన్ని పరిశీలించారని సమాచారం.

# విబిజి రాంజి పథకం కింద రూ.3,825 కోట్లు

**రాష్ట్రానికి నిధులు విడుదల చేసిన ఆర్థిక మంత్రిత్వ శాఖ**

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, వలసలను నివారించడమే లక్ష్యంగా కేంద్రం సరికొత్త వ్యూహంతో ముందుకు వచ్చింది. దశాబ్దాలుగా దేశవ్యాప్తంగా అట్టడుగు వర్గాలకు జీవనోపాధిని కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్వరూపాన్ని మార్చేస్తూ, దాని స్థానంలో జీరాంజీ అనే సరికొత్త వినూత్న పథకాన్ని ప్రవేశపెడుతోంది. ఈ చారిత్రాత్మక మార్పు జులై 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఏకకాలంలో అధికారికంగా అమలులోకి రానుంది. దీనికి సంబంధించి తెలంగాణ రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులను మంజూరు చేస్తూ కేంద్రం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాలు ప్రకారం 2026–27 ఆర్థిక సంవత్సరానికి గానూ మిగిలి ఉన్న తొమ్మిది నెలల కాలానికి ఈ నిధుల కేటాయింపులు జరిగాయి. కొత్త నిబంధనల ప్రకారం జీరాంజీ పథకంలో కేంద్ర ప్రభుత్వ వాటా 60 శాతంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో రూ.3,825.31కోట్లను కేటాయిస్తూ కేంద్ర మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిధులు నేరుగా రాష్ట్ర అకౌంట్లకు చేరనున్నాయి. ఈ నూతన జీరాంజీ పథకం కింద రాబోయే తొమ్మిది నెలల కాలంలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా వివిధ గ్రామీణాభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.6,375.52 కోట్లను ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. రాష్ట్ర వాటా కింద రూ.2,550.21 కోట్ల నిధులు ఇందులో కేంద్రం అందించే నిధులు పోగా, మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం తన సొంత వనరుల నుంచి తప్పనిసరిగా సమకూర్చుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది. దీని ప్రకారం తెలంగాణ ప్రభుత్వం తన వాటా కింద రూ.2,550.21కోట్లను వెచ్చించి ఈ పనులను విజయవంతంగా నిర్వహిం చాల్సి ఉంటుంది. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను సకాలంలో విడుదల చేయకపోతే, కేంద్ర నిధుల వినియోగంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది.

# అమరావతికి వరాల జల్లు



సెంట్రల్ సెక్రటేరియట్ నమూనా

**రూ.1,299.08 కోట్లతో ఎపి సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం**

**రూ.1,234.91 కోట్లతో కేంద్ర ఉద్యోగుల క్వార్టర్లు**

**11టవర్లలో 1,504 నివాసగృహాలు.. కేంద్ర కేబినెట్ ఆమోదం**

**ఇప్పటికే 22.53 ఎకరాలు కేటాయించిన సిఆర్‌డిఎ**

**విజయవాడ, జూన్ 10, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో అభివృద్ధి పనుల దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. సెంట్రల్ సెక్రటే రియట్ నిర్మాణానికి సంబంధించి సిపిడబ్ల్యూడి ప్రతి పాదనలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సిసిఇఎ)ఆమోదం తెలిపింది.

దీంతో అమరావతిలో రూ.2,534కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మా ణానికి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1,299.08 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ.1,234.91కోట్లు వెచ్చించనుంది. కామన్ సెంట్రల్ సెక్రటేరియట్‌లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువు దీరనున్నాయి. అమరావతి కేంద్రంగా పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మల్టీస్టోరేజ్ నివాసాలు ఏర్పాటు చేయనున్నారు.

సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం ఇప్పటికే సిఆర్‌డిఎ 22.53 ఎకరాలు కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సెక్రటే రియట్, 17 ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్ట్ వ్యయాన్ని పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బడ్జెటరీ మద్దతు ద్వారా భరించనుంది.

ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (సిపిడబ్ల్యూడి) చేపట్టనుంది. ఇప్పటికే ప్రిబిడ్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, టెండర్ పత్రాల రూపకల్పన ప్రక్రియ పురోగతిలో ఉందని కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా రాజధాని అమరావతిలో కేంద్రం చేపడుతున్న మొట్టమొదటి జనరల్ పూల్ రెసిడెన్షియల్ అకామడేషన్ (జిపిఆర్ఎ)ప్రాజెక్ట్ ఇదే కావడం గమనార్హం.

మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో ఈ జిపిఆర్ఎ క్యాంపస్ ను నిర్మించనున్నారు. ఇందులో భాగంగా 11నివాస టవర్లను ఏర్పాటు చేసి, టైప్2 నుంచి టైప్ 6 వరకు వివిధ కేటగిరీలలో మొత్తం 1,504ఫ్లాట్లను నిర్మిస్తారు. ప్రాజెక్టులో భాగంగా 1,972కార్లు పార్క్ చేసుకునేలా బేస్‌మెంట్ పార్కింగ్ సదుపాయం కల్పిస్తారు. ఈ ప్రాజెక్టు మొత్తం నిర్మాణ విస్తీర్ణం 31.30లక్షల చదరపు అడుగులుగా ఉంది. అమరావతిలో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, వారికి తగిన నివాస సౌకర్యం కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం.

కార్యాలయాలకు సమీపంలోనే నివాసం ఉండటం వల్ల ఉద్యోగుల నైతిక స్థైర్యం, పనితీరు మెరుగుపడతాయని ప్రభుత్వం భావిస్తోంది.

ఇది ప్రభుత్వ కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా సాగేందుకు దోహదపడుతుందని ప్రకటనలో వివరించారు.

ఈ ప్రాజెక్టును పూర్తిగా పర్యావరణ హితంగా, గ్రీన్ బిల్డింగ్ ప్రమాణాలకు అనుగుణంగా నిర్మించనున్నారు. కనీసం 4స్టార్ గ్రీహా (జిఆర్ఐహెచ్ఎ) రేటింగ్ సాధించేలా, ఇంధన సామర్థ్యం, నీటి సంరక్షణ, స్థానిక నిర్మాణ సామగ్రి వాడకం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తారు.

క్యాంపస్‌లో బ్యాంకు, ఎటిఎం,పోస్టాఫీసు, కమ్యూనిటీ హాల్, ఫుడ్‌కోర్ట్, షాపింగ్ కాంప్లెక్స్, గెస్ట్‌హౌస్ వంటి అన్నిరకాల పౌర,సామాజిక సదుపాయాలు ఉంటాయి. అలాగే, దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా అవరోధ రహిత వాతావరణాన్ని కల్పించనున్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని అంచనా. నిర్మాణ దశలో ఏటా సుమారు 7 లక్షల పనిదినాలు, ప్రాజెక్టు పూర్తయ్యాక నిర్వహణ దశలో ఏటా 50,000 పనిదినాల ఉపాధి కలుగుతుందని కేంద్రం తెలిపింది.

# దక్షిణ తెలంగాణ వద్దే నిలిచిన రుతుపవనాలు

**17 వరకు ఎండలు, ఉక్కపోత**

**19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వర్షాలు**

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** తెలంగాణలో నైరుతి రుతుపవనాల కదలికలు కాస్త నెమ్మదించాయి. ఈ రోజు ఇవి దక్షిణ తెలంగాణ, హైదరాబాద్ పరిసర ప్రాంతాల వద్దే నిలిచిపోయినట్లు వాతావరణ విభాగం వెల్లడించింది. కనీసం ఈ నెల 17 వరకు ఉత్తర, ఈశాన్య తెలంగాణ వైపునకు ఇవి ముందుకు కదిలే సూచనలు చాలా తక్కువగా ఉన్నాయని అంచనా వేస్తోంది. రుతుపవనాలు బలహీనపడటం వల్ల రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ఎండ తీవ్రతతో పాటు ఉక్కపోత కూడా పెరగనుందని హెచ్చరిస్తున్నారు. ఈ కాలంలో వాతావరణంలో తేమ శాతం పెరిగి తీవ్రమైన ఉక్కపోత ఉండే అవకాశాలు ఉన్నాయి. అయితే, ఈ ఎండల వేడి కారణంగా అక్కడక్కడా స్థానికంగా మేఘాలు ఏర్పడి, ఉరుములు మెరుపులతో కూడిన చెదురుమొదురు వర్షాలు పడే అవకాశం కూడా ఉంది. ఈ నెల 18 తర్వాత వాతావరణం చల్లబడి ఊరట లభించనుంది. ఆ సమయంలో బంగాళాఖాతంలో ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో ఈ నెల 19 నుండి 23వ తేదీ మధ్య తెలంగాణలోని చాలా ప్రాంతాల్లో రుతుపవనాలు మళ్లీ పుంజుకుని, విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ నేపథ్యంలో వచ్చే వారంలో రాష్ట్రవ్యాప్తంగా వానలు జోరందుకుంటాయని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# పెద్ది సినిమా టికెట్ల ధర పెంపుపై సర్కార్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్లో వచ్చిన భారీ చిత్రం పెద్ది బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తున్నప్పటికీ, ఈ సినిమా టికెట్ల ధరల పెంపు వ్యవహారం ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. అదనపు ధరలు పెంచుకునేందుకు వీలుగా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇచ్చారంటూ తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శిపై బుధవారం హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడమే కాక, హోంశాఖ జారీ చేసిన సదరు మెమో పూర్తిగా అక్రమమని తేల్చిచెప్పింది. పెద్ది సినిమా విడుదలైన రోజు నుంచి అంటే ఈ నెల 4 నుంచి దాదాపు 10 రోజుల పాటు థియేటర్లలో టికెట్ ధరలను పెంచుకునేందుకు వీలుగా ఈ నెల 2వ తేదీన హోంశాఖ ఒక ప్రత్యేక మెమో జారీ చేసింది. దీని ప్రకారం సింగిల్ స్క్రీన్లలో రూ.100, మల్టీప్లెక్స్‌లో రూ.125 చొప్పున అదనంగా పెంచుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది. అయితే, సినిమా టికెట్ల ధరల నియంత్రణకు సంబంధించి గతంలో కోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను, న్యాయస్థాన ఉత్తర్వులను పూర్తిగా ధిక్కరిస్తూ ఈ మెమో జారీ చేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో కోర్టు విచారణ జరిపి సినిమా టికెట్ల ధరల సవరణ లేదా పెంపుదల ప్రక్రియ అనేది పూర్తిగా పారదర్శకంగా జరగాలని ఈ సందర్భంగా ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం ఖచ్చితంగా జీవో 121 లో పొందుపరిచిన నియమ నిబంధనలను మాత్రమే అనుసరించాలని స్పష్టం చేసింది. అలా కాకుండా కోర్టు ఆదేశాలను పక్కనబెట్టి ఇలాంటి మెమోలు జారీ చేయడం చట్టవిరుద్ధమని తప్పుపట్టింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు గానూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి తదుపరి చర్యలు ఏ విధంగా ఉండబోతున్నాయనేది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి రేపుతోంది. ఈ కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 15వ తేదీకి వాయిదా వేసింది.

# నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో దేశ ఆర్థిక అభివృద్ధికి బాటలు

**మోడీ 12 యేళ్ల పాలన పేరుతో నెహ్రూను కించపరచడం తగదు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, జూన్ 10,ప్రభాతవార్త:** స్వాతంత్రం వచ్చిన తొలిరోజుల్లో ఓవైపు కరవు ఆకలి మరోవైపు అభివృద్ధి లేమితో కొట్టుమిట్టాడుతున్న దేశంలో ఆర్థిక అభివృద్ధికి నెహ్రూ మిశ్రమ ఆర్థిక వ్యవస్థతో సామ్యవాద రీతి సమాజ నిర్మాణం బాటలు వేశారని తెలంగాణ రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కీర్తించారు. మోడీ 12 సంవత్సరాల పాలన పేరుతో దేశ నిర్మాణానికి పునాదులు వేసిన జవహర్‌లాల్ నెహ్రూని తక్కువ చేసి మాట్లాడడం చరిత్రను అవమానించడమే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వాతం త్రం వచ్చిన సమయంలో దేశం తీవ్రమైన ఆహార కొరత, నిరుద్యోగం, పారిశ్రామిక వెనుకబాటు, మౌలిక వసతుల లేమితో ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నదని గుర్తు చేశారు. అలాంటి పరిస్థితుల నుంచి భారతదేశాన్ని స్వావలంబన దిశగా నడిపించి, వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, శాస్త్ర సాంకేతిక రంగాలకు బలమైన పునాదులు వేసిన నాయకుడు జవహర్‌లాల్ నెహ్రూ అని పేర్కొన్నారు.నెహ్రూ దూరదృష్టితో అమలు చేసిన పంచవర్ష ప్రణాళికలు, భారీ సాగునీటి ప్రాజెక్టులు, ప్రభుత్వ రంగ పరిశ్రమలు, ఉన్నత విద్యా సంస్థలు నేటి భారత అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలిచాయని అన్నారు.

బాక్రా నంగల్, నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లు కోట్లాది రైతులకు సాగునీరు అందించి దేశ ఆహార భద్రతకు బాటలు వేసాయని తెలిపారు.నేడు ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ సంస్థలకు సిఇఒ లుగా భారతీయులు నాయకత్వం వహిస్తున్నారంటే, దేశంలో ఏర్పాటు చేసిన ఉన్నత విద్యా వ్యవస్థలు, శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా సంస్థలే కారణమని మంత్రి అన్నారు. నరేంద్ర మోడీని, జవహర్‌లాల్ నెహ్రూ తో పోల్చడం సరైన చారిత్రక అవగాహన లేకుండా చేసే ప్రయత్నమని మోడీ కి జవహర్ లాల్ నెహ్రూకి నక్క కి నాగ లోకానికి ఉన్న తేడా ఉందని ఎద్దేవా చేశారు.

దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని నెహ్రూ వేసిన పునాదులపై నేడు అనేక రంగాలు అభివృద్ధి చెందుతున్నాయని, ఆ విజయాలను పూర్తిగా తమ ఖాతాలో వేసుకోవడం తగదని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో 10 సంవత్సరాలు మంత్రి గా చేసిన పురదరీశ్వరి వంటి నాయకులు కూడా చరిత్రాత్మక వాస్తవాలను విస్మరించి వ్యాఖ్యలు చేయడం బాధాకరమని అన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో విశేష త్యాగాలు చేసిన నాయకుల పాత్రను తక్కువ చేసి చూపే ప్రయత్నాలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు.గత 12 సంవత్సరాల కేంద్ర పాలనలో ప్రజల అసలు సమస్యల పరిష్కారం, ఉపాధి కల్పన, విద్యా. వైద్య రంగాల బలోపేతం, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికల కంటే ప్రచార రాజకీయాలకే ఎక్కువ ప్రాధాన్యత లభించిందని మంత్రి విమర్శించారు. జవహర్‌లాల్ నెహ్రూ స్ఫూర్తి, దేశ నిర్మాణంలో ఆయన పాత్ర భారత చరిత్రలో చిరస్థాయిగా నిలిచి ఉంటుంది. దేశ అభివృద్ధికి పునాదులు వేసిన మహానేతల సేవలను కించపరిచే ప్రయత్నాలను ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

# ఇస్రో బాహుబలి ప్రాజెక్టు ప్రైవేటీకరణ




**న్యూఢిల్లీ,జూన్ 10:** అంతరిక్ష రంగంలో భారత్ ప్రైవేటీకరణకు తెరలేపింది. చంద్రయాన్3 మిషన్‌ను అత్యంత విజయవంతంగా జాబిల్లిపైకి మోసుకెళ్లిన ఇస్రో భారీ రాకెట్ ఎల్‌వీఎమ్3 సాంకేతికతను, నిర్వహణ బాధ్యతలను పూర్తిగా ప్రైవేట్ రంగానికి బదిలీ చేయాలని నిర్ణయించింది. అంతరిక్ష రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ప్రభుత్వ నోడల్ సంస్థ ఇన్ స్పేస్ ఈ మేరకు అధికారికంగా ఆసక్తి వ్యక్తీకరణ బిడ్లను ఆహ్వానించింది. అంతకుముందు చిన్న ఉపగ్రహాలను మోసే ఎస్ఎస్ఎల్వీ రాకెట్‌ను హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు బదిలీ చేసిన ప్రభుత్వం ఇప్పుడు ఏకంగా అత్యంత బరువైన రాకెట్‌ను ప్రైవేట్ కంపెనీలకు అప్పగించడానికి సిద్ధమైంది. భారీ బరువులను మోసుకెళ్లే అసాధారణ సామర్థ్యం కారణంగా ఈ రాకెట్‌ను అంతరిక్ష రంగంలో బాహుబలి అని పిలుస్తారు. ఈ మూడు దశల రాకెట్ ద్వారా ఇస్రో ఎన్నో స్వదేశీ, అంతర్జాతీయ ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలో ప్రవేశపెట్టింది. వన్‌వెబ్ శాటిలైట్ నెట్‌వర్క్‌ను నింగిలోకి పంపి అంతర్జాతీయ వాణిజ్య మార్కెట్‌లోనూ ఈ రాకెట్ తన సత్తా చాటుకుంది. భవిష్యత్తులో భారత వ్యోమగాములను అంతరిక్షంలోకి తీసుకెళ్లే గగన్‌యాన్ మిషన్ కోసం కూడా ఈ రాకెట్ ప్రత్యేక వెర్షన్‌ను వాడుతున్నారు. సాధారణ రాకెట్ల ఉత్పత్తి, ప్రయోగాల వంటి రెగ్యులర్ పనుల కోసం తన సమయాన్ని, వనరులను కేటాయించకుండా ఇస్రోను మరింత పెద్ద ప్రాజెక్టులపై కేంద్రీకరించేలా చేయడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. గగన్‌యాన్, చంద్రయాన్4, చంద్రయాన్5 వంటి ప్రతిష్ఠాత్మక మిషన్లతో పాటు శుక్రుడిపైకి చేపట్టే ప్రయోగాలపై ఇస్రో శాస్త్రవేత్తలు దృష్టి పెట్టేందుకు ఈ సంస్కరణలు ఎంతగానో దోహద పడతాయి. అదే సమయంలో అంతర్జాతీయ కమర్షియల్ మార్కెట్‌లో భారతదేశ వాటాను పెంచడానికి ఈ ప్రైవేటీకరణ ఉపయోగపడుతుంది. ఎల్‌వీఎమ్3 రాకెట్ తయారీ, మార్కెటింగ్ బాధ్యతలను దక్కించుకునే కంపెనీలకు ఇస్రో 42 నెలల పాటు లేదా రెండు రాకెట్లను విజయవంతంగా ప్రయోగించే వరకు పూర్తి సాంకేతిక సహాయాన్ని అందిస్తుంది. ఈ టెండర్లలో పాల్గొనే భారతీయ కంపెనీలకు ప్రభుత్వం కఠిన నిబంధనలను విధించింది. ఆ సంస్థలు కనీసం ఏడేళ్లుగా వ్యాపారంలో ఉండాలి. అంతరిక్ష లేదా ఏరోస్పేస్ రంగంలో ఐదేళ్ల అనుభవం తప్పనిసరి. గత ఐదేళ్లలో ఏవైనా మూడేళ్ల సగటు వార్షిక టర్నోవర్ రూ.800 కోట్లు దాటాలి. లేదా ఆ కంపెనీ మార్కెట్ విలువ కనీసం రూ. 2,000 కోట్లు ఉండాలి. ఇది విజయవంతమైతే అంతర్జాతీయంగా భారీ రాకెట్లను ప్రయోగించే అంతరిక్ష వాణిజ్య మార్కెట్లో భారతదేశ ప్రైవేట్ కంపెనీలు రాణించే అవకాశం ఏర్పడుతుంది.

## అసెంబ్లీ సమావేశాలను తలపించిన టీనేజ్ బాలికల మాక్ అసెంబ్లీ

### ప్రజాసేవ పట్ల బాలికల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యం: మంత్రి సీతక్క

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూన్10:** హైదరాబాద్ జూబ్లీ హాల్‌లోని పూర్వ శాసన మండలి భవనంలో బుధవారం నిర్వహించిన టీనేజ్ బాలికల రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ అసెంబ్లీ సమావేశాలను తలపిస్తూ ఆకట్టుకుంది. రాష్ట్రం నలుమూలల నుంచి ఎంపికైన కిశోర బాలికలు ప్రజాప్రతినిధుల పాత్రలో పాల్గొని ప్రజా సమస్యలపై చర్చించడం, అధికార విపక్ష సభ్యులుగా వ్యవహరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెల్లటి ఖాదీ దుస్తులు, కండువాలు ధరించి రాజకీయ నాయకులను తలపించేలా హాజరైన బాలికలు సభలో క్రమశిక్షణతో పాల్గొని తమ వాదనలను వినిపించారు. ఆరోగ్యం, విద్య, ఆదివాసీ సంక్షేమం, సోషల్ మీడియా ప్రభావం, యువత భవిష్యత్ వంటి పలు అంశాలపై చర్చలు నిర్వహించారు. టీనేజ్ బాలికల స్నేహ సంఘాల ఆధ్వర్యంలో ముందుగా మండల స్థాయిలో, అనంతరం జిల్లా స్థాయిలో మాక్ అసెంబ్లీలు నిర్వహించగా, అందులో ప్రతిభ కనబరిచిన బాలికలను ఎంపిక చేసి రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క బాలికలను అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు టీనేజ్ బాలికలకు ఇలాంటి వేదికలను కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషించిన సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

సభలో మాట్లాడిన బాలికలు ఆరోగ్యం, ఆదివాసీ సంక్షేమం, సోషల్ మీడియా ప్రభావం వంటి కీలక అంశాలను ప్రస్తావించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం సోషల్ మీడియా యువతను అత్యంత వేగంగా ఆకర్షిస్తోందన్నారు.

## జస్టిన్ ట్రూడోనే నాకు సర్వస్వం: పాప్‌సింగర్ కేటీపెర్రీ



**వాషింగ్టన్, జూన్ 10:** అమెరికాకు చెందిన ప్రముఖ పాప్‌సింగర్ కేటీ పెర్రీ తన వ్యక్తిగత జీవితం గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడోతో తాను పీకల్లోతు ప్రేమలో ఉన్నానని, ఆయననే తన జీవితానికి సర్వస్వం అని ఆమె ప్రకటించారు. ఇటీవల న్యూయార్క్ నగరంలో జరిగిన 'కేటీపెర్రీ : ది లైఫ్‌టైమ్స్ టూర్' కాన్సర్ట్ ఫిల్మ్ ప్రీమియర్‌కు ఆమె జస్టిన్ ట్రూడోతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా తొలిసారిగా ఇద్దరూ జంటగా రెడ్‌కార్పెట్‌పై నడిచారు. ఈ కార్యక్రమంలో కేటీపెర్రీ మాట్లాడుతూ.. 'నేను గాఢమైన ప్రేమలో ఉన్నా. నా జీవితానికి సర్వస్వం అయిన వ్యక్తిని కలిసిన తర్వాతే ఈ షో చేశా. ఆయన నా జీవితానికి ఒక లంగరుగా నిలిచారు. నేను ఒక రంగుల గాలిపటం వంటి దాన్ని, ఎంతో ఎత్తుకు ఎరుగుతా. అలాంటి నాకు ఒక ఆధారం అవసరం. ఇప్పుడు ఆ ఆధారం దొరకడంతో నా జీవితం పరిపూర్ణంగా అనిపిస్తోంది' అని ఆనందం వ్యక్తం చేశారు. తన జీవితం ఇప్పుడు ఎంతో సంతోషంగా ఉందని ఆమె తెలిపారు. కేటీపెర్రీకి గతంలో నటుడు రస్సెల్ బ్రాండ్‌తో వివాహం కాగా.. విడాకులు తీసుకున్నారు. ఆ తర్వాత నటుడు ఓర్లాండో బ్లూమ్‌తో నిశ్చితార్థం జరిగి, కుమార్తె డైసీ జన్మించింది. అయితే 2025తో బ్లూమ్‌తో నిశ్చితార్థం రద్దు కావడం తన జీవితంలో అత్యంత కష్టమైన సమయాల్లో ఒకటని ఆమె గుర్తు చేసుకున్నారు. 'ఆ కష్టాల నుంచి బయటపడ్డా. అభిమానులకు, నా కుమార్తెకు, నాకు నేను ఇచ్చిన మాట కోసం నిలబడ్డాను. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో అగ్నిపరీక్షను ఎదుర్కోవాల్సిందే' అని కేటీ పెర్రీ అన్నారు. ప్రస్తుతం తన 40 యేళ్ల వయసులో జీవితాన్ని కొత్త కోణంలో చూస్తున్నానన్నారు.

## నవజాత మగ శిశువు అక్రమ విక్రయంపై పి.ఎస్ లో జీరో ఎఫ్.ఐ.ఆర్ నమోదు

### దర్యాప్తు కోసం నందిగామ పి.ఎస్ కు బదలీ

**కార్వాన్,జూన్ 10(ప్రభాతవార్త)**నవజాత మగ శిశువును చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నారనే సమాచారం అందుకొన్న శిశు సంక్షేమ శాఖ ప్రాథమిక విచారణలో దిగ్భ్రాంతికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ విషయమై కుల్సుంపురా పి.ఎస్ లో నవజాత మగ శిశువు అక్రమ విక్రయంపై జీరో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పిల్లలు లేని మధుసూదన్, మీనా దంపతులు పిల్లల కోసం వెతుకుతున్న క్రమంలో మధ్యవర్తులైన జియాగూడ, పుకట్ నగర్ నివాసి అయిన పోతరాజు నర్సింగరావును సంప్రదించి, తమకు ఒక బాబును ఇప్పించాల్సిందిగా కోరారు. దీనితో సురేష్ వెంటనే పద్మ పల్తియా భర్త గోపి పల్తియాలను సంప్రదించాడు. వీరిద్దరూ మధ్యవర్తులుగా మారి ఒక నవజాత మగ శిశువును అప్పగించేందుకు ఏర్పాట్లు చేశారు. మోహన్, సంధ్య దంపతులకు గత నెల 28న తుక్కుగూడలోని లక్ష్మి ప్రైవేట్ హాస్పిటల్ లో మగ పిల్లడు జన్మించాడు, మోహన్‌కు బంధువు అయిన పద్మకు ఆ బాబును అప్పగించేందుకు మోహన్, సంధ్య దంపతులు అంగీకరించారు. ఈ ఒప్పందం ప్రకారం, రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పరిధిలోని జె.పి.దర్గా వద్ద మధ్యవర్తి సురేష్ సమక్షంలో మధుసూదన్, మీనా దంపతులు రూ.1లక్షా,70 డెబ్బై వేల రూపాయలు నగదును మధ్యవర్తి అయిన పద్మకు చెల్లించి, ఆనవజాత శిశువును తమ ఆధీనంలోకి తీసుకున్నారు. చట్టప్రకారం దత్తతకు నిబంధనలను పాటించకుండా పూర్తిగా అక్రమంగా నిర్వహించారు. 12 రోజుల వయస్సు ఉన్న మగ శిశువును చైల్డ్ వెల్ఫేర్ కమిటీ హైదరాబాద్ సమక్షంలో ప్రవేశపెట్టగా వారి ఆదేశాల మేరకు బాబుకు సురక్షిత రక్షణ, సంరక్షణ కల్పించే నిమిత్తం అమీర్‌పేట్, మధురానగర్ మెట్రో స్టేషన్ సమీపంలో ఉన్న శిశు విహార్ లో చేర్చడం జరిగింది. కుల్సుంపురా పోలీస్ స్టేషన్‌లో జీరో ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేసి తదుపరి విచారణ నిమ్మితం నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది కావున తదుపరి దర్యాప్తు, రీ రిజిస్ట్రేషన్ నిమిత్తం అసలు ఫిర్యాదును, దానికి సంబంధించిన అన్ని రికార్డులను అధికార పరిధి కలిగిన నందిగామ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేయడం జరిగిందని కుల్సుంపురా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఓ

## త్రిపురలో ఇక వారానికి ఐదురోజులే పని!

### శని,ఆదివారాలు సెలవులుగా ప్రకటించిన మాణిక్ ప్రభుత్వం

**ఐజ్వాల్, జూన్ 10:** ప్రభుత్వ ఉద్యోగుల పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు వారి వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యత ఇచ్చేలా త్రిపుర రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయంతీసుకుంది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఆదివారంతో పాటు ఇకపై ప్రతి శనివారం అధికారికంగా పూర్తి స్థాయి సెలవు దినంగా ప్రకటిస్తూ ముఖ్యమంత్రి మాణిక్‌సాహ నేతృత్వంలోని కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇకపై నెలలోని అన్ని శనివారాలు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినాలు ఇప్పటివరకు నెలలో కొన్ని శనివారాలు మాత్రమే సెలవులు ఉండగా, నూతన ఉత్తర్వుల ప్రకారం ఇకపై నెలలోని అన్ని శనివారాలు ప్రభుత్వ ఉద్యోగులకు సెలవు దినాలుగా మారనున్నాయి. ఈ శనివారాల సెలవుల వల్ల ప్రభుత్వ పనులకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ప్రజలకు సేవలు సకాలంలో అందేలా చూసేందుకు వీలుగా కార్యాలయాల పని వేళల్లో ప్రభుత్వం కొన్ని మార్పులను ప్రవేశపెట్టింది. వారానికి ఐదు రోజుల పని దినాలు, రోజువారీ గంటల పెంపు వారానికి ఐదు రోజుల పని దినాల విధానాన్ని తీసుకురావడంతో, మిగిలిన ఐదు రోజులలో రోజువారీ పని గంటలను పెంచారు. దీని ప్రకారం సోమవారం నుండి శుక్రవారం వరకు ఉద్యోగులు అదనపు సమయం ఆఫీసుల్లో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ సవరించిన వేళలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని





ప్రభుత్వ శాఖలు, అనుబంధ సంస్థలు మరియు ప్రభుత్వ రంగ సంస్థలకు వర్తిస్తాయని అడ్మినిస్ట్రేషన్ విభాగం స్పష్టం చేసింది. ప్రభుత్వం తీసుకున్న ఈ వినూత్న నిర్ణయం పట్ల రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. వారానికి రెండు రోజుల సెలవు లభించడం వల్ల ఉద్యోగులపై మానసిక ఒత్తిడి తగ్గి, మిగిలిన ఐదు రోజులు వారు మరింత ఉత్సాహంతో, రెట్టింపు సామర్థ్యంతో పని చేసే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నూతన పని వేళలు, సెలవుల నిబంధనలు అమలులోకి అంతేకాకుండా, సుదూర ప్రాంతాల నుండి వచ్చి విధులు నిర్వహించే ఉద్యోగులకు ఈ నిర్ణయం ఎంతో ప్రయోజనకరంగా మారనుంది. ఈ నూతన పని వేళలు మరియు సెలవుల నిబంధనలు తక్షణమే అమలులోకి రానున్నట్లు అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కొత్త పని విధానం భవిష్యత్తులో ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచే అవకాశం ఉందని పలువురు భావిస్తున్నారు.

## పిఒకెలో మీర్పూరి ముస్లింలపై పాకిస్థాన్ అరాచకాలు

### లండన్‌లో ముస్లిం వేదిక తీవ్రస్థాయి నిరసన

**ముజఫరాబాద్,జూన్ 10:** పాకిస్తాన్ అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోతోంది. పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో తమ హక్కుల కోసం నినదిస్తున్న స్థానిక ప్రజలను పాక్ ఆర్మీ ఊచకోత కోస్తోంది. పీఓకే అసెంబ్లీలో కాశ్మీరీ శరణార్థులకు రిజర్వేషన్లు కల్పిచడంపై స్థానికులు భగ్గుమన్నారు. ఇదే కాకుండా పాకిస్తాన్ తమ వనరుల్ని దోచుకుని పాక్ పంజాబ్ ప్రావిన్స్‌కు తరలిస్తుందని




ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పీఓకేలోని రావల్‌కోట్ ప్రాంతంలో మొదలైన ఈ తిరుగుబాటు ముజఫరాబాద్, మీర్పూర్, గిల్గిత్ బాల్టిస్తాన్ ప్రాంతాలకు విస్తరించింది. పాకిస్తాన్‌కు గత కొన్నేళ్లుగా అండగా నిలుస్తున్న మీర్పూరి ముస్లింలు ఇప్పుడు ఆ దేశంపై తిరుగుబాటు చేస్తున్నారు. ముఖ్యంగా యూకేలో కాశ్మీర్ విషయంలో, భారత్‌కు వ్యతిరేకంగా కథనాన్ని నిడిపించడంలో ఈ మీర్పూరి ముస్లింలు కీలకంగా వ్యవహరించేవారు. ఇప్పుడు పరిస్థితి మారింది. పీఓకేలో తమ వారిపై చేస్తున్న దౌర్జన్యాలపై పాకిస్తాన్‌ను ప్రశ్నిస్తున్నారు. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో యూకే వెళ్లి అక్కడే సెటిల్ అయిన ఈ మీర్పూరి ముస్లింలు అక్కడి రాజకీయాలను ప్రభావితం చేస్తున్నారు. ఇప్పుడు, పాకిస్తాన్ దురాగతాలపై యూకే స్పందించేలా ఒత్తిడి తీసుకువస్తున్నారు. బ్రిటన్‌లో ఉన్న ముస్లింలలో ఈ మీర్పూరి ముస్లింలే 60-70 శాతం ఉంటారు. బ్రిటన్ రాజకీయాలను ప్రభావితం చేసే శక్తివంతమైన కమ్యూనిటీగా మారారు. బ్రిటన్‌లో 50 ఎంపీ స్థానాల్లో వీరు డిసైడింగ్ ఫ్యాక్టర్‌గా ఉన్నారు. 30 మంది బ్రిటిష్ ఎంపీలు ఆందోళన వ్యక్తం చేశారు. వీరంతా పీఓకే ఘటనలపై యూకే విదేశాంగశాఖకు లేఖ రాశారు. ఈ ఎంపీల బృందానికి బ్రాడ్‌ఫోర్డ్ ఎంపీ ఇమ్రాన్ హుస్సేన్ నాయకత్వం వహిస్తున్నారు. ఇతను కూడా మీర్పూరి ముస్లిం సంతతికి చెందిన వాడే. పీఓకేలో తమ వారితో మాట్లాడే అవకాశం లేకుండా పోయిందని, పాక్ ఇంటర్నెట్ సస్పెండ్ చేసిందని, అక్కడి విషయాలు తెలియకుండా చేస్తుందని యూకేలోని పీఓకే సంతతికి చెందిన వారు చెబుతున్నారు. పాక్ చేస్తున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై యూకే ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని వీరు కోరుతున్నారు. పీఓకే ప్రజలు యూకేలోని పాకిస్తాన్ రాయబార కార్యాలయం ముందు నిరసన చేశారు.

# రూ.1.3 లక్షల కోట్ల ఆర్థిక సాయంపై దృష్టి

### ప్రతిష్టాత్మక పథకాల అమలుకు నిధుల సమీకరణ

### పాత రుణాలను తక్కువ వడ్డీలకు దీర్ఘకాలికంగా మార్పు

### పక్కా ప్రణాళికతో రాష్ట్ర సర్కార్ నిధుల అన్వేషణ

**హైదరాబాద్, జూన్ 10, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ పథకాల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వం నిధుల సమీకరణపై దృష్టిసారించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పథకాల అమలు నిమిత్తం పెద్ద ఎత్తున నిధులు అవసరం కావడంతో కొత్త రుణాల సేకరణ రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరుల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకోవడంపై ఆర్థిక శాఖ ప్రణాళికాబద్ధంగా ముందుకెళుతోంది. ఇదే సమయంలో గతంలో చేసిన రుణాలను తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక రుణాలుగా మార్చే యత్నం చేస్తోంది. ప్రస్తుతం ఆర్టీసీకి నిధులు సమకూర్చడం, రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు, మెట్రో రైలు స్వాధీనం, రైతు భరోసా తదితర కార్యక్రమాలకు భారీగా నిధులు అవసరం అవుతుందని ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేశారు. మరోపక్క రాష్ట్రానికి వస్తున్న ఆదాయం, వ్యయానికి మధ్య భారీగా వ్యత్యాసం ఉంటోంది. దీంతో రుణాలపైనే ప్రభుత్వం ఎక్కువగా ఆధారపడుతోంది. ఆర్థిక శాఖ అధికారిక వర్గాల సమాచారం ప్రకారం రాష్ట్రంలో ప్రస్తుతం సగటున నెలకు రూ.18,500 కోట్ల ఆదాయం వస్తోంది. అయితే. తెచ్చిన అప్పుల కిస్తీలు, వడ్డీలు, ప్రభుత్వ ఉద్యోగుల జీతాలకే ప్రతి నెలా సగటు రూ.13 వేల కోట్లు ఖర్చవుతోంది. మిగిలిన రూ.5 వేల కోట్లతోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చు చేయాల్సిన పరిస్థితి తప్పడం లేదు. ఏప్రిల్‌లో రాష్ట్రానికి వచ్చిన మొత్తం రూ.22,392.28 కోట్లలో రుణాల ద్వారా సమకూరిందే ఎక్కువ. ఇక వ్యయాల విషయానికొస్తే, ఈ నెలలో రూ.21,472.31 కోట్లు ఖర్చు చేసింది. రెవెన్యూ వ్యయం ఒక్కటే రూ.19,501.32 కోట్లుగా ఉంది. ఇందులో జీతాలకు రూ.4,449.24 కోట్లు, పెన్షన్లు రూ.1,893.11 కోట్లు, వడ్డీ చెల్లింపులు రూ.2,350.90 కోట్లు, సబ్సిడీలకు రూ.4,727.38 కోట్లు వ్యయం చేసింది. కాగా ప్రస్తుతం రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలకే 100 రోజుల్లో రూ.6 వేల కోట్లకు పైగా నిధులు అవసరం అని అంచనా వేస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల వైద్య ఖర్చులన్నింటినీ ఆర్థిక శాఖ విడుదల చేస్తోంది. అలాగే నెలకు రూ.700 కోట్ల నిధులను ఉద్యోగుల బిల్లులకు సర్దుబాటు చేస్తోంది. మరోవైపు ప్రస్తు వానాకాలం సీజనులో రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాకు నిధులు సమకూర్చాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఖజానాకు ఆదాయం మరింత పెంచడంపై మంత్రివర్గ సబ్ కమిటీ రంగంలోకి దిగింది. ఆర్థిక లోటును పూడ్చడానికి, ఖర్చులను కొనసాగించడానికి భారీగా గ్రాంట్లు, మోలిక సదుపాయాల కేటాయింపులు, వడ్డీ లేని రుణాలు, ప్రాజెక్టుల ఆమోదం కోసం కేంద్రంపై వత్తిడి తేచ్చి వాటిని సాధించాలని భావిస్తోంది. ప్రధానంగా 50 ఏళ్ల వడ్డీ లేని రుణాలను గ్రాంట్లుగా మార్చడం, కేంద్ర సహాయాన్ని రెట్టింపు చేయడం, విద్య, ఆరోగ్య రంగాల ఖర్చులను ఎఫ్ఆర్‌బిఎం పరిమితుల నుండి మినహాయించడం, రాష్ట్రాల కోసం ఆర్థిక లోటు పరిమితిని 4 శాతానికి పెంచడం వంటివి ఉన్నాయి. అలాగే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2, రీజినల్ రింగ్ రోడ్, నాలుగు జిల్లాల్లో కొత్త విమానాశ్రయాలు, పాలమూరురంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా, మూసీ నది అభివృద్ధి, రేడియల్ రోడ్లు, నగర మురుగునీటి వ్యవస్థ విస్తరణ కోసం భారీ ప్రాజెక్టుల మంజూరుకు కూడా కేంద్రంపై ఒత్తిడి చేస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా, వీటన్నింటికీ కేంద్రం నుండి గణనీయమైన భాగస్వామ్యం అవసరమని భావిస్తున్న ప్రభుత్వం వివిధ ప్రాజెక్టుల కోసం దాదాపు రూ.1.3 లక్షల కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రతిపాదించింది. అంతేకాకుండా అదనంగా, కేంద్ర పన్నులలో వాటా పెంచేలా వత్తిడి తెస్తోంది. ఆర్థిక సంఘం 41 శాతం పన్నుల పంపిణీని సిఫార్సు చేసినప్పటికీ, సెస్సులు, సర్‌ఛార్జీల కారణంగా వాస్తవ రాబడి దాదాపు 30 శాతానికి తగ్గిపోయింది. ఈ నేపథ్యంలో సర్‌ఛార్జీలు, సెస్సుల ద్వారా సేకరించిన రూ.1.55 లక్షల కోట్లలో గణనీయమైన భాగాన్ని మౌలిక సదుపాయాల నిధులకు మళ్లించడం లేదా పంపిణీ చేయగల పన్నుల పూల్‌లో చేర్చాలని రాష్ట్రం కోరుతోంది. హైదరాబాద్ మెట్రో మొదటి దశను రూ.15 వేల కోట్ల వ్యయంతో టేకోవర్ చేసుకుంటుండగా, ఈ మొత్తంలో రూ.13 వేల కోట్ల రుణాలు, రూ.2 వేల కోట్ల ఈక్విటీ వాటా ఉంది. భూముల రిజిస్ట్రేషన్ ఫీజులు పెంచడం ద్వారా ఆదాయం సమకూరితే పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పాత బకాయిలు చెల్లింపులకు మరిన్ని నిధులు అందుబాటులోకి వస్తాయని ఆర్థిక శాఖ అంచనా వేస్తోంది. ఇదే సమయంలో గతంలో అధిక వడ్డీకి తీసుకున్న రుణాలకు సంబంధించిన బకాయిలకు నెల నెలా కిస్తీలు చెల్లి;ంపుల భారం అధికంగా ఉన్నందున వాటిని తక్కువ వడ్డీకి దీర్ఘకాలిక రుణాలుగా మార్చే పనిలో ఆర్థిక శాఖ నిమగ్నమైంది. పాత రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చినప్పటికీ, కొత్తగా రూ.25 వేల కోట్లను మార్చాలని నిర్ణయించింది. గతంలో 10 నుండి 11 శాతం వరకూ వడ్డీ చెల్లించే ఒప్పందంతో రుణాలు తీసుకోగా, ఇప్పుడు 7 నుండి 7.5 శాతానికి మార్చాలని భావిస్తోంది.

## విబిజి రాంజి రద్దు చేసి, ఉపాధి హామీని అమలు చేయాలి

### ప్రజాసంఘాల రాష్ట్ర సదస్సు తీర్మానం



ప్రసంగిస్తున్న విద్యా కమిషన్ మాజీ చైర్మన్ ఆకునూరు మురళి

**చిక్కడపల్లి జూన్ 10 ( ప్రభాతవార్త ) :** పేద ప్రజలు ఆత్మగౌరవంతో జీవించేలా చేసే సంక్షేమ పథకాల అమలును బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు జీర్ణించుకోలేకపోతున్నాయని, ఆ పథకాలను హరించడమే వాటి విధానమని రాష్ట్ర విద్యా కమిషన్ మాజీ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ ఆకునూరు మురళి ధ్వజమెత్తారు. కూలీల పని హక్కులను కాలరాసే విబి గ్రామ్‌జీ చట్టాన్ని తెలంగాణలో అమలు చేయకుండా, రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా ఖిగ్రామీణ ఉపాధి హామీ కొత్త చట్టాన్నిఖి రూపొందించి కూలీల హక్కులను పరిరక్షించాలని వివిధ ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. సేవ్ నరేగా తెలంగాణ ఆధ్వర్యంలో బుధవారం నాడు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో "విబి గ్రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలి" అనే అంశంపై రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఉపాధి హామీ పథకం మాజీ డైరెక్టర్ కూడా అయిన ఆకునూరు మురళి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. "పేద ప్రజల చట్టాలను, పథకాలను అణచివేస్తున్న బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను అందరూ ఎండగట్టాలి. పని హక్కును కల్పించిన చారిత్రాత్మక మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయాలని చూడడం అప్రజాస్వామికం, నియంతృత్వ పోకడలకు నిదర్శనం. ఏడాదికి కనీసం 100 రోజులు పని కల్పించలేని వారు, ఇప్పుడు 125 రోజులు పని కల్పిస్తామంటూ కూలీలను వంచిస్తున్నారు. పని హక్కులను కాలరాయడం రాజ్యాంగ వ్యతిరేక చర్య" అని ఆయన మండిపడ్డారు. ఉపాధి హామీ పథకం రాష్ట్ర సామాజిక తనిఖీ విభాగం మాజీ డైరెక్టర్ సౌమ్య మాట్లాడుతూ కూలీల హక్కులను హరించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన గ్రామీణ చట్టాన్ని రద్దు చేసే వరకు ఉమ్మడిగా పోరాడాలని పిలుపునిచ్చారు. దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ తదితరులు పాల్గొన్నారు. కూలీల హక్కులను కాలరాసే విబి గ్రామ్‌జీ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమించాలని ఈ సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో పీపుల్స్ మానిటరింగ్ రాష్ట్ర కన్వీనర్ శివలింగం,

టీవీవీయూ నాయకులు నర్సింలు, పద్మ, ప్రజా ఉద్యమాల జాతీయ వేదిక నాయకురాలు మీరా సంఘమిత్ర, సామాజిక కార్యకర్తలు డాక్టర్ ఉషా సీతాలక్ష్మి, అఖిల్ సూర్య, రైతు స్వరాజ్య వేదిక నాయకులు కన్నెగంటి రవి, హర్ష, కొండల్, దళిత బహుజన ఫ్రంట్ నాయకులు దుబాయ్ సంజీవ్, కల్పన,

రాజేందర్, కిసాన్ మిత్ర కార్యకర్తలు రమాకాంత్, రాకేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

### మీనాక్షి కేసులో చిట్టీ ఇచ్చింది

## మీ తెలంగాణ కాంగ్రెస్ నేతలే!

### ఎంపి మంత్రి విజయ్ వర్గియా ఎద్దేవా

**భోపాల్,జూన్ 10:** మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కోలుకోలేని షాక్ తగిలింది. కాంగ్రెస్ సీనియర్ నేత, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షినటరాజన్ దాఖలు చేసిన నామినేషన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం తిరస్కరించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా పెను సంచలనంగా మారింది. ఈ నిర్ణయానికి నిరసనగా కాంగ్రెస్ అగ్రనేతలు ఢిల్లీలోని ఈసీ కార్యాలయం ముందు బైఠాయించగా తమకు జరిగిన అన్యాయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ హైడ్రామా నడుస్తున్న తరుణంలో మధ్యప్రదేశ్ బీజేపీ కీలక మంత్రి కైలాష్ విజయ్‌వర్గీయ ఒక పొలిటికల్ బాంబు పేల్చారు. మీడియాతో మాట్లాడిన మంత్రి కైలాష్ విజయ్‌వర్గీయ అసలు మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసులు ఉన్నాయనే విషయం మాకు ముందే తెలియదు. మాకు ఆ సమాచారం ఇచ్చింది, అక్కడి నుండి చిట్టీ పంపింది స్వయంగా తెలంగాణ కాంగ్రెస్ నేతలే అని కుండబద్దలు కొట్టారు. ప్రస్తుతం తెలంగాణలో ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమేనని గుర్తు చేసిన ఆయన సొంత పార్టీ నేతలే ఆమెపై ఉన్న కేసుల వివరాలను లీక్ చేశారంటే, ఆ పార్టీ అంతర్గత వ్యవహారాలు ఎంత ఘోరంగా ఉన్నాయో ప్రజలకే అర్థమవుతుందని ఎద్దేవా చేశారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ లో కలకలం రేపుతున్నాయి.



## ఘజియాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

### లక్షల్లో ఫర్నిచర్ కంపెనీకి ఆస్తినష్టం

**ఘజియాబాద్,జూన్ 10:** ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌లో బుధవారం ఉదయం ఒక ఘోర అగ్నిప్రమాదం జరిగింది. సాహిబాబాద్ ప్రాంతంలోని ఒక లోకల్ ఫర్నిచర్ ఫ్యాక్టరీలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి భారీ ప్రమాదానికి దారితీసింది. మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో చుట్టుపక్కల జనం తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. బూడిదైన ఫర్నిచర్ లక్షల్లో ఆస్తి నష్టం ఫ్యాక్టరీలో అంతా కలప, కుర్చీలు, సోఫాల తయారీకి వాడే వస్తువులు ఉండటం వల్ల మంటలు చాలా వేగంగా ఫ్యాక్టరీ మొత్తం వ్యాపించాయి. చూస్తూ చూస్తూనే లోపల ఉన్న ఫర్నిచర్ అంతా కాలి బూడిదైపోయింది. దీనివల్ల ఫ్యాక్టరీ యజమానికి లక్షల్లో భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. కేవలం ఫర్నిచర్ మాత్రమే కాకుండా, ఫ్యాక్టరీ ఆవరణలో పార్క్ చేసి ఉన్న ఒక కారు, బైక్ కూడా ఈ మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ ఫైటర్లు తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. మంటలు పక్కనే ఉన్న మిగతా బిల్డింగులకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. దాదాపు నాలుగు గంటల పాటు కష్టపడి, ఎట్టకేలకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ప్రాథమిక నివేదికల ప్రకారం ఫ్యాక్టరీలో జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ అగ్నిప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో ఫ్యాక్టరీ లోపల ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు, ఎవరికీ గాయాలు కూడా కాలేదు. దీంతో అక్కడున్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. నగరంలో పెరుగుతున్న ఎండలు, ఉక్కపోత వల్ల విద్యుత్ వైర్లపై లోడ్ పడి ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, ఫ్యాక్టరీల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# అందమైన బొట్టు మాల!



ఫ్యాషన్ ఫ్యాషన్

అమ్మాయిలంటేనే అలంకరణలూ, ఆభరణాలు, సందర్భం ఉండాలే కానీ, అందంగా తయారై మెరిసిపోరూ! పండగలు, వేడుకల వేళ సంప్రదా యం, సొగసూ ఇనుమడించేలా కనిపించేందుకు బొట్టునగల్ని మించిన ఎంపిక ఉండదు మరి. కాలాన్ని బట్టి దుస్తులూ, యాక్సెసరీల్లోనే కాదు.. నగల్లోనూ డిజైన్లలోనూ ఎన్నో మార్పులు వచ్చేస్తుంటాయి. అయితే, కొన్నిసార్లు నయా రకాలు వస్తే మరికొన్ని పాత ఫ్యాషన్లే కొత్తందాలు చుట్టుకుని వస్తుంటాయి. అలా ఒకప్పుడు అమ్మ, అమ్మమ్మల తరం.. మెడలో పెట్టుకుని మురిసిపోయిన బొట్టు నగలు ఇప్పుడు ఆధుని కతరంఅందాన్ని రెట్టింపు చేసేందుకు కొత్త సొబగులద్దుకుని మళ్లీ వచ్చేశాయి. ధరించినవారి అందాన్నిచూపు తిప్పుకోగలమా !













## బొప్పాయితో మెరిసే ..!

బాగా పండిన బొప్పాయిపై తొక్క తీసేసి.. ముక్కలుగా కట్ చేయాలి. వీటిని మిక్సీలో వేసి పేస్టులా చేసుకోవాలి. ఈ గుజ్జును ముఖానికి, మెడకు పట్టించి.. గుండ్రంగా రుద్దు తూ మర్దన చేసుకోవాలి. ఇలా దాదాపు 20 నుంచి 30 నిమి షాల వరకు మృదువుగా మసాజ్ చేసుకుంటూ ఉండాలి. తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. కావాలనుకుంటే ఈ బొప్పాయి పేస్ట్‌కు టీస్పూన్ చొప్పున కలబంద గుజ్జు, తేనె కలుపుకోవచ్చు. ఇలా బొప్పాయితో చేసుకొనే ఫేషియల్ గోల్డెన్ ఫేషియల్ చేసుకున్నంత ఫలితాన్నిస్తుం దంటున్నారు నిపుణులు. అంతేకాదు.. ముఖం మీద ఉంటే ట్యాన్ కూడా తగ్గ ముఖం పడు తుంది. ఇలా వారానికి ఒకటి లేదా రెండు సార్లు చేయడం వల్ల ప్రకాశవంతమైన చర్మం మన సొంతమవుతుంది. □



# 'మచా జిలేబీ' మజా మజాలే !

ఎంత మధుర పదార్థాలైనా వాటికీ రంగురంగుల ఆకర్షణ ఉంటేనే మజా! ఇప్పుడొచ్చే స్వీట్లన్నీ రంగు, రుచి, వాసన ఉంటేనే మార్కెట్‌లో 'స్వీట్ కేక్'ల్లో అదిరిపోతున్నాయి. మిఠాయిరంగును మించిన మరింత ఆకర్షణీయ రంగును జోడించడం రుచినిపెంచే ఇతరత్రా ఫ్లేవర్‌లను కలపడం, ఇవన్నీ మధుర ప్రియులకు ఎంతగానో తృప్తినిస్తాయి. అలాంటి వాటికి ఇప్పుడెంతో 'క్రేజ్', తాజాగా మార్కెట్‌లో సంప్రదాయ 'జిలేబీకి' జపనీస్ మచా కలిపి ఎవర్ గ్రీన్‌గా ఆకర్షణియమే కాదు నోరూరించేటట్లు అందిస్తున్నారు.

ఈ కొత్త స్వీట్ కోసం ఈసారి ఆకుపచ్చరంగును ఎన్నుకున్నారు. సాధారణంగా పసుపు లేదా నారింజ రంగులో, కరకరలాడుతూ తియ్యగా ఉండే జిలేబీ అందరికీ సుపరిచితమే. అయితే, జపాన్‌కు చెందిన గ్రీన్ టీ పౌడర్ 'మచా'ను ఉపయోగించి ఈ కొత్త జిలేబీని తయారు చేస్తున్నారు. దీనివల్ల జిలేబీకి కొద్దిగా వగరు, భిన్నమైన రుచి వస్తుంది. ఈ 'మచా జిలేబీ'ని స్ట్రాబెర్రీ లస్సీ తో కలిపి అంది స్తున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతాయి. మొన్నీమధ్య ఒకామె ఈ కాంబినేషన్‌ను పోస్ట్ చేయగానే మరిన్నీ చానల్స్‌లోకి పేస్ట్ అయి పోయాయి. 'జిలేబీని లస్సీలో ముంచకుండా తింటే రుచికి రుచి మజాకు మజా! అని నోరూరించే స్థాయిలో జిలేబిని పట్టుకుని ఎగిరి గంతేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఫ్యూజన్ ఫుడ్ ట్రెండ్‌లో భాగంగానే మచా జిలేబీ వంటి ప్రయోగాలు తెరపైకి వస్తున్నాయని నిపుణులు అంటున్నారు. గతంలో చాక్లెట్, చిల్లీ జిలేబీల్లాగానే ఇదీనూ ! ఫుడ్ ప్రియులకు విరివిగా దొరికేటట్లు స్వీట్‌షాప్ ఓనర్లు ఏర్పాట్లు చేసారు. ఒకసారి మనమూ రుచి చూస్తే పోలా!



# 'ఐ బ్రో' పెన్సిల్ వాడొద్దు !




సాధారణంగా ఇన్ఫెక్షన్లు, హార్మోనుల్లో మార్పులు, థైరాయిడ్ వంటివి ఇందుకు దారితీస్తాయి. కొందరు సమయానికి ఆహారం తీసుకోక పోవడం, విపరీతంగా డైట్ చేయడం లాంటివి చేస్తుంటారు. ఆ ప్రభావం కనుబొమలపైనా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన, మేకప్ ఉత్పత్తులు ఎక్కువగా వాడటం, తరచూ ఐబ్రోస్ తీయించుకోవడం వంటివీ సమస్యగా మారుతుంటాయి. గుండ్రని ప్యాచ్‌లు వస్తే అలోపేషియా ఏరియేటా అయ్యుండొచ్చు. ఇమ్యూన్‌సిస్టమ్ సరిగా పనిచేయక పోవడం వల్ల ఇది వస్తుంది. కొందరిలో రెప్పలపై ఉన్న వెంట్రుకలూ పోతాయి. దురద, చర్మం పొట్టులా రాలడం వంటివి ఉంటే ఎగ్జిమా కావొచ్చు. సోరియాసిస్, కాంటాక్ట్ డెర్మటైటిస్, సెబోరిక్ డెర్మటైటిస్ వంటివీ కారణమవొచ్చు. ముందు కను బొమలు రాలడానికి అసలు కారణమేంటో నిపుణులను సంప్రదించి తెలుసుకోండి. మామూలుగా మినాకినసడల్ 5% ద్రావణం, కార్టికో స్టిరాయిడ్ క్రీములు వాడటం ద్వారా పరిస్థితి అదుపులోకి తెచ్చుకోవచ్చు. సమస్య పెద్దది అయితే మందులు, ఇంజెక్షన్లనూ తీసుకోవాల్సి ఉంటుంది. వీటితోపాటు మస్కారా, ఐబ్రో పెన్సిల్ వాడకాన్ని తగ్గించండి. విటమిన్లు, మినరల్స్ ఆహారం ద్వారా సమృద్ధిగా అందేలా చూసుకోవడంతోపాటు ఒత్తిడికీ దూరంగా ఉండండి. ఇన్నీ చేశాక కూడా పెరుగుదల లేకపోతే అప్పుడు ఐబ్రో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకోవచ్చు. □

# వ్యథ: బాధను చెప్పుకోనీయండి

ప్రశ్న: ప్రేమ విఫలం కావడంతో మా అమ్మాయి డిప్రెషన్ కు గురయ్యింది. బాధ, ఆవేదన, భయం, ఆందోళనతో సత మతం అవుతోంది. అర్థం లేని మాటలు మాట్లాడు తోంది. అతన్ని మరువలేను అంటుంది. అంతలోనే మరొకరితో పెళ్లి చేస్తే మరిచిపోతాను అంటుంది. నా వల్ల అందరికీ సమస్యలు వచ్చాయి కాబట్టి చనిపోతే అందరూ సుఖపడుతారు అంటూ ఏడుస్తుంది. నెల రోజులుగా కంటికి కునుకులేకుండా కాపలా కాస్తున్నాము. ఆమె ఇప్పుడు మెడిసిన్ మూడో సంవత్సరం చదువుతోంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదివే సమయంలో ఒక అబ్బాయితో పరిచయం పెంచుకున్నది. మార్కులు తగ్గడంతో ఆరా తీసి బుద్ధి మాటలు చెప్పి నియంత్రించాము. అప్పటికి మరచిపోయి బాగా చదివి మెడిసిన్ లో సీటు తెచ్చుకున్నది. మళ్ళీ అతను తారస పడటంతో పీకల్లోతు ప్రేమలోకి దిగింది. పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నది. అయితే తల్లి తండ్రులు సమ్మతించక పోవడంతో ఆ అబ్బాయి తిరస్కరించాడు. మాకు విషయం తెలిసి ప్రయత్నం చేసినా అతని తల్లి తండ్రులు సమ్మతించ లేదు. దీనితో మా అమ్మాయి పిచ్చిదాని లాగా ప్రవర్తిస్తోంది. ఆమె మనసు మార్చే మార్గం చెప్పండి.

- ఒక సోదరి, విశాఖపట్నం

జవాబు: అమ్మా మీ అమ్మాయి ప్రేమ విఫలం కావడంతో తీవ్రమైన భావోద్వేగ సంక్షోభం ఎదుర్కొంటోంది. డిప్రెషన్‌తో బాధ పడుతోంది. ముఖ్యంగా "నేను చనిపోతే అందరూ సుఖపడతారు" అని చెప్పడం, అర్థం లేని మాటలు మాట్లాడడం, తీవ్ర ఆవేదనతో ఉండటం వంటి లక్షణాలను చాలా తీవ్రమైనవిగా భావించాలి. కాబట్టి మీ అమ్మాయిని వెంటనే మానసిక వైద్యునీతో పాటు క్లినికల్ సైకాలజిస్టుకు చూపించండి. ప్రేమ విఫలం కావడం కారణం కావచ్చు, కానీ ప్రస్తుతం కనిపిస్తున్న లక్షణాలు కేవలం కౌన్సెలింగ్‌తోనే సరిపోని స్థాయిలో ఉండవచ్చు. మీరు ఆమెతో ఎక్కువ మాట్లాడి, హితోపదేశాలు చేయడం కంటే ఆమె బాధను అంగీకరిం చండి. ఆమె ఏడిస్తే ఏడవనివ్వండి, బాధను చెప్పనివ్వండి. దీనివల్ల మనసులోని బాధ తగ్గి కొంత ఉపశమనం దొరుకుతుంది. 'ఇంకొకరితో పెళ్లి చేస్తే మరిచిపోతాను' అనేది ఆమె బాధ నుంచి బయటపడటానికి చెబుతున్న మాట. ఈ స్థితిలో పెళ్లి నిర్ణయం తీసుకోవడం సరైనది కాదు. ఆత్మహత్య ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయ వద్దు. ఆమెకు తోడుగా మీరు ఉన్నారు అన్న భరోసా కల్పించండి. ఒంటరిగా ఉంచకుండా జాగ్రత్త పడండి. చాలా సున్నితంగా వ్యవహరిస్తూ మనసు ద్యాస మళ్ళించండి. ఇంటర్‌లో ఒకసారి ఆ సంబంధం నుంచి బయటపడి, తిరిగి చదువుపై దృష్టి పెట్టి మెడిసిన్‌లో సీటు సాధించింది అంటే మీ అమ్మాయిలో మానసిక బలం ఉంది. ప్రస్తుతం ఆమె తీవ్రమైన దుఃఖం, నిరాశ ప్రభావంలో ఉంది. సరైన చికిత్స, కుటుంబ మద్దతు, ఆదరణ ఉంటే కొద్ది రోజుల్లో కోలుకుంటుంది. □



ఎన్.బి.సుధాకర్‌రెడ్డి
సైకాలజిస్టు

# సాక్షాత్కారం!

బుధుడు భౌతిక జ్ఞానం, తర్కం, విశ్లేషణకు ప్రతీక. గురువు దైవజ్ఞానం, ధర్మం, ఆత్మసాక్షాత్కారానికి ప్రతీక. బుధ–గురు వైరం మనకు "బుద్ధి , భక్తి కలిసినప్పుడే సంపూర్ణత" . నేటి కాలంలో విద్య, విజ్ఞానం, సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇవన్నీ బుధుని ప్రభావాన్ని సూచిస్తాయి. అదే సమయంలో ధర్మం, సంస్కృతి, గురుభక్తి, ఆధ్యాత్మిక విలువలు కూడా అవసరమే. ఇవి గురువు కటాక్షానికి సూచనలు. బుద్ధికి భక్తి తోడైతే విజయం, జ్ఞానానికి వినయం తోడైతే దైవానుగ్రహం అనే సత్యాన్ని బుధ,గురు వైరం మనకు గుర్తు చేస్తుంది. మనం బుధుని మేధస్సు ను, గురువు జ్ఞానాన్ని సమానంగా గౌరవించాలి. విజ్ఞానానికి వినయం జత కలిసినప్పుడు, విద్యకు విలువలు తోడైనప్పుడు జీవితం సార్థకమవుతుంది. గురువు మనకు ధర్మమార్గాన్ని చూపిస్తే, బుధుడు ఆ మార్గంలో నడిచే వివేకాన్ని అందిస్తాడు. ఈ ఇద్దరి ఆశీర్వాదంతోనే మనిషి భౌతికంగా, ఆధ్యాత్మికంగా అభివృద్ధి చెందగలడు. □

# తెర



## 'సింగ్ గీతం' 12న రిలీజ్

చాలా మంది ఫిల్మ్ మేకర్స్ సినిమా విడుదల అనేది ఒక ముగింపు ఘట్టం. అయితే లెజెండరీ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, క్రియేటివ్ ఫిల్మ్‌మేకర్ నాగ్ అశ్విన్‌లకు మాత్రం తాము ఊహించిన ప్రతి క్రియేటివ్ ఎలిమెంట్ తెరపై అత్యుత్తమంగా ఆవిష్కృతమయ్యేలా చూసుకోవడమే ముఖ్యం.

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'సింగ్ గీతం' చిత్రం తొలుత జూన్ 11న విడుదల కావాల్సి ఉండగా, ఇప్పుడు జూన్ 12కి వాయిదా పడింది. కథలో కీలక పాత్ర పోషించే కొన్ని ముఖ్యమైన సీజీఐ, విజువల్ ఎఫెక్ట్స్ పనులను మరింత మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. 'సింగ్ గీతం' ఒక ఫాంటసీ, సూపర్‌నేచురల్ ప్రపంచాన్ని ఆవిష్కరించే చిత్రం. ఇందులో సంగీతంతో పాటు విజువల్స్ కూడా కథనంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయి. ప్రేక్షకులను ఆ ప్రపంచంలో పూర్తిగా లీనం చేసే అనుభూతిని కలిగించాలనే ఉద్దేశంతో, చిత్ర బృందం ఫైనల్ అవుట్‌పుట్‌ను మరింత పర్ఫెక్ట్ చేయడానికి అదనపు సమయం కేటాయిస్తోంది. తాజాగా సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. 'సింగ్ గీతం'కు క్లీన్ 'యూ సర్టిఫికేట్ లభించింది. అందరూ ఫ్యామిలీతో కలసి బిగ్ స్క్రీన్‌పై ఆస్వాదించదగిన అద్భుతమైన అనుభూతిని అందించేందుకు జూన్ 12న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. వైజయంతి మూవీస్, స్వప్న సినిమా సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఆయాన్, అహల్యా ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, శాలిని కొండెపూడి కీలక పాత్ర పోషిస్తున్నారు. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలో పాటలు, నేపథ్య సంగీతం మెయిన్ హైలెట్స్‌గా నిలవనున్నాయి.

# లెజెండరీ డైరెక్టర్ భారతీరాజా



**ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు భారతీరాజా (84) కన్నుమూశారు. అనారోగ్యంతో ఆయన తుదిశ్వాస విడిచారు. 1977లో వచ్చిన తమిళ మూవీ'16 వయథినిలే'తో ఆయన దర్శకుడిగా మారారు. 'సీతాకోకచిలుక', ఆరాధన', జమదగ్ని, ఈ తరం ఇల్లాలు, తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు ఆయన సుపరిచితుడే. దర్శకుడిగానే కాదు, నటుడిగానూ అలరించారు. యువ, సీత కత్తి, ఈశ్వరన్, సర్, తిరు, మహారాజా వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు.**

కొత్త తరం నటులను సృష్టించిన వెటరన్ లెజెండరీ డైరెక్టర్ భారతీరాజా కన్నుమూశారు. .ఆయన వయసు 84.. కొంత కాలంగా అస్వస్థతతో బాధపడు తున్నారు...16 వయతినిలే ఆయన తొలి సినిమా.. భారతి రాజా ఎన్నో ఎక్స్పరిమెంట్స్ చేశారు.. ఆరోజుల్లోనే సైకలాజికల్ థ్రిల్లర్స్ తీసి యువతను ఉర్రూతలూగించారు..రజని కమల్ శ్రీదేవికి స్టార్ డం ఇచ్చిన వారిలో ఈయనే ప్రథముడు.. 6 జాతీయ అవార్డులు 6 తమిళనాడు రాష్ట్ర అవార్డులు 4 ఫిలింఫేర్ అవార్డులు ఇంకా ఎన్నో అవార్డులు ఆయనను సత్కరించుకున్నాయి. భారత ప్రభుత్వం పద్మశ్రీ తో సన్మానించింది ఆయన మంచి నటుడు కూడా..తూర్పు వెళ్లే రైలుకి తమిళ మాతృక కూడా ఈయనే తీసారు.. ఈయన కేవలం గ్రామీణ జీవితాలనే చిత్రీకరిస్తారు అనే అపవాదును చెరిపెయ్యడానికి ఎర్రగులాబీలు అనే సైకలాజికల్ థ్రిల్లర్ పూర్తి అర్బన్ లైఫ్ ని ప్రతిబింబిస్తూ తీశారు ఆ తర్వాత టిక్ టిక్ టిక్ తీసి యువతని ఉర్రూతలూగించారు..నిలాల్గల్ నీడలు అనే సినిమా తో ఈయన పరిణితి పైన అందరికీ అనుమానాలు పోయాయి ..ఆత్మబంధువు తో సున్నితమైన మానసిక, మానవీయ కోణాలను కూడా అంతే ప్రతిభతో చిత్రించగలరు అనేది నిశ్చయం అయింది. తెలుగులో డైరెక్టుగా సీతాకోక చిలకలు కొత్త జంటతో తీసి సృజనకు భాష భేదాలు ఎల్లలు కావు అని నిరూపించుకున్నారు.దీనికి జాతీయ ఉత్తమ చిత్రం అవార్డుతో పాటూ 5 నందులు కూడా దక్కాయి. ప్రతి సంవత్సరం ప్రతిష్టత్మాకంగా సంతోషం సినిమా వార పత్రిక అధినేత సురేష్ కొండేటి నిర్వహించే సంతోషం పురస్కారాలలో జీవిత సాఫల్య పురుస్కారాన్ని కూడా భారతీరాజా అందుకున్నారు ఆరాధన చిరంజీవి, సుహాసిని, జమదగ్ని, కొత్త జీవితాలు, యువ తరం పిలిచింది, ఈతరం ఇల్లాలు వంటివి ఆయన నేరుగా తెలుగులో డైరెక్టు చేసిన సూపర్ హిట్ సినిమా లు ...భానుమతి బాలయ్య బాబు కాంబినేషన్‌లో వచ్చిన సూపర్ హిట్ సినిమా మంగమ్మగారి మనుమడు కి కథను అందించారు.. అలాగే రాజశేఖర్ నటించిన పల్నాటి పౌరుషం సినిమాకి స్క్రీన్ ప్లే అందించారు.. భారతీయ సినిమాకి పేరు ప్రతిష్ఠలు తెచ్చిన దర్శకుల లో ముందువరుసల తప్పకుండా వుంటారు.. భారతీరాజా సినిమాలు ఫిల్మ్ స్టూడెంట్స్‌కి రీసెర్చ్ మెటీరియల్ అనడంలో సందేహం లేదు ..ముఖ్యంగా స్క్రీన్ ప్లే, సినిమాటోగ్రఫీ టెక్నికాలిటీస్ తప్పనిసరి పాఠాలు.. మేటి దర్శకులు తన మార్క్‌ని వదిలి తరలి పోయారు...

## 'అనుమాన పక్షి' హిలేరియస్ ఫన్ రైడ్ టీజర్ రిలీజ్



'దీరి టిల్లు'తో సంచలన విజయాన్ని అందుకున్న రచయిత దర్శకుడు విమల్ కృష్ణ, మరో విభిన్నమైన వినోదాత్మక చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈసారి ఆయన 'చిలక ప్రొడక్షన్స్' బ్యానర్‌పై 'అనుమాన పక్షి' అనే యునిక్ కామెడీ చిత్రం కోసం యంగ్ హీరో రాగ్ మయూర్‌తో జతకట్టారు. రాజీవ్ చిలక, రాజేష్ జగతి యాని, హీరాచంద్ దండ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ కథానాయికగా నటిస్తున్నారు. రమణ గోగుల ఆలపించిన ఈ చిత్రంలోని మొదటి పాట 'గులాబ్ జామ్' ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. తాజాగా చిత్ర బృందం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేసింది.టీజర్‌లో రాగ్ మయూర్ పోషించిన పాత్రను పరిచయం చేశారు. ఈ చిత్రం రెగ్యులర్ స్టోరీ ఫార్ములాలకు భిన్నంగా, వినూత్నమైన, ఆఫ్‌బీట్ నేరేషన్‌తో సాగుతుందనే టీజర్‌తో స్పష్టమవుతుంది. ఫ్రెష్ నెస్, యూనిక్, అనూహ్యమైన మలుపులతో కూడిన కథన శైలి ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.విమల్ కృష్ణకు ప్రత్యేకమైన వినూత్న కామెడీ శైలి ఈ టీజర్ అంతటా కనిపిస్తుంది. ఎప్పుడూ అనుమానపడే హీరో పాత్రలో రాగ్ మయూర్ అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతని హావభావాలు, స్క్రీన్ ప్రెజెన్స్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. కథానాయికగా మెరిన్ ఫిలిప్ ఆకట్టుకోగా, ప్రిన్స్ సెసిల్, రాశి, అజయ్, అనన్య, చరిత్, బ్రహ్మాజీ, మస్త్ అలీ తమ తమ పాత్రల్లో అలరించారు. మొత్తంగా 'అనుమాన పక్షి' టీజర్ నవ్వులు పంచే వినోదభరిత ప్రయాణానికి ఆహ్వానం పలుకుతోంది. టీజర్ చూస్తుంటే ప్రేక్షకులకు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ గ్యారెంటీ అనిపిస్తోంది. ఈ చిత్రం జూలై 10న థియేటర్లలో విడుదల కానుంది.

## SYG (సంబరాల ఏటిగట్టు) ముంబై షెడ్యూల్ పూర్తి

మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ పాన్‌ఇండియా స్పెక్టికల్ SYG(సంబరాల ఏటిగట్టు) తో ఇంతకు ముందెన్నడూ చూడని ఎక్స్ పీరియన్స్ అందించడానికి సిద్ధమవుతున్నాడు. హనుమాన్ వంటి గ్లోబల్ బ్లాక్‌బస్టర్ తర్వాత ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం SYGపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. రోహిత్ కె.పి దర్శకత్వంలో, నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ భారీ చిత్రానికి సంబంధించిన ముంబై షెడ్యూల్ విజయ వంతంగా పూర్తయింది. ఈ షెడ్యూల్‌లో ఓ ప్రముఖ బాలీవుడ్ నటుడు పాల్గొనడం చిత్రానికి మరో ప్రత్యేక ఆకర్షణగా మారింది. హనుమాన్ విజయంతో భారతీయ సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు తెచ్చు కున్న ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్, SYGతో మరింత భారీగా నిర్మిస్తోంది. ఇప్పటికే పూర్తైన ప్రతి షెడ్యూల్ ఈ ప్రాజెక్ట్ యొక్క భారీ స్థాయి, గొప్ప విజన్‌ను ప్రజెంట్ చస్తోంది. ఇటీవల పూర్తైన ముంబై షెడ్యూల్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు పాల్గొనడం, ఈ చిత్రాన్ని ట్రూ పాన్‌ఇండియా స్థాయిలో రూపొందించాలన్న మేకర్స్ లక్ష్యాన్ని మరోసారి చాటిచెప్పింది. SYGను ప్రపంచ స్థాయి థియేట్రికల్ అనుభూతిని అందించే చిత్రంగా తీర్చిదిద్దేందుకు మేకర్స్ ఎలాంటి రాజీ లేకుండా నిర్మిస్తున్నారు. ప్రతి షెడ్యూల్‌ను అత్యున్నత నిర్మాణ విలువలతో రూపొందిస్తుండటంతో, సినిమా స్థాయి రోజురోజుకూ మరింత విస్తరిస్తోంది.



## 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ ' దర్శక నిర్మాత పి. సునీల్ కుమార్ రెడ్డి..



సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ ' ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్హోన్హా, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్‌తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్‌గా , చంద్రము , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. 'ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్ ' సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ రోజు హైదరాబాద్‌లో ఈ మూవీ టీమ్ మీడియాతో ఇంటరాక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లాడుతూ మా హక్కుల కోసం ఎంతో కాలంగా పోరాటం చేస్తున్నాము. కానీ మాకు సరైన వేదిక ఎక్కడా లభించలేదు. డైరెక్టర్ సునీల్ కుమార్ రెడ్డి మా సమస్యల ఇతివృత్తంతో ఈ సినిమాను రూపొం దించడం హ్యాపీగా ఉంది. కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ గే కమ్యూనిటీ కోసం దాదాపు 12 ఏళ్లుగా పోరాడుతున్నాను.

## 'పోలీస్ కంప్లైంట్' 12న విడుదల



హారర్, యాక్షన్, థ్రిల్లర్, కామెడీ, రొమాన్స్ అంశాల సమ్మేళనంగా తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్ 'పోలీస్ కంప్లైంట్'చిత్రం జూన్ 12న తెలుగు, కన్నడ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు మేగోటి మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హీరోయిన్ వరలక్ష్మి శరత్‌కుమార్ సినిమా ప్రమోషన్స్‌కు సహకరించకపోవడం వల్ల చిత్రానికి భారీ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఇది నేను దర్శకత్వం వహించిన 11వ చిత్రం. నా కథను నమ్మి సినిమా నిర్మించిన నిర్మాతలకు కృతజ్ఞతలు. ఈ సినిమాలో కీలక పాత్ర చేసిన హీరో కృష్ణసాయి మాట్లాడుతూ, సూపర్ స్టార్ కృష్ణగారిపై రూపొందించిన ప్రత్యేక గీతంలో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఫిలిం సిటీలో ఆ పాటను అద్భుతంగా చిత్రీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్ స్టార్ కృష్ణ వ్యక్తిగత పీఆర్వో బాలాజీ శర్మ మాట్లాడుతూ, కృష్ణసాయి చిన్నప్పటి నుంచే సూపర్ స్టార్ కృష్ణగారి వీరాభిమాని. ఈ సినిమాలో కృష్ణగారిని గుర్తు చేసే పాట ఎంతో అద్భుతంగా రూపొందింది. .నటి బేబీ తనుశ్రీ మాట్లాడుతూ,కృష్ణసాయి సార్‌తో కలిసి ఈ చిత్రంలో నటించడం ఆనందంగా ఉంది, .

# అఫ్ఘాన్‌తో వన్డే సమరానికి రెడీ




## టీమిండియాలో ఆరుగురు ఔట్

## జట్టులోకి కీలక ప్లేయర్లు ఎంట్రీ

**న్యూఢిల్లీ:** అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన ఏకైక టెస్టు మ్యాచ్‌లో చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసిన టీమిండియా, ఇప్పుడు మూడు మ్యాచ్‌ల వన్డే సమరానికి సిద్ధమవుతోంది. అఫ్ఘానిస్తాన్‌తో జరగబోయే ఈ మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకంగా మారనుంది. ఈ నెల 13న ధర్మశాలలో మొదటి వన్డే, 17న లక్నోలో రెండో వన్డే, 20న చెన్నైలో చివరి వన్డే మ్యాచ్ జరగనున్నాయి టెస్ట్ సిరీస్ ముగిసిన వెంటనే భారత సెలెక్టర్లు వన్డే జట్టులో భారీ మార్పులు చేశారు. టెస్టు జట్టులో ఉన్న ఆరుగురు ఆటగాళ్లను పక్కన పెట్టి, పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో నిరూపించుకున్న ఆరుగురు కీలక ఆటగాళ్లను జట్టులోకి తీసుకొచ్చారు. రెండు ఫార్మాట్లకు వేర్వేరు జట్లను ఎంపిక చేసిన సెలెక్టర్లు, టెస్టులో ఆడిన కొందరు ఆటగాళ్లను వన్డే సిరీస్ నుంచి తప్పించారు. ముల్లాంపూర్ టెస్టులో భాగమైన సాయి సుదర్శన్, రిషబ్ పంత్, దేవదత్ పడిక్కల్, మహ్మద్ సిరాజ్, మానవ్ సుతార్, ధ్రువ్ జురెల్ వన్డే జట్టులో చోటు కోల్పోయారు.

వాస్తవానికి యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ కూడా ఈ జాబితాలో ఉండాల్సిందే, కానీ స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మోకాలి వెనుక భాగంలో నరాల నొప్పితో వన్డే సిరీస్ మొత్తానికి దూరం కావడంతో జైస్వాల్‌కు అదృష్టం వరించింది. కోహ్లీ స్థానంలో జైస్వాల్‌ను వన్డే జట్టులోకి కొనసాగించారు. ఇక టెస్ట్ జట్టు నుంచి ఔట్ అయిన వారి స్థానంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తిరుగులేని రికార్డు ఉన్న ఆరుగురు ఆటగాళ్లు జట్టులోకి వచ్చారు. టెస్ట్ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పిన సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ తిరిగి వన్డే జట్టులోకి వచ్చాడు. అలాగే టెస్టు ఫార్మాట్ నుంచి విరామం తీసుకున్న వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ తిరిగి జట్టుతో చేరాడు. ట్వంటీ20 సిరీస్ తర్వాత వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్, చాలా కాలం తర్వాత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా వన్డే జట్టులోకి పునరాగమనం చేశారు. వీరితో పాటు ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్, యువ బౌలర్ ప్రిన్స్ యాదవ్ వన్డే సిరీస్‌లో తమ సత్తా చాటనున్నారు.

అఫ్గానిస్తాన్ వన్డే సిరీస్ కోసం భారత పూర్తి జట్టులో శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, హర్ష్ దూబే ఉన్నారు.





## ఆస్ట్రేలియన్ ఓపెన్ ..

## రెండో రౌండ్‌కు సింధు, తన్వి

### ముగిసిన పురుషుల సింగిల్స్ పోరు

**న్యూఢిల్లీ:** సిడ్నీలో జరుగుతున్న ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్ విభాగంలో భారత్ షట్లర్లు పి.వి. సింధు, తన్వి శర్మ ముందంజతో రెండో రౌండ్‌కు చేరుకున్నారు. రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పివి సింధు, పెరూకు చెందిన ఇనెస్ కాస్టిల్లోపై వరుస గేమ్‌లలో సునాయాస విజయంతో తన ప్రచారాన్ని ప్రారంభించింది. ప్రపంచ ర్యాంకింగ్‌లో 10వ స్థానంలో ఉన్న ఈ మాజీ ప్రపంచ ఛాంపియన్, మ్యాచ్ ఆద్యంతం తన నియంత్రణలో ఉంచుకుని, 21-13, 21-11 తేడాతో విజయం సాధించింది. టీనేజర్ తన్వి శర్మ కూడా అద్భుతమైన ప్రదర్శనతో రెండో రౌండ్‌కు చేరుకుంది. ప్రస్తుత బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అయిన ఆమె, ప్రారంభ రౌండ్‌లోని అత్యంత ఆసక్తికరమైన ఫలితాల్లో ఒకటిగా, చైనీస్ తైపీకి చెందిన ప్రపంచ నంబర్ 11 చియు పిన్‌చియాన్‌ను 21-12, 22-20 తేడాతో ఓడించింది. సింధు ఇషారాణితో, తన్వి మాల్వికతో తలపడనుండగా, మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌కు భారత్ నుండి కనీసం ఇద్దరు ప్రతినిధులు ఖాయమయ్యారు. అయితే, పురుషుల సింగిల్స్‌లో కిరణ్ జార్జ్, సనీత్ దయానంద్, తరుణ్ మన్నేపల్లి అందరూ తొలి రౌండ్‌లోనే ఓటమి పాలవ్వడంతో, ఈ విభాగంలో భారతదేశపు పోరాటం ముగిసింది. అయితే పురుషుల డబుల్స్‌లో మాత్రం ఎంఆర్ అర్జున్-హరిహరన్ అమ్సకరుణన్ తొలి రౌండ్‌లో ఘన విజయం సాధించారు.

## చరిత్ర సృష్టించిన బంగ్లాదేశ్

### 21 యేళ్ల తర్వాత ఆస్ట్రేలియాపై విజయం



**న్యూఢిల్లీ:** వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ చరిత్ర సృష్టించింది. 21 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఆస్ట్రేలియాపై వన్డే మ్యాచ్‌లో విజయాన్ని కైవసం చేసుకుంది. మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఢాకా వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ద్వారా 86 పరుగుల తేడాతో ఆస్ట్రేలి యాను ఓడించింది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ మొసాడెక్ హుస్సేన్ అద్భుతమైన ప్రదర్శనతో విజయంలో కీలక పాత్ర పోషించాడు. బ్యాటింగ్‌లో అజేయ హాఫ్ సెంచరీతో రాణించిన మొసాడెక్(86 నాటౌట్), బౌలింగ్‌లో (2/37) రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 284 పరుగులు చేసింది. తంజిద్ హసన్(44 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 54), నజ్ముల్ హుస్సేన్ షాంటో(86 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 67), మోసాడెక్ హోస్సేన్(70 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 86నాటౌట్) హాఫ్ సెంచరీలతో రాణించారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 3 వికెట్లు, లియామ్ స్కాట్, మ్యాట్ రేన్‌షా రెండేసి వికెట్లు, గ్జేవియర్ బార్ట్‌లెట్ ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం ఆస్ట్రేలియా వర్షంతో మ్యాచ్ ఆగిపోయే సమయానికి 42.2 ఓవర్లలో 9 వికెట్లకు 191 పరుగులే చేసింది. ఆ తర్వాత వర్షం తగ్గకపోవడంతో అంపైర్లు డక్‌వర్త్ లూయిస్ ప్రకారం మ్యాచ్ ఫలితాన్ని తేల్చారు. అలెక్స్ క్యారీ(47), కామెరూన్ గ్రీన్(52 నాటౌట్), కూపర్ కనోల్లీ(35) మినహా అంతా విఫలమయ్యారు.






## టెస్ట్ ర్యాంకింగ్స్‌లో.. వరల్డ్ నంబర్ 1గా బ్రూక్

### ఎనిమిదో స్థానంలో భారత్ కెప్టెన్ గిల్

**న్యూఢిల్లీ:** ఐసిసి టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ తన సహచరుడు జో రూట్‌ను అధిగమించి నెం.1 స్థానాన్ని తిరిగిదక్కించుకోగా, అఫ్ఘనిస్తాన్‌తో ఇటీవల జరిగిన ఏకైక మ్యాచ్‌లో సెంచరీ సాధిం చిన భారత కెప్టెన్ శుభ్‌మన్‌గిల్ రెండు స్థానాలు ఎగబాకి ఎనిమిదో స్థానానికిచేరుకున్నాడు. ఆ మ్యాచ్‌లో భారతజట్టు ఇన్నింగ్స్ మరియు 300 పరుగుల తేడాతో విజయం సాధించింది. లార్డ్స్‌లో జరిగిన ఐసిసి ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ గేమ్‌లో న్యూజిలాండ్‌పై ఇంగ్లండ్ 115 పరుగుల తేడాతో విజయం సాధించగా, ఆ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అర్ధసెంచరీ చేసిన తర్వాత బ్రూక్ తిరిగి నంబర్ వన్ స్థానానికి చేరుకున్నాడు. ఎనిమిది పరుగులు మాత్రమేచేయడంతో రూట్ మూడో స్థానానికి పడిపోగా, ఆస్ట్రేలియాకు చెందిన ట్రావిస్ హెడ్ రెండో స్థానానికి ఎగబాకాడు. ఇక న్యూ చండీగఢ్‌లో ఆఫ్ఘనిస్తాన్‌పై 126 పరుగులు చేసిన గిల్ ఎనిమిదో స్థానానికి చేరుకున్నాడు. ఇంగ్లాండ్ త్రయం బెన్ డకెట్ (మూడు స్థానాలు ఎగబాకి 15వ స్థానానికి), జేమీ స్మిత్ (ఐదు స్థానాలు ఎగబాకి 23వ స్థానాన్ని సమంగా చేర్చాడు) మరియు గ్లెన్ ఫిలిప్స్ (40వ స్థానానికి)కూడా బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో పురోగతి సాధిం చారు. బౌలింగ్‌లో ఇంగ్లండ్ పేసర్ గస్ అట్కిన్సన్ ఏడు స్థానాలు ఎగబాకి టాప్ 10 టెస్ట్ బౌలర్లలో పదవ స్థానంలోకి ప్రవేశించగా, ఆల్ రౌండర్లలో ఆరవ స్థానానికి చేరుకున్నాడు.

## అంటాల్యా ప్రపంచ కప్‌లో.. తొలి రౌండ్‌లోనే

## భారత్ ఆర్చర్లు నిష్క్రమణ




**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ మూడవ దశలో, వ్యక్తిగత ఈవెంట్ల రౌండ్ ఆఫ్ 64లో వర్ధమాన తార సాహిల్ జాదవ్‌తో సహా నలుగురు ఆర్చర్లు నిష్క్రమించడంతో, భారత కాంపౌండ్ ఆర్చరీ ప్రచారం ఆరంభంలోనేముగిసింది. అంటాల్యలో జరుగుతున్న ఈ పోటీల్లో అద్భుతమైన క్వాలిఫి కేషన్ రౌండ్ తర్వాత నాకౌట్ దశలోకి ప్రవేశించిన సాహిల్, మెక్సికోకు చెందిన జువాన్ గుటియెరెజ్‌తో హోరాహోరీగా జరిగిన పోరులో 145-147 తేడాతో ఓడిపోయాడు. అలాగే రిషబ్ యాదవ్, చికిత్సా తానిపర్తి, పృథికా ప్రదీప్ కూడా తొలి నాకౌట్ రౌండ్‌లోనే నిష్క్రమించడంతో వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్లలో భారతదేశానికి పరిమిత ప్రాతినిధ్యం లభించింది. పురుషుల కాంపౌండ్ విభాగంలో సాహిల్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారిలో ఒకడిగా నిలవగా, అనుభవజ్ఞురాలైన వెన్నం జ్యోతి సురేఖ భారత మహిళల విభాగానికి నాయకత్వం వహించింది. వ్యక్తిగత ఫలితాలు నిరాశపరిచినప్పటికీ, టీమ్ పోటీలలో భారత్ గట్టి పోటీలో ఉంది. సాహిల్ జాదవ్, గణేష్ మణి రత్నం తిరుమూరు, కుశాల్ దలాల్‌లతో కూడిన పురుషుల కాంపౌండ్ జట్టు క్వాలిఫికేషన్‌లో అనుకూలమైన స్థానాన్ని సంపాదించి, నాకౌట్ రౌండ్లలో ముందుకు సాగాలని చూస్తోంది. జ్యోతి సురేఖ వెన్నం, చికిత్సా తానిపర్తి, పృథికా ప్రదీప్‌లతో కూడిన మహిళల కాంపౌండ్ జట్టు కూడా సునాయాసంగా ముందంజ వేసి, పతక పోటీదారులలో నిలిచింది.




## స్పేస్‌ఎక్స్ ఐపిఒకు భారీ స్పందన..

### 75 బిలియన్ డాలర్ల ఆఫర్‌కు 250 బిలియన్ డాలర్ల డిమాండ్

**న్యూయార్క్,జూన్ 10:** అమెరికా అంతరిక్ష సంస్థ స్పేస్‌ఎక్స్ ఐపిఒకు పెట్టుబడిదారుల నుంచి అపూర్వ స్పందన లభించింది. కంపెనీ సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్న 75 బిలియన్ డాలర్లకు వ్యతిరేకంగా 250 బిలియన్ డాలర్లకు పైగా బిడ్ల డిమాండ్ నమోదైనటు బుధవారం వెల్లడించింది.ప్రపంచంలోనే అతిపెద్ద ఐపీఓగా భావిస్తున్న ఈ ఇష్యూ ప్రస్తుతం నాలుగు రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ముఖ్యంగా సౌదీ అరేబియా, కువైట్‌కు చెందిన సంపద నిధులు ఒక్కొక్కటి 1 బిలియన్ డాలర్ల నుంచి 5 బిలియన్ డాలర్ల వరకు ఆర్డర్లు ఇచ్చినట్లు నివేదికలు సూచిస్తున్నాయి. స్పేస్‌ఎక్స్ ప్రస్తుతం తన మార్కెటింగ్ ప్రచార కార్యక్రమాన్ని కొనసాగిస్తోంది. కంపెనీ అధ్యక్షురాలు గ్వైన్ షాట్‌వెల్ మరియు ఆర్థిక విభాగాధిపతి బ్రెట్‌జాన్సన్‌లు న్యూయార్క్ నగరంలోని మోర్గాన్ స్టాన్లీ కార్యాలయంలో సుమారు 300 మంది సంస్థాగత పెట్టుబడిదారులతో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి డాన్ సిమ్‌కోవిట్జ్ ఆతిథ్యం ఇచ్చారు. ప్రస్తుతం వెల్లడవుతున్న సబ్‌స్క్రిప్షన్ గణాంకాలు తుది కేటాయింపులను సూచించవని, ఇవి పెట్టుబడిదారుల ఆసక్తిని మాత్రమే ప్రతిబింబిస్తాయని నిపుణులు చెబుతున్నారు. షేర్ ధర నిర్ణయించిన తర్వాతే తుది కేటాయింపులు ఖరారు కానున్నాయి. రోడ్‌షో ప్రదర్శనలు, ఐపీఓ పత్రాల్లో స్పేస్‌ఎక్స్ తన ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవ స్టార్‌లింక్ పటిష్టమైన వృద్ధిని ప్రస్తావించింది. రాకెట్ ప్రయోగాల వ్యాపారంలో తన ప్రత్యేకతను కూడా హైలైట్ చేసింది. గత మూడు సంవత్సరాల్లో భూమి కక్ష్యలోకి పంపిన మొత్తం భారంస్పేస్‌ఎక్స్‌లో అత్యధిక భాగం తమ రాకెట్ల ద్వారానే వెళ్లిందని కంపెనీ పేర్కొంది.ఇక కృత్రిమ మేధస్సు సామర్థ్యాలను ఆధారంగా చేసుకుని సుమారు 23 ట్రిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశాలు ఉన్నాయని స్పేస్‌ఎక్స్ పెట్టుబడిదారులకు ఈ నేపథ్యంలో స్పేస్‌ఎక్స్ ఐపీఓకు లభిస్తున్న విశేష స్పందన ప్రపంచ పెట్టుబడి మార్కెట్ల దృష్టిని ఆకర్షిస్తోంది. కంపెనీ తుది ధర నిర్ణయం, షేర్ల కేటాయింపు ప్రక్రియపై ఇప్పుడు మార్కెట్ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# సెన్సెక్స్, నిఫ్టీల్లో మిశ్రమ ట్రేడింగ్..

### లాభనష్టాలతో రెండో రోజు ఊగిసలాట..!

**ముంబై, జూన్ 10:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం రోజంతా ఒడిదుడుకులకు లోనయ్యాయి. ప్రారంభంలో నమోదైన భారీ లాభాలు చివరి గంటలో కరిగిపోయాయి. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు లాభాలస్వీకరణకే మొగ్గుచూపించారు. అంతర్జాతీయ ధోరణులు క్షీణత, పశ్చిమాసియాలో మళ్లీ పెరిగిన భౌగోళిక ఉద్రిక్తతలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. డిమాండ్ మందగింపు ఆందోళనల నేపథ్యంలో మెటల్ షేర్లు భారీగా నష్టపోయాయి. ఎఫ్‌ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్లు కొంత మద్దతు ఇవ్వగా, మెటల్, రియాల్టీ రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది.ఎస్అండ్‌పీ బీఎస్ఈ సెన్సెక్స్ 64.42 పాయింట్లు పెరిగి 73,983.18 వద్ద ముగిసింది. నిఫ్టీ50 మాత్రం 27.15 పాయింట్లు క్షీణించి 23,214.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో భారతి ఎయిర్‌టెల్ 1.32 శాతం, ఇన్ఫోసిస్ 0.87 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82 శాతం నష్టాలతో ఒత్తిడిని పెంచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.36 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.13 శాతం పడిపోయాయి. బీఎస్ఈలో 1,472 షేర్లు లాభపడగా, 2,748 షేర్లు నష్టపోయాయి. 161 షేర్లలో మార్పు లేదు. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి




6.89 శాతానికి చేరుకుంది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ 95.28 వద్ద ట్రేడైంది. ఎంసీఎక్స్‌లో ఆగస్టు 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధర 2.19 శాతం క్షీణించి రూ.1,49,110కు పడిపోయింది. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.53 శాతానికి పెరిగింది. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 13 సెంట్లు పెరిగి 91.58 డాలర్లకు చేరుకుంది. యూరోపియన్ మార్కెట్లు నష్టాల్లోకి జారాయి. ఆసియా మార్కెట్లు కూడా అధికంగా నష్టాలతో ముగిశాయి. వాల్ స్ట్రీట్‌లో ఎస్అండ్‌పీ 500 సూచీ 0.26 శాతం, నాస్‌డాక్ 0.97 శాతం క్షీణించగా, డౌజోన్స్ మాత్రం 0.17 శాతం లాభపడింది. ఏజిస్ లాజిస్టిక్స్ షేరు 2.34 శాతం పెరిగింది. ఎలైట్‌కాన్ ఇంటర్నేషనల్ 19.18 శాతం ఎగిసింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ 0.82 శాతం పడిపోయింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మెటాతో కలిసి 168 మెగావాట్ల ఏఐ ఆధారిత డేటా సెంటర్ నిర్మించనున్నట్లు ప్రకటించింది.న్యూక్లియస్ సాఫ్ట్‌వేర్ ఎక్స్‌పోర్ట్స్ 14.56 శాతం జంప్ చేసింది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజరేషన్ 1.92 శాతం లాభపడింది. రూ.235.26 కోట్ల పెట్టుబడికి బోర్డు ఆమోదం తెలిపింది.డిక్సన్ టెక్నాలజీస్ 1.07 శాతం క్షీణించింది. జెమ్‌టెక్ టెక్నాలజీతో జాయింట్ వెంచర్ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది.క్లీన్ మ్యాక్స్ ఎన్విరో ఎనర్జీ సొల్యూషన్స్ 8.37 శాతం పెరిగింది. కాన్‌కార్డ్ బయోటెక్ 4.60 శాతం లాభపడింది. టోఫాసిటినిబ్ టాబ్లెట్లకు అమెరికా ఎఫ్‌డీఏ ఆమోదం లభించింది.ఆఫ్‌కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ 4.61 శాతం ఎగసింది. జేటీఎల్ ఇండస్ట్రీస్ 4.62 శాతం పడిపోయింది. మార్సన్స్ 2.64 శాతం, వెరాండా లెర్నింగ్ 2.03 శాతం తగ్గింది. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్ షేర్లు బీఎస్ఈలో రూ.192 ఇష్యూ ధరతో పోలిస్తే 43.44 శాతం ప్రీమియంతో రూ.275.40 వద్ద లిస్టయ్యాయి. అనంతరం కొంత లాభాల స్వీకరణతో రూ.247.90 వద్ద ముగిశాయి. ఇది ఇష్యూ ధరపై 29.11 శాతం ప్రీమియాన్ని సూచిస్తోంది. బీఎస్ఈలో కంపెనీకి చెందిన 38.23 లక్షలకుపైగా షేర్లు ట్రేడయ్యాయి.

## ఆర్‌బీఐ కొత్త మార్గదర్శకాలు


### సెబీ రిజిస్టరు అయిన రీట్‌లకే బ్యాంకుల రుణాలు

### 80శాతం నగదురాబడుల అంచనాలకు అనుగుణంగానే పరపతి

### రిజర్వుబ్యాంకు కొత్త మార్గదర్శకాలు..

**ముంబై, జూన్ 10:** రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు రీట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు ఇన్విట్‌లకు బ్యాంకులు రుణాలు అందించే విధానంపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ బుధవారం తుది మార్గదర్శకాలను విడుదల చేసింది. ఈ మార్గదర్శకాల ద్వారా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయడంతో పాటు వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ పెట్టుబడి సాధనాల ఫైనాన్సింగ్‌కు స్పష్టమైన చట్రాన్ని రూపొందించింది.సవరించిన నిబంధనల ప్రకారం, భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ)లో నమోదై, గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్ పొందిన రీట్‌లకు మాత్రమే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి.అలాగే ఇన్విట్‌లపై తమ రుణ ఎక్స్‌పోజర్‌కు సంబంధించి బ్యాంకులు బోర్డు ఆమోదించిన విధానాలను రూపొందించాలని ఆర్‌బీఐ ఆదేశించింది. ఈ విధానాల్లో రుణ అర్హత పరిశీలన, రుణ మంజూరు ప్రక్రియలు, అండర్‌రైటింగ్ ప్రమాణాలు, రిస్క్ మేనేజ్‌మెంట్, పర్యవేక్షణ వ్యవస్థలు వంటి కీలక అంశాలు తప్పనిసరిగా ఉండాలి.ఆదాయాన్ని అందించే రియల్ ఎస్టేట్ ఆస్తులను నగదీకరించేందుకు రీట్స్ కీలక వేదికలుగా ఎదుగుతున్న నేపథ్యంలో, సమర్థవంతమైన రుణ విధానాలను ప్రోత్సహిస్తూ వాటి నిధుల అవసరాలకు మద్దతు అందించడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశమని ఆర్‌బీఐ పేర్కొంది.కొత్త నిబంధనల ప్రకారం,రీట్‌లు తీసుకునే రుణాలు సంబంధిత నియంత్రణ నిబంధనల్లో పేర్కొన్న అర్హత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా బ్యాంకులు నిర్ధారించాలి. రుణంగా పొందిన నిధులు అనుమతించిన అవసరాలకే వినియోగిస్తున్నాయో లేదో బ్యాంకులు నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంటుంది.ఆర్‌బీఐ నిర్దేశించిన ప్రకారం, లిస్టెడ్‌రీట్స్‌ల ఆస్తులలో కనీసం 80 శాతం పూర్తయి, ఆదాయం సమకూర్చే మరియు సానుకూల నగదు ప్రవాహాన్ని కలిగించే ఆస్తులు ఉం డాలి. అలాంటి రీట్‌లకు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇవ్వగలవు.ఏకాగ్రత రిస్క్‌ను తగ్గించేందుకు ఆర్‌బీఐ రుణ పరిమితిని కూడా విధించింది. ఒక రీట్‌కు బ్యాంకు ఇచ్చే మొత్తం రుణ ఎక్స్‌పోజర్, ఆ రీట్‌ఆస్తుల విలువలో 49 శాతాన్ని మించకూడదు.రిస్క్ నియంత్రణ చర్యలను మరింత బలోపేతం చేస్తూ, రీట్,ఇన్విట్‌లకు మంజూరు చేసే అన్ని రుణాలు పూర్తిస్థాయి సెక్యూరిటీతో ఉండాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది.ఈ తుది మార్గదర్శకాలు బ్యాంకులు, పెట్టుబడిదారులకు మరింత స్పష్టతను అందించడంతో పాటు ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతూ రుణాల లభ్యతను సమతుల్యం చేయడంలో సహాయపడతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలాగే స్థిరమైన రాబడులు సృష్టించే రియల్ ఎస్టేట్ ఆస్తులను నిర్వహించే రీట్స్‌ల వ్యాపార నమూనాకు అనుగుణంగా బ్యాంకుల రుణ విధానాలను ఈ కొత్త చట్రం సమన్వయం చేస్తుంది.

## ఎరువుల సబ్సిడీ రెట్టింపుచేయాలని ఆర్థికశాఖకు ప్రతిపాదనలు




**న్యూఢిల్లీ, జూన్ 10:** పశ్చిమ ఆసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో ఎరువుల ధరలు భారీగా పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఎరువుల సబ్సిడీ కేటాయింపును రెట్టింపు చేయాలని కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రిత్వ శాఖ ఆర్థిక మంత్రిత్వ శాఖను కోరింది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీ కోసం రూ.1.77 లక్షల కోట్లు కేటాయించారు. అయితే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు వేగంగా పెరగడం, సరఫరా పరిస్థితులు కఠినంగా మారడంతో ఈ కేటాయింపును 100 శాతం పెంచాలని ఎరువుల శాఖ ప్రతిపాదించింది. ఎరువుల ధరలు పెరుగుతున్న వేగాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్సిడీ కేటాయింపును రెట్టింపు చేయాలని ఎరువుల శాఖ కోరింది. ఒకవైపు సరఫరా పరిమితంగా ఉండగా, మరోవైపు డిమాండ్ బలంగా కొనసాగుతోందని ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి పేర్కొన్నారు. ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, యూరియాపై సబ్సిడీ భారం గణనీ యంగా పెరిగింది. ఒక్కో యూరియా సంచిపై ప్రభుత్వం అందించే సబ్సిడీ సుమారు రూ.2,900 నుంచి దాదాపు రూ.4,500కు పెరిగింది. దీంతో ప్రభుత్వ ఆర్థిక వనరులపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతోంది. ఎరువుల కోసం రైతులపై ఒక్క రూపాయి అదనపు భారం కూడా మోపలేం. అంతర్జాతీయ ధరలపై మనకు పెద్దగా నియంత్రణ లేదు. ఈ పరిస్థితి ప్రభుత్వ ఖజానాపై గణనీయమైన ఒత్తిడిని సృష్టిస్తోందని ఓ సీనియర్ ప్రభుత్వ అధికారి తెలిపారు. అదే సమయంలో దేశీయ ఉత్పత్తిని పెంచేందుకు చర్యలు కొనసాగుతుండటం వల్ల కొంత మేర ఒత్తిడి తగ్గే అవకాశం ఉందన్నా. భారత్ తన ఎరువుల అవసరాల్లో సుమారు 25 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. దేశీయ ఎరువుల ఉత్పత్తి 2024లో 50.95 మిలియన్ టన్నుల నుంచి 2025లో 52.5 మిలియన్ టన్నులకు పెరిగినప్పటికీ, అంతర్జాతీయ ధరల పెరుగుదల ప్రభావాన్ని పూర్తిగా ఎదుర్కోవడానికి ఇది సరిపోకపోవచ్చని అధికారులు అభిప్రాయపడ్డారు. సబ్సిడీ భారం పెరుగుతున్నప్పటికీ, రానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో అదనపు నిధుల కోసం అనుబంధ డిమాండ్ ద్వారా నిధులు కోరే ప్రతిపాదన ప్రస్తుతం లేదని ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేశాయి. ప్రపంచ ఎరువుల మార్కెట్ మరింత సంక్లిష్టంగా మారుతోంది. పలువురు సరఫరాదారులు మార్కెట్‌కు దూరంగా ఉండటంతో అందుబాటులో ఉన్న వనరులు తగ్గుతున్నాయి. గత రెండేళ్లుగా మార్కెట్‌లో పెద్దగా కనిపించని చైనా మళ్లీ సరఫరాలు ప్రారంభించినప్పటికీ, సరఫరా వైపు అనిశ్చితులు ఇంకా కొనసాగుతున్నాయని ప్రభుత్వం చెపుతోంది. ఇక ఎరువుల ధరలతో పాటు వాతావరణ పరిస్థితుల ప్రభావంపై కూడా విధాన నిర్ణేతలు నిశితంగా గమనిస్తున్నారు. ఎల్‌నినో పరిస్థితులు వ్యవసాయం, దేశ ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రభావాన్ని జూలై తర్వాత సమీక్షించనున్నట్లు వర్గాలు తెలిపాయి. రుతుపవనాల పనితీరు, పంటల దిగుబడిపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ అంశానికి ప్రాధాన్యం పెరిగింది.

**వాణిజ్యం**



## ఈసీఎల్జీఎస్ పథకం కింద రూ.48,484 కోట్ల రుణగ్యారంటీలు

**న్యూఢిల్లీ,జూన్ 10:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అత్యవసర క్రెడిట్ లైన్‌హామీ పథకం ఇసిఎల్‌జిఎస్ అమలులో ఇప్పటివరకూ 1,06,549 గ్యారంటీలను జారీచేసినట్లు కేంద్రం ప్రకటించింది. ఈ పథకం కింద మొత్తం రూ.48,484 కోట్ల విలువైన గ్యారంటీలు మంజూరయ్యాయని 96శాతం ఎంఎస్ఎంఇలకు అందచేసినట్లు కేంద్రం ప్రకటించింది. మొత్తం గ్యారంటీ విలువల్లో ఎంఎస్ఎంఇ రంగం వాటా 86శాతంగా ఉంది. ఈ పథకం అమలులో ప్రభుత్వరంగ బ్యాంకులు కీలకపాత్రపోషిస్తున్నట్లు కేంద్రం వెల్లడించింది. ఎంఎస్ఎంఇకిందకురాణి దరఖాస్తులకు మంజూరైన రుణాలపై 90శాతం గ్యారంటీ కవరేజి ఇస్తున్నట్లు కేంద్రంపారిశ్రామిక శాఖ వివరించింది. అర్హులైన రుణ లబ్దిదారులకు రూ.2.55 లక్షలకోట్లవరకూ మొత్తం రుణాలు అందించాలనే ఈ అత్యవసర క్రెడిట్‌లైన్ గ్యారంటీ స్కీం ప్రధాన లక్ష్యంగా కేంద్రం వివరించింది.



## మూడో విడత పీఎల్ఐ స్కీంకు 96 పరిశ్రమల ఎంపిక

### రూ.12,822.67 కోట్ల పెట్టుబడుల రాక అంచనా

**న్యూఢిల్లీ, జూన్ 10:** దేశీయ వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉత్ప త్తి ఆధారిత ప్రోత్సాహకపథకం మూడో విడ తలో మొత్తం 96 కంపెనీలను ఎంపిక చేసినట్లు కేంద్రం బుధవారం వెల్లడించింది. ఈ కంపెనీలు కలిపి రూ. 12,822.67 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయని తెలిపింది. టెక్స్‌టైల్స్ మంత్రి త్వ శాఖ ప్రకారం, పీఎల్ఐ టెక్స్‌టైల్స్ పథకం మూడో రౌండ్ కింద తాజాగా నిర్వహించిన సమావేశంలో 22 కొత్త దరఖాస్తుదారులకు ఆమోదం లభించింది. ఈ 22కొత్తగా ఎంపికైన సంస్థలు రూ. 2,339.14 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. వీటి ద్వారా నోటిఫై చేసిన ఉత్పత్తుల విభాగంలో రూ.15,561.34 కోట్ల టర్నోవర్ సాధించడంతో పాటు వస్త్ర పరిశ్రమ అంతటా 36,217 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు అంచనా వేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.